Crime News

# ది క్రైమ్ న్యూస్

తెలుగు దినపత్రిక

శనివారం, మే 02, 2026 | సంపుటి - 20 | సంచిక 226 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ఆర్టీసికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

### ప్రభుత్వంలో సంస్థ విలీనంతో చిత్తశుద్ధి చాటాం

### మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్




సిద్దిపేట : ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వం మాదిరి వారు సమ్మె పట్టించుకోకుండా ఉండలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. 2లో

## పెట్రో ధరలు పెంచడం లేదు

### ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడి




న్యూఢిల్లీ : దేశంలోని వాహనదారులకు, సామాన్య వినియోగదారులకు ఊరటనిచ్చే వార్తను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని సవరించినప్పటికీ, పెట్రోల్, డీజిల్ ధరలలో ప్రస్తుతానికి ఎలాంటి మార్పు ఉండబోదని, అవి స్థిరంగానే కొనసాగుతాయని స్పష్టం చేసింది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల ఒడిదొడుకులు తరువాయి 2లో

## భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్




### 19 కిలోల సిలిండర్‌పై రూ.993 పెంపు

### హోటళ్లు,రెస్టారెంట్లు,ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లపై తీవ్ర భారం

న్యూఢిల్లీ : పశ్చిమాసియా ఉద్రిక్తతలు ప్రపంచ ఇంధన మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిణామాల ప్రభావం భారత్‌పై స్పష్టంగా కనిపిస్తోంది. ఇందనం సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురోవాల్సి వస్తోంది. చమురు నౌకలను దిగ్భం దించారు. ఈ క్రమంలో కొరత అనివార్యంగా మారింది. ఈ క్రమంలో ముఖ్యంగా వాణిజ్య అవసరాల కోసం ఉపయోగించే 19 కిలోల ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర భారీగా పెరిగింది. దీంతో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీలు వంటి వ్యాపారాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.



## నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

### నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది

### దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్

### డ్రగ్స్ నియంతరణకు మరింత కఠన చర్యలు

### డిజిపిగా సివి ఆనంద్ ప్రమాణస్వీకారం

హైదరాబాద్ : తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా తరువాయి 2లో

## ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

### రూ.1,745 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

### ఎక్స్ వేదికగా హోంమంత్రి అమిత్ షా వెల్లడి



ముంబయి : ముంబయిలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. తరువాయి 2లో

## ధరలపై తాము ముందే చెప్పాం

### గ్యాస్ ధరల పెంపు..ఎలక్షన్ బిల్లు

### పెట్రో, డీజిల్ బాదుడుకు సిద్ధంగా ఉండాలి

### గ్యాస్ ధర పెంపుపై రాహుల్ విమర్శలు



న్యూఢిల్లీ : దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు.

## ఏకంగా రూ.993లకు పెంచడం దుర్మార్గం

### గ్యాస్ ధరల పెంపు సామాన్యుడిపై భారం

### కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్



హైదరాబాద్ : కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో తరువాయి 2లో




## కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

### సిగాచిలో 60 మంది చనిపోతే దిక్కులేకుండా పోయింది

### 120మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడ్డారు

### కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న రేవంత్ సర్కార్

### బిఆర్ఎస అధికారంలో ఉండగా కార్మిక సంక్షేమాన్ని అమలు చేశాం

### మరో రెండేళ్లు ఆగితే మళ్లీ అధికారం బిఆర్ఎస్ పార్టీదే

### మేడు ఉత్సవాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్మిక రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సరైన పని దినాలు, వసతులు కల్పించక ఇబ్బందులపాలు చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి మేడే శుభా కాంక్షలు తెలిపారు. సఫాయిల శ్రమను.. సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించడం లేదు. తరువాయి 2లో



## ఔటర్‌రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

### ఆగివున్న లారీని వేగంగా ఢీకొన్న కారు

### ఆరుగురు అక్కడిక్కడే మృతి..మరొకరి పరిస్థితి విషయం

### మృతులంతా యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ప్రమాదం

హైదరాబాద్,మే1 : శంషాబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఆగి ఉన్న లారీని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరుగురు అక్కడికక్కడే మృతి చెందారు. 2లో

## సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట

### పండించిన పంటల అమ్మకం కోసం యాప్

### 4న ప్రారంభించనున్న మంత్రి తుమ్మల

### నేగుగా సేంద్రియ ఉత్పత్తులు కొనుగోలుకు వీలు



హైదరాబాద్ : తెలంగాణ వ్యవసాయ రంగంలో మరో చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతం కాబోతోంది. సేంద్రీయ సాగు చేస్తున్న రైతులకు అండగా నిలిచేందుకు, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. మే 4వ తేదీన సేంద్రీయ ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం రూపొందించిన ప్రత్యేక మొబైల్ యాప్ టిజి ఆర్గానిక్స్‌ను 2లో



## కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిక పెద్దపీట

### జగన్ విధ్వంసంతో రాష్ట్రంలో అభివృద్ధి వెనుకంజ

### రామచంద్రాపురంలో పెన్షన్లు పంపిణీ చేసిన మంత్రి అనిత

అనకాపల్లి : కూటమి ప్రభుత్వంలో గ్రామాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతున్నాయని హోం మంత్రి అనిత వెల్లడించారు. గత ప్రభుత్వంలో గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. గత ప్రభుత్వం దెబ్బతీసిన వ్యవస్థలను పునరుద్ధరించడంతో పాటు, చంద్రబాబు అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్నారని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించారు. కోటవురట్ల మండలం రామచంద్రపురం గ్రామంలో హోం మంత్రికి గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. రామచంద్రపురం గ్రామంలో హోంమంత్రి ఇంటి ఇంటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం రామచంద్రపురం గ్రామంలో స్వర్గీయ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కోటవురట్ల మండలం సుంకుపురు గ్రామంలో గంగమ్మ తల్లి పండగ సందర్భంగా అమ్మవారిని అనిత దర్శించుకున్నారు. 2లో



## కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం

### తమది కార్మిక పక్షపాత ప్రభుత్వం

### పమిడిముక్కల ప్రజావేదిక సభలో మంత్రి వాసంశెట్టి

విజయవాడ : టీడీపీ జెండాలోనే కార్మికుల కోసం చక్రం చిహ్నంగా ఉందని మంత్రి వాసంశెట్టి సుభాశ్ అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక లక్షల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. 20 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు ఉపాధి పొందుతున్నారని చెప్పారు. పమిడిముక్కల గ్రామంలో నిర్వహించిన ప్రజావేదిక సభలో

## రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కష్టపడుతున్నా

### ప్రజల సంతోషం చూసి కష్టాలు మరచి పోతున్నా

### ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రానికి పూర్వ వైభవం

### లేబర్ అడ్డాలను స్కిల్ సెంటర్లుగా అభివృద్ధికి నిర్ణయం

### గోదావరి పుష్కరాల్లోపే పోలవరం పూర్తి చేస్తాం

### విద్యుత్ చార్జీలు పెంచలేదు..ఇకముందు పెంచబోం

### కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 'పేదల సేవ'లో సిఎం బాబు



విజయవాడ : రాష్ట్రాభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ఏపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదు.. బాధ్యతగా భావిస్తున్నామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వట్లేదు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నాం. 2లో

# ఆర్టీసికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

140 సంవత్సరాలుగా ఏదో ఒక హక్కు డిమాండ్‌తో మేడే నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపోలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్తే వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్గం కార్మిక సంఘాలతో చర్చించి పలు అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని ప్రస్తావించారు. ఈ సమావేశంలో చరిత్రాత్మక నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, కార్మిక సంఘాల ఎన్నికలు, కార్మికులకు 11 శాతం పీఆర్సీ ప్రకటించామని స్పష్టం చేశారు. త్వరలోనే కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ ప్రక్రియను గుర్తింపు పొందిన సంఘం అధికారుల కమిటీ పూర్తి చేస్తుందని తెలిపారు. ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా తాము వ్యవహరిస్తున్నామని అన్నారు. ఆర్టీసీపై ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం, కేబినెట్ మంత్రులు సానుకూలంగా ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లో కొత్తగా 380 రూట్‌లలో కొత్తబస్సులు నడుస్తున్నాయని చెప్పుకొచ్చారు. 7 లక్షల మంది ప్రయాణికులకు కనెక్టివిటీ పెంచామని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రవాణా శాఖ మంత్రిగా.. ప్రభుత్వానికి వారధిగా ఉంటానని స్పష్టం చేశారు. హక్కుల కోసం ఏవిధంగా పోరాడామో సంస్థ అభివృద్ధికి కార్మికులు సమష్టిగా పనిచేయాలని సూచించారు.

# ధరలపై తాము ముందే చెప్పాం

త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ.1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు. 'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనా ప్రభావం పడుతుంది. మొదట ఎల్‌పీజీ గ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్–డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు. ఎన్నికలు ముగిశాక దేశంలో పెట్రోల్ ధరలు పెరుగుతాయని రాహుల్ గాంధీ మంగళవారం పేర్కొన్నారు. 'అలర్ట్‌గా ఉండండి.. ఎన్నికల వల్ల కలిగిన ఉపశమనం ఇక ముగిసినట్టే. ఇంధన ధరలు తక్కువగా ఉన్నప్పుడు మోదీ ప్రభుత్వం లాభాలను దండుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి ధరాభారాన్ని ప్రజలపై పెడుతుంది' అని రాహుల్ అప్పట్లో విమర్శించారు

# సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీట

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించనున్నారు. రసాయన ఎరువులు, పురుగు మందులు, జన్యుమార్పిడి పంటలకు స్వస్తి పలికి.. సహజ వనరులు, సేంద్రీయ ఎరువులతో పంటలు పండించడమే సేంద్రీయ వ్యవసాయం. నేటి ఆధునిక కాలంలో అధిక దిగుబడుల కోసం రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీనివల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు పెరగడమే కాకుండా, మనం తినే ఆహారం విషతుల్యమవుతోంది. వాతావరణం కూడా దెబ్బతింటోంది. ఈ పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా సేంద్రీయ ఉత్పత్తులకు గిరాకీ పెరిగింది. చాలామంది రైతులు ఆసక్తితో సేంద్రీయ సాగు వైపు మొగ్గుచూపుతున్నప్పటికీ.. మార్కెట్‌లో సరైన గుర్తింపు, నాణ్యతా ప్రమాణాలు లేకపోవడం వల్ల వినియోగదారుల్లో నమ్మకం కలగడం లేదు. ఈ సమస్యను అధిగమించేందుకే ప్రభుత్వం యాప్‌ను తీసుకువస్తోంది. దీని ద్వారా రైతులు పండించిన పంటకు సరైన ధర, వినియోగదారులకు కల్తీలేని ఆహారం లభించనున్నాయి. తెలంగాణ సేంద్రీయ సాగులో ఈ యాప్ ఒక నూతన విప్లవానికి నాంది కానుంది. ప్రస్తుతం దాదాపు 500 మంది రైతులు యాప్ లో ఉన్నారు. తెలంగాణలో సేంద్రీయ ధృవీకరణ సేవలు ఇస్తున్న ఇతర రీజినల్ కౌన్సిల్స్ అయిన ఏకలవ్య ఫౌండేషన్, సెంటర్ ఫర్ సస్టెయినబుల్ అగ్రికల్చర్ తో ఇతర ఆర్గానిక్ రైతుల వివారాలు కూడా ఈ యాప్ లో పొందుపరచడం జరుగుతుంది. సుమారు 100 కు పైగా ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ఈ యాప్ లో కస్టమర్లకు అందుబాటులో ఉంచడం జరిగింది .రైతు మొబైల్ నంబర్, చిరునామా, లొకేషన్ వివరాలు పొందవచ్చు .రైతు వద్ద అందుబాటులో ఉన్న దృవీకృంచిన వివిధ ఆర్గానిక్ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయి. తెలంగాణ రాష్ట్ర విత్తన / సేంద్రీయ దృవీకరణ అథారిటీ ద్వారా సేంద్రీయ దృవీకరణ సర్టికెట్లు పొందిన రైతుల వివరాలు మాత్రమే యాప్ లో ఉంటాయి . ఈ యాప్ ద్వారా కేవలం ఆర్గానిక్ రైతు వివరాలు, మరియు అతన వద్ద అందుబాటులో ఉండే ప్రొడక్ట్స్ వివరాలు మాత్రం ఈ యాప్ లో ఉంచడం జరిగింది. ఆర్గానిక్ ప్రొడక్ట్స్ రేటు ను నిర్ణయించే అధికారం రైతుకు మాత్రమే ఉంటుంది. కావునా రైతును నేరుగా సంప్రదించి ధర విషయాలు చర్చించుకోవచ్చు.

# ఔటర్ రింగ్‌రోడ్డుపై ఘోర ప్రమాదం

మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తోంది. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారు. లారీ వెనుక భాగంలో కారు ఇరుక్కుపోయి, నుజ్జునుజ్జు అయ్యింది. ఈ ప్రమాదంపై సమాచారం అందుకోగానే పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. లారీ వెనుక భాగంలో ఇరుక్కుపోయిన కారును యంత్రాల సహాయంతో బయటకు తీసారు. పెద్ద గోల్కొండ ఓఆర్ఆర్ ఎగ్జిట్ 16వ వద్ద ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన కారు నెంబర్ ఆధారంగా వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు వెల్లడించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. యాదగిరిగుట్ట వెళ్లి వస్తుండగా ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు వివరించారు. మృతదేహాలను అతికష్టం మీద వాహనం నుంచి వెలికి తీశారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉన్నారు. అతి వేగమే ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. మృతులంతా సిరిసిల్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న వీరంతా యాదగిరిగుట్ట వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. వీరంతా ఒకే కుటుంబానికి చెందినవారు.

# భగ్గుమన్న కమర్షియల్ సిలిండర్

వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం ఒక్కసారిగా రూ.993 పెంచింది. ఈ పెంపుతో హైదరాబాద్‌లో కమర్షియల్ సిలిండర్ రేటు రూ.3,315కు చేరింది. ఢిల్లీలో 19 కిలోల సిలిండర్ ధర రూ.3,071కి చేరుకుంది. ఢిల్లీలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర గతంలో రూ. 2,078.50 ఉండేది. అదేవిధంగా, ముంబైలో వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.2,031 నుంచి రూ. 3,024కు పెరిగింది. ఇక 5 కిలోల సిలిండర్ ధర రూ.914.50కి పెరిగింది. ముఖ్యంగా పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన ఫిబ్రవరి 28 నుంచి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరలను మూడుసార్లు పెంచింది కేంద్రం. మొదట మార్చిలో రూ.144 పెరగగా, ఏప్రిల్ 1న దాదాపు రూ.200 మేర పెరిగింది. అంతర్జాతీయ మార్కెట్లలో ముడి చమురు ధరలు పెరగడం, సరఫరా ఇబ్బందులు, పశ్చిమాసియా ప్రాంతంలో యుద్ధ పరిస్థితులు వంటి అంశాలు ఈ పెంపునకు ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. వాణిజ్య సిలిండర్ ధరలు భారీగా పెరిగినా.. గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్పీజీ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పులు లేవని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. దీంతో సాధారణ ప్రజలకు కొంత ఊరట లభించింది. గృహ వినియోగ సిలిండర్ ధరలను స్థిరంగా ఉంచడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం పడకుండా కేంద్ర ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇదిలా ఉండగా.. పెట్రోల్, డీజిల్ రిటైల్ ధరలు కూడా యథాతథంగా ఉన్నాయి. మరోవైపు, విమానయాన రంగానికి పెద్ద ఊరటనిస్తూ దేశీయ విమానయాన సంస్థలకు ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరల్లోనూ కేంద్రం ఎలాంటి మార్పులు చేయలేదు.

# నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి. డ్రగ్స్ నియంత్రణలో ఈగల్ పోలీసుబృందం బాగా కృషి చేస్తోంది. శాంతిభద్రతల సమస్య రాకముందే అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ చివరి దశకు చేరుకుందని సీవీ ఆనంద్ అన్నారు. ఈ కేసును ప్రస్తుతం సిట్ విచారిస్తోంది. గతంలో హైదరాబాద్ సీపీగా ఉన్నప్పుడే.. ఈ కేసు గురించి నాకు తెలుసు. త్వరలో ఈ కేసును సమీక్షించి తుది ఛార్జిషీట్ ఫైల్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర డీజీపీగా నియమించిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సీవీ ఆనంద్ ధన్యవాదాలు తెలియజేశారు. ప్రభుత్వ ఆశయాలను నెరవేర్చడం కోసం పూర్తిస్థాయిలో అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణ పోలీస్ దేశంలోనే నంబర్ వన్ పోలీస్‌గా గుర్తింపు పొందిందని.. బ్రాండ్ ఇమేజ్ సాధించిందని అన్నారు. శాంతి భద్రతలు కాపాడటం, నేర నియంత్రణ, నేర దర్యాప్తులో తెలంగాణ పోలీసులు సమర్థవంతంగా పని చేస్తున్నారని ఆయన వ్యాఖ్యానించారు. శాంతి భద్రతలు కాపాడటంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని డీజీపీ సూచించారు. కేసుల దర్యాప్తులో టెక్నాలజీ వినియోగంలో తెలంగాణ పోలీస్ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని డీజీపీ తెలిపారు. గతంలో కంటే ఇప్పుడు నేరాల్లో మార్పులు వచ్చాయని, ప్రస్తుతం సైబర్ నేరాలు భారీగా పెరిగాయన్నారు. సైబర్ నేరాలను అదుపు చేయడంలో జిల్లా ఎస్పీల పాత్ర కీలకంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ సమస్య ఇప్పుడు సమాజంలో విస్తరించిందని.. దాన్ని అరికట్టడం కోసం ఈగిల్, నార్కోటిక్స్ సెల్‌లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. తెలంగాణలో డ్రగ్స్ నిర్మూలనకు టాప్ ప్రయారిటీ ఇస్తామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరోను ఏర్పాటు చేయబోతున్నట్లు సీవీ ఆనంద్ ప్రకటించారు. మహిళల సేఫ్టీ, చైల్డ్ ట్రాఫికింగ్ వంటి సమస్యలు వ్యవస్థీకృత నేరాలుగా మారాయని.. వీటిపై ప్రత్యేక దృష్టి పెడతామని డీజీపీ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల వచ్చే ప్రమాదాలపై కూడా పోలీసు శాఖ మరింత దృష్టి సారిస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ శాఖలో పునర్వ్యవస్థీకరణ చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. నక్సలైట్ల నిర్మూలన కోసం ఏర్పాటైన గ్రేహౌండ్స్, సరైన విధంగా పోలీస్ శాఖలో వినియోగించుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ఉన్న ఖాళీలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తామని.. రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్‌లో మార్పులు తీసుకొస్తామని డీజీపీ తెలిపారు. పోలీస్ శాఖలో అధికారులు.. సంప్రదాయాలు, మర్యాదలు మరచిపోతున్నారని సీవీ ఆనంద్ అన్నారు. వాటిని గుర్తు చేసి, అధికారులు సమన్వయంతో పని చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. నేర దర్యాప్తులో సీసీ కెమెరాలపై మాత్రమే ఆధారపడటం సరికాదని.. సీన్ ఆఫ్ అఫెన్స్‌లో దొరికిన ఆధారాలతోనే కేసులను ఛేదించే పాత పద్ధతులను మళ్లీ తీసుకొస్తామని స్పష్టం చేశారు. గోవధపై పోలీసులే చర్యలు తీసుకుంటారని, ప్రైవేటు వ్యక్తులు రోడ్లపైకి రావొద్దని సీవీ ఆనంద్ హెచ్చరించారు. 1991 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సీవీ ఆనంద్.. 2013 నుంచి 2016 వరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ విధులు నిర్వర్తించారు. 2017లో అదనపు డీజీపీగా పదోన్నతి పొందారు. 2021 డిసెంబర్ 24న హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమితులైన ఆయన.. 2023 ఆగస్టు 7న డీజీగా పదోన్నతి పొందారు. 2024 సెప్టెంబర్ 7న రెండోసారి హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2025 సెప్టెంబర్ 27 నుంచి హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆయన 2028జూన్ వరకు డీజీపీగా కొనసాగనున్నారు.

# రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కష్టపడుతున్నా

లేబర్ అడ్డాలు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారాలి. పని ఉంటే పనికెళ్తారు.. లేని రోజు లేబర్ అడ్డాల్లో నైపుణ్యం పెంచుకుంటారు.తొలి దశలో లేబర్ అడ్డాలు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రస్తుతం మళ్లీ వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. 2027లో గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేస్తాం. ఆ తర్వాత కృష్ణా నదికి అనుసంధానిస్తాం. డిసెంబర్ నాటికి బందర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. హైదరాబాద్– మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోంది. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో హామీ ఇచ్చాం. ఇప్పటి వరకు పెంచలేదు. ఎన్నికలయ్యే వరకు విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నానని పునరుద్ఘాటించారు. గత ప్రభుత్వం విధించిన ట్రూఅప్ ఛార్జీలను ట్రూడౌన్ చేశాం. గత ప్రభుత్వం 9సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచిందని విమర్శించారు. ఇకపై ప్రతి సమావేశంలోనూ ఎమ్మెల్యే పనితీరు గురించి ప్రజలనే అడుగుతా. ఎమ్మెల్యే పనితీరు సరిగా లేకుంటే.. వారికి ఇంకొక ఛాన్స్ ఉండదు. అచ్యుతాపురం, గుంటూరు, కర్నూలులో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. శ్రీసిటీ, తిరుపతి, అమరావతిలో ఈఎస్ఐ ఆస్పత్రులు తీసుకొస్తాం. అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే మా లక్ష్యం. నేర ప్రవృత్తి వ్యక్తులు రాజకీయాలకు పనికిరారు. వైకాపా అధినేతకు మానసిక సమస్య ఉంది. ఒకసారి అవకాశమిస్తే అందర్నీ మోసం, నాశనం చేశారు. ప్రజావేదికను నిర్మిస్తే.. రెండు గంటల్లో కూల్చేశారు. అమరావతి, పోలవరం ప్రాజెక్టును నాశనం చేశారు. అమరావతిని శ్మశానం అని ప్రచారం చేశారు. పోలవరం పూర్తయి ఉంటే.. రైతులు బంగారం పండించేవారు. నీటి ఎద్దడి ఉండేది కాదు. గొడ్డలి పార్టీకి మద్దతిచ్చేవారు ఒకసారి ఆలోచించుకోండి. బాబాయిని హత్య చేసి గుండెపోటు అన్నారు. మరుసటి రోజు నా చేతిలో కత్తి పెట్టి.. నారాసుర రక్త చరిత్ర అని 'సాక్షి'లో రాశారు. విపక్షంలో ఉండేది వైకాపా కాదు.. గొడ్డలి పార్టీ అని చంద్రబాబు అన్నారు. ఈమేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ కాదని.. కోడికత్తి, గొడ్డలి పార్టీగా మారిందని ఎద్దేవా చేశారు. జగన్‌కు మానసిక సమస్య ఉందని సెటైర్లు గుప్పించారు. ప్రజలు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని నాశనం చేశారని.. అలా చేయడమే ఆయనకు అలవాటుగా మారిందని విమర్శించారు. ఆయన మానసిక పరిస్థితి అందరినీ మోసం చేయడమేనని.. ఆ తర్వాత మాట మార్చడమే పనిగా పెట్టుకున్నారని ఆక్షేపించారు. 2019లో అధికారంలోకి వచ్చిన తొలి సమావేశంలోనే ప్రజావేదికను కూల్చేశారని ధ్వజమెత్తారు. రెండేళ్లు కష్టపడి కడితే.. రెండు గంటల్లోనే దానిని కూల్చేశారని మండిపడ్డారు. అమరావతి రాజధాని కావడంతో స్థానిక రైతుల దశా దిశ మారిపోయిందని చెప్పుకొచ్చారు. విశాఖపట్నం తర్వాత అభివృద్ధి, ఆదాయంలో ముందుండేది కృష్ణా జిల్లా అని పేర్కొన్నారు. కార్మికుల కోసం అత్యాధునిక పనిముట్లతో తొలి దశలో 15 నగరాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను నిర్మిస్తామని ఉద్ఘాటించారు. తొలి దశలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తామని చెప్పుకొచ్చారు. తానూ రైతు కుటుంబం నుంచే వచ్చానని.. వారి కష్టం తనకు తెలుసునని ప్రస్తావించారు. జగన్ హయాంలో ప్రజలు, నేతలు బయట తిరిగే పరిస్థితి లేదని పేర్కొన్నారు.ఏపీలో ప్రజలందరికీ మరో స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన ఘనత ఎన్డీఏదేనని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రతి సమావేశంలో ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలనే అడుగుతానని అన్నారు. ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేకుంటే.. వారికి మరోసారి సీటు ఇచ్చే ఛాన్స్ ఉండదని స్పష్టం చేశారు. పోలవరం కోసం కష్టపడి తాము 70 శాతానికి పైగా పనులు పూర్తి చేశామని.. అలాంటి ప్రాజెక్టును నాశనం చేసి.. జగన్ హయాంలో ఆ పనులు నిలిపివేశారని సీఎం చంద్రబాబు దుయ్యబట్టారు. అమరావతి ప్రజా రాజధాని.. మన మైథాలజీలో దేవతల రాజధాని అని అభివర్ణించారు. అలాంటి అమరావతిని ఎడారి అని, శ్మశానమని మొత్తం నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్మాణం చేస్తుంటే.. వారు విధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. మళ్లీ అలాంటి విధ్వంసకర పాలన అధికారంలోకి రాకూడదని ప్రజలు గుర్తించాలని అన్నారు. నరకాసుడి వధ కారణంగా మనం దీపావళి చేసుకుంటున్నామని.. దుర్మార్గుడు చనిపోయారని.. సమాజం బాగుపడింది.. అంటే అలాంటి వారిని మళ్లీ సమర్థించకూడదని అర్థమని అన్నారు. ప్రతి ఒక్కరూ మీ గుండె మీద చేయి వేసుకుని ఆలోచన చేయాలని కోరారు. 2019లో జగన్ మోసాలు తెలుసుకోకుండా.. ఓట్లు వేసి 151 సీట్లు ఆయనకు ఇచ్చి గెలిపించారని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. జగన్ హయాంలోని ఐదేళ్లు విధ్వంసకర పాలన చేశారని ఆగ్రహించారు. తాను, మోదీ, పవన్ కల్యాణ్ కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తే 94శాతం సీట్లతో గెలిపించారని తెలిపారు. తాను అభివృద్ధి చేయడం.. ఆ తర్వాత ఎవరో వచ్చి నాశనం చేయడం ఇలా అవసరమా అని ప్రశ్నించారు. ప్రజలంతా ఆలోచన చేసి.. మరోసారి ఎన్డీఏకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.. సుపరిపాలన ఇచ్చే బాధ్యత తమదని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. సమావేశంలో మంత్రి వాసంశెట్టి ఇసుభాష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక ప్రభుత్వం

ప్రస్తుతం రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక సర్కార్ నడుస్తోంది. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు కాంగ్రెస్ బాధితులయ్యారు. మంత్రుల




జీతాల్లో కోత వేసి ఇస్తామనడానికి వాళ్లు వరద బాధితులా అని అన్నారు. రాష్ట్రంలో 120 మంది ఆటో డ్రైవర్లు ఆత్మహత్య చేసుకున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదు. రెండేళ్లు భరించండి.. కేసీఆర్ వచ్చి కార్మికులకు మేలు చేస్తారని కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికులకు చేతినిండా పని కల్పించి ఆదుకున్నదని, నగరంలో రోడ్లు, వంతెనల నిర్మాణం చేపట్టామని వెల్లడించారు. కోవిడ్ సమయంలో ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు కార్మికులకు ఉచిత రైళ్లను కేసీఆర్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి వల్ల, అసమర్థత వల్ల ఎస్–ఎల్‌బీసీ కుప్పకూలిపోయి చనిపోయిన కార్మికులను అప్పగించలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. సంగారెడ్డి జిల్లా సిగాచీ పరిశ్రమలో అగ్నిప్రమాదం జరిగి 60 మంది సజీవదహనం అయితే పట్టించుకున్న నాథులే లేరని దుయ్యబట్టారు. కోటి రూపాయల నష్ట పరిహారం ఇస్తామని రేవంత్ హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇవ్వలేదని విమర్శించారు. నగరంలో వలసవచ్చి నివాసమేర్పచుకున్న కార్మికుల ఇళ్లను హైడ్రా పేరిట కూల్చి రోడ్డుపాలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో కూల్చివేతలు, ఎగవేతలు, పేల్చివేతలు మాత్రమే జరుగుతున్నవని తెలిపారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, ఎన్నికలకు ముందు దాన,వీర, శూర కర్ణ. ఎన్నికల తరువాత కుంబకర్ణ పాత్రను పోషిస్తున్నాడని దుయ్యబట్టారు. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లలో ఉంటే.. తాము రోడ్లు, వంతెనలు పూర్తి చేశామన్నారు. ' తెలంగాణ అంటే ప్రేమ ఉంది కాబట్టే.. లాక్‌డౌన్‌లో రోడ్లు, వంతెనలు నిర్మించాం. లాక్‌డౌన్ సమయంలో రాష్ట్రంలోని కార్మికులు స్వస్థలాలకు బయల్దేరారు. అభివృద్ధి కార్యక్రమాలు ఆగకూడదనే ఉద్దేశంతో లేబర్ క్యాంపులకు వెళ్లి కార్మికులకు దండం పెట్టి.. రోడ్లు నిర్మించాం అన్నారు. దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 ల నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# ఏకంగా రూ.993లకు పెంచడం దుర్మార్గం

సామాన్యుడిపై పెను భారం మోపారంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడిందని మంత్రి ఆరోపించారు. మోదీ ప్రభుత్వం తక్షణమే స్పందించి ధరల పెంపు నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. కాగా, కమర్షియల్ గ్యాస్ ధరను పెంచుతూ మోదీ సర్కార్ ఈరోజు ఉదయం ఉత్తర్వులు జారీ చేసింది. 19 కేజీల సిలిండర్‌పై ఏకంగా రూ.993 పెంచింది. దీంతో ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో 19 కేజీల సిలిండర్ ధర రూ.3071.50కి చేరింది. కేంద్రం నిర్ణయంపై దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే మోదీ ప్రభుత్వం యథావిధిగా ధరలు పెంచేసిందని ఆగ్రహిస్తున్నాయి. సామాన్యుడి నడ్డి విరిచేలా తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించుకున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ముంబయిలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక చిన్న సరకును గుర్తించి.. దానినుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికి గాను ఎన్‌సీబీ బృందాన్ని ఆయన అభినందించారు. కాగా.. అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరుడు సలీమ్ డోలాను ఇటీవల తుర్కియే నుంచి భారత్‌కు తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇంత పెద్ద మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం చేసుకోవడం గమనార్హం.

# పెట్రో ధరలు పెంచడం లేదు

ప్రభుత్వ పన్నుల సవరణలు జరిగినప్పటికీ, సామాన్య వినియోగదారులపై అదనపు భారం పడకుండా చమురు సంస్థలు జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. ప్రభుత్వం ఇటీవల ఎక్సైజ్ సుంకంలో కొన్ని మార్పులు చేసినప్పటికీ, ఆ ప్రభావాన్ని వినియోగదారులకు బదిలీ చేయకూడదని ప్రభుత్వం, చమురు కంపెనీలు నిర్ణయించాయి. ఇంధన సరఫరా గొలుసులో స్థిరత్వాన్ని కాపాడతామని, పంపిణీలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చూస్తామని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ హామీ ఇచ్చింది. ప్రస్తుతం నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్న తరుణంలో, ఇంధన ధరలు పెరగకపోవడం అనేది రవాణా రంగంపై సానుకూల ప్రభావం చూపుతుంది. తద్వారా కూరగాయలు, ఇతర నిత్యావసరాల రవాణా ఖర్చులు పెరగకుండా ఉంటాయి. అంతర్జాతీయంగా ఇరాన్–అమెరికా మధ్య ఉద్రిక్తతలు, కాల్పుల విరమణ వంటి పరిణామాల వల్ల చమురు మార్కెట్‌లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ, దేశీయంగా ధరలను నియంత్రణలో ఉంచడం గమనార్హం.

# కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధిక పెద్దపీట

ఆపై హోం మంత్రి మాట్లాడుతూ... అంకితభావం, కృషితో సమాజాన్ని ముందుకు నడిపిస్తున్న శ్రామిక సోదర సోదరీమణులందరికీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవ శు భాకాంక్షలు తెలియజేశారు. కార్మికులు, కర్షకులే దేశ ఆర్థిక వ్యవస్థకు పునాది అని అన్నారు. రెండోసారి పొలిట్‌బ్యూరో సభ్యురాలిగా తనకు అవకాశం కల్పించినందుకు సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పోలిట్‌బ్యూరో సభ్యురాలిగా రెండవసారి ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. రామచంద్రపురం గ్రామంలో కోటి 16 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. 2014 -19 సమయంలో పందూర్ బ్రిడ్జిని శంకుస్థాపన చేస్తే... మరలా ఎన్డీఏ ప్రభుత్వంలోనే బ్రిడ్జి పనులు పూర్తి చేశామని చెప్పారు. దేశంలోనే అత్యధికంగా పింఛన్లు ఇచ్చే రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని అన్నారు. పాయకరావుపేట నియోజకవర్గంలో ఔఖీఇఉ÷ూ రూ.40 కోట్లు, ఆర్ అండ్ బి నుంచి 40 కోట్ల రూపాయలతో వివిధ పనులు చేసినట్లు తెలిపారు. పాయకరావుపేట నియోజకవర్గంలో పరిశ్రమల రాకతో పెద్ద సంఖ్యలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు రానున్నాయన్నారు. స్టీల్ ప్లాంట్ రాకతో ఈ ప్రాంతం రూపు రేఖలు మారనున్నాయని, కోటవురట్ల మండలంలో కూడా పరిశ్రమలు తీసుకొస్తామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

# జూన్2 నాటికి జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యకు పరిష్కారం

### న్యాయపరమైన చిక్కుల్లేకుండా ఇళ్లస్థలాలు

### ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్‌తో పాటే అందరికీ స్థలాలు

### ఫ్యూచర్‌సిటీలో ఇవ్వడానికి సిఎం రేవంత్ అంగీకారం

### జర్నలిస్ట్ సంఘాలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,మే1 : అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిజాయితీ, చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే పలు సందర్భాలలో ఇచ్చిన హామీల మేరకు అందరి అభిప్రాయాలను సేకరించి వచ్చేనెల 2వ తేదీనాటికి ఒక కొలిక్కి తీసుకువస్తామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్, జర్నలిస్ట్ హౌసింగ్, డెక్కన్ జర్నలిస్ట్ , తెలంగాణ హౌసింగ్ సొసైటీలతో మంత్రి సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న జర్నలిస్టు హౌసింగ్ సొసైటీలు ఎప్పుడు ఏర్పాటయ్యాయి, అందులో సభ్యుల సంఖ్య, సభ్యత్వానికి అర్హతలు, ఇతర అన్ని అంశాలపై మంత్రిగారు సొసైటీ సభ్యులు అడిగి తెలుసు కున్నారు. జవహర్‌లాల్ నెహ్రూ హౌసింగ్ సొసైటీ మినహా మిగిలిన మూడు సొసైటీలలో సుమారు 2,424 మంది అర్హులైన జర్నలిస్టులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టులు అందరూ ఒకేతాటిపై ఉంటే సమస్యల పరిష్కారం సులువు అవుతుందని, అన్ని సొసైటీలు కలిపి ఒకే వేదికపైకి వచ్చి జేఏసీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జర్నలిస్టు సంఘాలలో సభ్యులు కాని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ళ స్థలాలు ఇస్తామని చెబుతూ ఎలాంటి విమర్శలకు, అనుమానాల కు తావు లేకుండా ఇళ్ల స్థలాల మంజూరు జరిగేలా అందరూ సహకరించాలని కోరారు. గతంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాలదేనని, ఇప్పుడు కూడా ప్రజా ప్రభుత్వం వచ్చాక 18 ఏళ్లుగా పరిష్కారం కాని జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ఇళ్ల సమస్యను కొలిక్కి తీసుకువచ్చి రవీంద్ర భారతిలో జర్నలిస్టుల కుటుంబాలతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భూమి అప్పగించినప్పటికీ న్యాయవివాదాల కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని గుర్తు చేశారు. జర్నలిస్ట్ ల సంక్షేమానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకొని జూన్ 2వ తేదీ నాటికి కొలిక్కి తీసుకువస్తామని తెలిపారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో ఉన్నారని ఫ్యూచర్ సిటీలో ఎమ్మెల్యేలు, బ్యూరో క్రాట్స్ తో పాటే హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వారికి సూచన ప్రాయంగా వెల్లడించి సొసైటీలో ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి అందజేయాలని సూచించారు. 18 సంవత్సరాల క్రితమే ఇంటి స్థలాల కోసం ప్రతిసభ్యుడు రెండు లక్షల రూపాయిల చొప్పున చెల్లించారని దీనిని దృష్టిలో పెట్టుకొని ఇళ్ల స్థలాల కేటాయింపులో తమ సొసైటీకి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని ఈ సందర్భంగా సభ్యులు మంత్రిని కోరారు. సమావేశంలో మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాసరెడ్డి, సమాచార పౌరసంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి, సీపీఆర్వో మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు అండగా కూటమి ప్రభుత్వం

మంత్రి మాట్లాడుతూ.. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జగన్ అనేక కంపెనీలను తరమికొట్టారని విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులు ఊచకోతకు గురయ్యారన్నారు. గత ప్రభుత్వంలో కార్మికులు తిండి లేక పస్తులు ఉన్నారని.. వారి జీవితాలను చీకట్లోకి నెట్టారని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఏపీతో పాటు, ఇతర రాష్ట్రాల కార్మికులు రాష్ట్రంలో పనుల కోసం వస్తున్నారని మంత్రి వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ సెంటర్లుగా ఐదు నగరాలను ఎంపిక చేశామని.. వీటిని పదిహేను నగరాలకు విస్తరించాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు తెలిపారు. కార్మికుల కోసం గుప్పెడు ఇసుక కూడా గత ప్రభుత్వం వేయలేదని మండిపడ్డారు. వారి సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోకుండా వారి నిధులు వాడేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వంలో కార్మికుల కష్టాలు తీర్చి, భద్రత, భరోసా ఇచ్చామని వాసంశెట్టి సుభాశ్ తెలిపారు. మే డే సందర్భంగా కార్మికులకు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శుభాకాంక్షలు తెలిపారు. భారతదేశ చరిత్రలో పేదల ఇంటికి వచ్చి పెన్షన్ అందిస్తున్న ఏకైక సీఎం చంద్రబాబు నాయుడు అని అన్నారు. అమ్మో ఒకటో తేదీ వస్తుందా అనే స్థాయి నుంచి.. హమ్మయ్య ఒకటో తేదీ వస్తుంది అనేలా పేదల జీవితాల్లో పెన్షన్ ద్వారా ఆనందం నింపారని తెలిపారు. గత ఐదేళ్లుగా వైసీపీ ఉండగా.. వ్యవసాయం దండగ అనేలా చేశారని మండిపడ్డారు. నేడు చంద్రన్న ఉండగా చింతేల అని రైతులు గుండెల మీద చేయి వేసుకుని చెబుతున్నారన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లో కూటమి ప్రభుత్వం డబ్బులు జమ చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తే కూటమి విజయం చిరస్థాయిగా ఉంటుందన్నారు. అభివృద్ధి, సంక్షేమం, సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టి ముందుకెళుతున్నామని తెలిపారు. పామర్రు నియోజకవర్గంలో ఉన్న ముఖ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. 24 గంటలూ ప్రజల కోసం, రాష్ట్రం కోసం ఆలోచన చేసే ఏకైక నేత చంద్రబాబు అని వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు.

## రైతు ఆత్మహత్యా యత్నం..అడ్డుకున్న పోలీసులు

నిజామాబాద్,మే1 : ధాన్యం కొనుగోలులో జాప్యాన్ని నిరసిస్తూ రైతు డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలం ఎల్లారెడ్డిపల్లెలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే..నెల రోజులుగా కొనుగోలు కేంద్రాల వద్ద పడికాపు కాస్తున్నా ధాన్యం కొనడం లేదని ఆరోపిస్తూ ఎల్లారెడ్డి పల్లి సర్పంచ్ భర్త మరంల శేఖర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన పోలీసులు అతడిని అడ్డుకున్నారు. కాగా, గ్రామ రైతులు రోడ్డుపై ధాన్యం పోసి నిరసన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల ఆందోళన భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## కవిత భయంతో మేల్కొన్న కెసిఆర్

### కబ్జాలను తొలగిస్తున్న హైడ్రాపై అక్కసా

### పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

హైదరాబాద్ : కవిత భయం వల్లే కేసీఆర్ బయటకు వస్తున్నారని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ అన్నారు. ఈ మేరకు తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవితకు మహేశ్ గౌడ్ థాంక్స్ చెప్పారు. కవిత వల్లే మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మేల్కొంటున్నారని వ్యాఖ్యానించారు. హైడ్రా గురించి కేసీఆర్ చదువుకుంటే మంచిదని హితవుపలికారు. కబ్జాల నుంచి విముక్తి కల్పిస్తే కేసీఆర్‌కు వచ్చిన ఇబ్బంది ఏంటి అని ప్రశ్నించారు. హైడ్రా వల్ల బీఆర్ఎస్ నాయకులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. సిటీ చుట్టూ ఉన్న చెరువులను ఆ పార్టీ నేతలే కబ్జా చేశారని ఆరోపించారు. గులాబీ పార్టీ నేతలు ఎందుకు సభలు పెడుతున్నారని పీసీసీ చీఫ్ నిలదీశారు. తాము చేసిన డిక్లరేషన్లు అమలు చేస్తున్నామని.. త్వరలోనే పదవుల భర్తీ ఉంటుందని స్పష్టం చేశారు. నాలుగు రోజుల క్రితం పదవుల భర్తీపై చర్చించినట్లు తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకుంటారని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## పెండింగ్ చలాన్లపై కోర్టు ధిక్కరణ

### పోలీస్ అధికారులకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్ : ట్రాఫిక్ పెండింగ్ చలాన్ల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. కోర్టుధిక్కరణ కింద డీజీపీ సీవీ ఆనంద్, మాజీ డీజీపీ శివధర్ రెడ్డి, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్‌కు హైకోర్టు నోటీసులు ఇచ్చింది. పెండింగ్ చలాన్‌లు ఉంటే వాహనాలు సీజ్ చేయొద్దని ఈ ఏడాది జనవరి 20న హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఏప్రిల్ 9న మల్లికార్జున అనే వ్యక్తి బైక్‌ను పోలీసులు సీజ్ చేశారు. హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించారని ఆరోపిస్తూ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలైంది. హోంశాఖ సెక్రటరీ, డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, రవాణా శాఖ కమిషనర్‌లను ప్రతివాదులుగా పిటిషనర్ చేర్చారు. పిటిషనర్ తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది విజయ్ గోపాల్.. హైకోర్టు ఉత్తర్వులను పోలీసులు అమలు చేయడం లేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాహనం ఆర్సీ బుక్‌ను చూపించినా ట్రాఫిక్ పోలీసులు అంగీకరించడం లేదని న్యాయవాది తెలిపారు. ఈ క్రమంలో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే నెల 19కి హైకోర్టు వాయిదా వేసింది.

## పంజాబ్ అసెంబ్లీలో దుమారం

చండీఘడ్,మే : పంజాబ్ అసెంబ్లీలో దుమారం చెలరేగింది. సీఎం భగవంత్‌మాన్ మద్యం తాగి వచ్చారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపించారు. మే డే సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. పలుమార్లు తడబడ్డారని అన్నారు. సభ్యులందరికీ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని స్పీకర్‌ను కోరారు.

## స్కామ్ రోడ్ల టెండర్లలో గోల్‌మాల్

### ఎక్సెస్ టెండర్లతో దోచుకునే ప్లాన్

### టెండర్లను వెంటన రద్దు చేయాలన్న హరీష్

### రేవంత్ రాకతో మళ్లీ మంచినీటి కష్టాలు అంటూ ట్వీట్

హైదరాబాద్,మే1 : కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన పలు టెండర్లపై బీఆర్ఎస్ నేత మాజీ, ఎమ్మెల్యే హరీశ్ రావు తీవ్ర విమర్శలు చేశారు. గత అసెంబ్లీ సమావేశాల వేళ తాను ప్రస్తావించిన హ్యామ్ రోడ్ల స్కామ్ ఇప్పుడు నిజమైందని అన్నారు. పంచాయతీ రాజ్, ఆర్ అండ్ బీ శాఖల్లో 22 నుంచి 25 శాతం వరకు ఎక్సెస్ టెండర్లు వచ్చాయని ఆరోపించారు. ఆర్ అండ్ బీ శాఖలో రూ.11 వేల కోట్ల టెండర్లకు దాదాపు రూ.15 వేల కోట్ల వరకు వ్యయం పెరిగిందని, పంచాయతీ రాజ్ శాఖలో రూ.6 వేల కోట్ల టెండర్లు రూ.8 వేల కోట్లకు చేరుతున్నాయని విమర్శించారు. ఈ రెండు శాఖల్లో కలిపి వేల కోట్ల రూపాయల అదనపు భారం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై పడుతోందని హరీశ్ రావు పేర్కొన్నారు. జాతీయ రహదారుల టెండర్లు తగ్గింపుతో జరిగితే.. రాష్ట్ర రహదారుల టెండర్లు మాత్రం ఎక్సెస్‌కు వెళుతున్నాయని మండిపడ్డారు. టెండర్లలో 40 శాతం రాష్ట్ర ఖజానా నుంచి వెళ్తే మిగిలిన 60 శాతం కాంట్రాక్టర్లు బ్యాంకు రుణాల ద్వారా సమకూర్చు కుంటారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రుణాలను 15 సంవత్సరాల పాటు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. అయితే, కాంట్రాక్టర్లకు ప్రభుత్వం సావరిన్ గ్యారెంటీ ఇస్తోందని, దీని భారం చివరకు ప్రజలపైనే పడుతుందని మాజీ మంత్రి చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 5 శాతం కంటే ఎక్కువ ఎక్సెస్ టెండర్లు లేవని హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆర్ అండ్ బీ శాఖలో 34 ప్యాకేజీలు, పంచాయతీ రాజ్‌లో 17 ప్యాకేజీలుగా టెండర్లు పిలిచారని.. ఒకే కంపెనీకి 15 టెండర్లు దక్కబోతున్నాయని ఆరోపించారు. ఇక మొబిలైజేషన్ అడ్వాన్స్ అంశంపైనా ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టుల సమయంలో మొబిలైజేషన్ అడ్వాన్స్‌లను వ్యతిరేకించిన రేవంత్ రెడ్డి ఇప్పుడు ఎలా సమర్థిస్తున్నారని ప్రశ్నించారు. ఈ టెండర్లను వెంటనే రద్దు చేసి మళ్లీ పిలవాలని, అలాగే మొబిలైజేషన్ అడ్వాన్స్‌లనూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు రిటైర్ అయిన అధికారులకు ఎక్స్‌టెన్షన్‌లు ఇచ్చి తప్పుడు పనులు చేయిస్తున్నారని ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. దీనిపై పారదర్శకత అవసరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్టంలో తాగునీటి కష్టాలను రేవంత్ రెడ్డి తిరిగి తెచ్చారని హరీష్‌రావు ఆరోపించారు. మార్పు రావాలంటూ ప్రజలను మోసం చేసి నీటి కష్టాలను తీసుకొచ్చిన ముఖ్యమంత్రికి ప్రజలపై ప్రేమ లేదని ట్విటర్ వేదికలో విమర్శించారు. పల్లె నుంచి పట్నం దాకా తాగు నీటి కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పథకాలు ఉన్నాయి. ఫలితం లేదు. పైపులు ఉన్నాయి నీళ్లు రావని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లాలు ఏర్పాటు చేసి తాగు నీరు సరఫరా చేశారని గుర్తు చేశారు. రేవంత్ కనీసం ఆ పథకాన్ని కొనసాగించలేక పోతున్నాడని పేర్కొన్నారు. మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడంతో ఎక్కడ చూసినా మళ్లీ ట్యాంకర్లు, బిందెలు, డ్రమ్ములు దర్శనం ఇస్తున్నాయని వెల్లడించారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన మిషన్ భగీరథ పథకాన్ని కేసీఆర్‌పై కోపంతో నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. నోటి నుండి అబద్దాల ప్రవాహాన్ని పారించడం మానేసి, మిషన్ భగీరథ పైపుల్లో నీళ్లు పారించాలని, ప్రజల కన్నీటి బాధలు తీర్చాలని డిమాండ్ చేశారు.

## వడగాలులపై హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్

### తాగునీటి సమస్య రాకుండా చూడాలి

### చలివేంద్రాలు, మజ్జిగ కేంద్రాలు. ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్ల సరఫరా

### ప్రకృతి విపత్తుల వల్ల నష్టం జరిగితే 15 రోజుల్లో నివేదికలు

### హీట్ వేవ్‌పై 20 విభాగాలతో సమీక్షించిన మంత్రి పొంగులేటి

హైదరాబాద్,మే1 : రాష్ట్రంలో పెరుగుతున్న ఎండలు, వడగాలుల నుంచి ప్రజలను రక్షించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, ఆమేరకు సంబంధిత శాఖలు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ , హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది -2026లో ఎండలు , వడగాలులు అధికంగా వీచే అవకాశం ఉందని, జూన్ 15 వరకు కూడా అధిక ఉష్ణోగ్రతలు ఉంటాయని , ఐఎండి హెచ్చరికల నేపథ్యంలో తీసుకోవలసిన చర్యలపై 20 సంబంధిత శాఖలతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సమీక్షాసమావేశం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ, ఇండియన్ మెట్రాలాజికల్ శాఖ కలిసి సమగ్ర తెలంగాణ స్టేట్ హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్ -2026 ను రూపొందించాయని ఈ సందర్భంగా హీట్ వేవ్ యాక్షన్ ఎ÷-లాన్ -2026ను మంత్రిగారు విడుదల చేశారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ ఈ 45 రోజుల్లో రాష్ట్రంలో గ్రామీణ పట్టణప్రాంతాల్లో ఎక్కడకూడా త్రాగునీటి కొరత రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యంగా మోటార్లు కాలిపోతే 24 గంటల్లో మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు ఆటంకం లేకుండా చూసుకోవాలన్నారు. హైదరాబాద్ నగరంలో డిమాండ్‌కు అనుగుణంగా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని రోజుకు 14 గంటలు ఫిల్లింగ్ చేసి 15వేల ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామని తెలిపారు. అన్నిశాఖలు ముఖ్యంగా పంచాయితీ రాజ్, మున్సిపల్ ,హెల్త్ సమన్వయం చేసుకొని పనిచేయాలన్నారు. ప్రకృతి విపత్తుల వల్ల నష్టపోయిన బాధితులను ఆదుకోవడానికి వీలుగా 15 రోజుల్లోగా ప్రభుత్వానికి నివేదికలను పంపించాలని అధికారులను ఆదేశించారు. వడగాలుల ప్రభావం సామాన్యప్రజలపై పడకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అయినా కూడా అనుకోని పరిస్థితులలో ఎవరైనా చనిపోతే మానవతా దృక్పథంతో వ్యవహరించి తక్షణం ఎక్స్ గ్రేషియో అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో నల్గొండ మంచిర్యాల సూర్యాపేట పెద్దపిల్లి జగిత్యాల ఖమ్మం వరంగల్ కరీంనగర్ మహబూబాబాద్ జిల్లాల్లో వడగాల్పుల ప్రభావం అధికంగా ఉంటుందని ఈ జిల్లాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ఆడుకుంటూ ప్రమాదాలకు గురౌతున్నారని అందువల్ల ఆయా ప్రాంతాలలో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్, పోలీస్ , రెవెన్యూ విభాగాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలకు సంబంధించిన సమాచారం, అధిక ఉష్ణోగ్రతల వేళ ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, కూల్ వార్డుల ఏర్పాటు, ఆసుపత్రులల్లో ÷ర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహణ వంటి అంశాలపై చర్యలు చేపట్టాలని ప్రజా ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రులలో ఓఆర్ఎస్ ప్యాకట్లను అందుబాటులో ఉంచాలని అదేవిధంగా వేడి ప్రదేశాలలో పనిచేసే కార్మికులను రెండు బృందాలుగా విభజించి కనీసం గంట లేదా రెండు గంటల విశ్రాంతి ఇచ్చేలా రొటేషన్ పద్ధతి అవలంభించేలా పరిశ్రమలకు సూచించాలన్నారు. బస్టాండ్లు, మార్కెట్లు, పర్యాటక కేంద్రాలు, ప్రార్థనా స్థలాల వంటి పబ్లిక్ ప్రాంతాలలో అవసరమైన షెల్టర్లు, త్రాగునీరు, వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పబ్లిక్ అడ్రస్ సిస్టమ్,ఎల్ ఇ డి స్క్రీన్ల ద్వారా ప్రచారం కల్పించాలని స్థానిక సంస్థలు, మున్సిపాల్టీలు ముందుజాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

## పాలమూరులో పలు రహదారులకు ప్రారంభాలు

### వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ

### ప్రధాని పర్యటన వివరాలు వెల్లడించిన డికె అరుణ

మహబూబ్‌నగర్,మే1 : నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి అయిన తర్వాత తెలంగాణకు తొలిసారి వస్తున్నారని బీజేపీ ఎంపీ డీకే అరుణ తెలిపారు. పర్యటన సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమ్మక్క, సారక్క గిరిజన విశ్వవిద్యాలయం పనులను కూడా ప్రారంభిస్తారని ఎంపీ తెలిపారు. ఈ పర్యటనలో భాగంగా పాలమూరు జిల్లాలో పలు జాతీయ రహదారుల పనులనూ ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఎంపీ అరుణ వెల్లడించారు.మే 10వ తేదీన హైదరాబాద్‌కు ప్రధాని రానున్నట్లు వెల్లడించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ బహిరంగ సభలో మోదీ పాల్గొంటారని ఎంపీ అరుణ వెల్లడించారు. ఈ సభకు పార్టీ కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలిరావాలని విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని ఎంపీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందని ఆమె ధ్వజమెత్తారు. బీజేపీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని.. తెలంగాణలో ప్రధాని మోదీ తాజా పర్యటన అందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపైనా ఎంపీ స్పందించారు. ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని అరుణ ధీమా వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుందని ఎంపీ అరుణ ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేదని ఆమె ఆగ్రహించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఇండి కూటమి పార్టీలు వ్యతిరేకించి ద్రోహం చేశాయన్నారు. మరోవైపు వచ్చే ఎన్నికల్లో కల్వకుంట్ల కవిత పార్టీకి ఉనికి ఉండదన్నారు. గతంలో వైఎస్ షర్మిల పార్టీ పెట్టి వేరే పార్టీలో ఎలా విలీనం చేశారో.. కవిత పరిస్థితి అలాగే ఉంటుందన్నారు. తండ్రి పేరుతో రాజకీయ లబ్ది పొందాలని కవిత చూస్తున్నారని ఎంపీ డీకే అరుణ ఆరోపించారు.

## సీతారాం ఆత్మహత్య ..నెలలోపే భార్యరేణుక వివాహం

### తాజాగా బయటపడ్డ పెళ్లి వ్యవహారం

### కటకటాల్లో ఊచలు లెక్కిస్తున్న కొత్త దంపతులు

హైదరాబాద్,మే1 : హైదరాబాద్ నగరంలో బాచుపల్లి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సీతారాం ఆత్మహత్య కేసులో సంచలన మలుపు చోటుచేసుకుంది. కట్టుకున్న భార్య మోసాన్ని భరించలేక సీతారాం ప్రాణాలు తీసుకుంటే.. ఆయన చనిపోయిన నెల రోజులకే అతడి భార్య రేణుక మరో వివాహం చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. తన భార్యకు ఆరుగురు ప్రేమికులు ఉన్నారని.. ఆ బాధ తనను మానసికంగా వేధిస్తోందని ఫిబ్రవరి 9న సీతారాం సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే భర్త కర్మకాండలు ముగియకముందే రేణుక తన ప్రియుడు రమణారెడ్డిని వివాహం చేసుకుంది. 2026 మార్చిలో వీరిద్దరూ గుట్టుచప్పుడు కాకుండా పెళ్లి చేసుకున్న ఫోటోలు బయటపడటం కలకల రేపుతోంది. ఈ రమణారెడ్డి గతం చూస్తే మరిన్ని షాకింగ్ విషయాలు బయటపడుతున్నాయి. గతంలోనే వీరిద్దరూ ఏకాంతంగా ఉన్న వీడియోను రమణారెడ్డి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. ఆ వీడియో కుటుంబ సభ్యుల కంటపడటంతో అవమానం భరించలేక అప్పట్లో వీరిద్దరూ ఫినాయిల్ తాగి ఆత్మహత్యాయత్నం కూడా చేశారు. నంద్యాలకు చెందిన రమణారెడ్డి గతంలో షాద్ నగర్‌లో హోటల్ వ్యాపారం నిర్వహించేవాడు. వీడియో వైరల్ వ్యవహారం తర్వాత అక్కడి నుండి మకాం మార్చేశాడు. సీతారాం మరణం వెనుక వీరిద్దరి పాత్ర ఉందన్న ఆరోపణల నేపథ్యంలో.. బాచుపల్లి పోలీసులు రేణుకతో పాటు ఆమె ప్రియుడు రమణారెడ్డిని ఇటీవలే అరెస్ట్ చేశారు.

## నల్లగొండ ఫార్మకంపెనీలో పేలుడు

### రియాక్టర్ పేలడంతో 9మందికి గాయాలు

నల్లగొండ,మే1 : నల్లగొండ జిల్లాలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలి 9 మందికి తీవ్ర గాయాలయ్యాయి. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఉన్న నోష్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంతో అగ్నిప్రమాదం జరిగింది. శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. నోష్ ఫార్మా కంపెనీలో రియాక్టర్ పేలడంతో భారీ ఎత్తున తెల్లటి పొగ ఆకాశంలోకి ఎగసిపడుతోంది. దీంతో భయాందోళనకు గురయ్యారు స్థానికులు. ప్రమాదం జరిగిన సమయంలో 3వ బ్లాక్ లో ఉన్న 9 మందికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. గాయపడ్డవారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. దట్టమైన పొగ కమ్ముకోవడంతో సహాయక చర్యలకు ఇబ్బందిగా మారింది. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై స్పందించిన నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశాలు జారీ చేశారు. తరచు ప్రమాదాలు జరిగుతున్న కంపెనీని సీజ్ చేసి... ప్రమాదం పై పూర్తి విచారణ జరపాలని అన్నారు.

## ఎన్నికల తరవాత ధరల పెంపు మోడీకి అలవాటే

### గ్యాస్ ధరలను పెంచడంపై మండిపడ్డ కెటిఆర్

హైదరాబాద్,మే1 : దేశ చరిత్రలో ఎన్నడు పెంచనంతగా వాణిజ్య సిలిండర్ల మీద రూ.993 పెంచిన ఘనత కేంద్రంలోని నరేంద్ర మోదీ దేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఎన్నికలు అయిపోగానే గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం మోదీకి అలవాటేనని అన్నారు. ఒక్క సిలిండర్ మీద దాదాపు రూ.1000 పెంచి సామాన్యులకు, హోటళ్లలో పని చేసే కార్మికులకు మోదీ మేడే కానుక ఇచ్చాడని దుయ్యబట్టారు. హైదరాబాద్‌లో నిన్నటి వరకు ఒక సిలిండర్ ధర రూ. 2,321 ల నుంచి రూ.3,315 పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హోటళ్లు, మెస్‌ల మీద ఆధారపడి చదువుకునే యువతకు, ఉద్యోగాలు చేసుకునే వారికి ఈ ధరల పెంపు వల్ల ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు. తక్షణమే పెంచి ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## అప్పులు తీర్చడమెలా.. అన్న ఆలోచనేదీ?

అప్పులు తీర్చడమెలా..రాష్ట్రాన్ని ఆర్థికంగా బలోపేతం చేయడమెలా .. అన్న ఆలోచన ప్రభుత్వాలు చేయడం లేదు. కెసిఆర్ చేసిన అప్పుల గురించి ప్రశ్నించినప్పుడు ఆస్తులు సృష్టిస్తున్నామని అనేవారు. ఎపిలో చంద్రబాబుది కూడా అదే పాలసీ. కెసిఆర్ అప్పులు చేసి దివాళా తీసాడని ఆరోపించి, అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి అంతకు మించిన అప్పులు చేస్తున్నారు. చంద్రబాబు కూడా అదే కోవలో ఉన్నారు. జీతాలు, భత్యాలకు డబ్బులు లేవు. ఉచిత పథకాలకు మాత్రం చేతికి ఎముక లేదన్నంతగా దోచిపెడు తున్నారు. ఈ లెక్కన మరో వదందేళ్లయినా అప్పులు తేరవు. వీరు సృష్టించిన ఆస్తులు అప్పులు తీర్చలేవు. ఉన్న భూములను తెగనమ్మేస్తున్నారు. ప్రధానంగా ఖర్చులు తగ్గించుకుని అప్పులు లేకుండా చేసుకునే ప్రణాళికలు రచించాలి. అప్పులు తీర్చడం ప్రథమ కర్తవ్యం కావాలి. ఇందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రజలు అధికారం అప్పగించింది అప్పులు చేయడానికి కాదని గుర్తించాలి. పాలన పేరుతో రాష్ట్రాలను దివాళా తీయించే అధికారం రేవంత్‌కి, చంద్రబాబుకు లేదు. అలాగే దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్లే ప్రయత్నాలను మోడీ కూడా సమర్థించరాదు. 2047 నాటి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిర్మించటం విజన్ డాక్యుమెంట్ లక్ష్యం కనుక, మనం వ్యవసాయరంగంలో అగ్రభాగాన ఉన్నాం కనుక వ్యవసాయోత్పత్తులు, అనుబంధ రంగాలను బలోపేతం చేసుకుంటూ పోతే, ఆర్థికంగా ఎదగడానికి నిచ్చెనగా మారగలదు. దీనికోసం ప్రధానంగా సేవలు, పారిశ్రామిక రంగంపై దృష్టి కేంద్రీకరించాలి. మద్దతుగా వ్యవసాయరంగాన్ని ఆధునీకరించాలి. రైతులు పండించిన ధాన్యాన్ని సక్రమంగా కొనడం లేదు. దానిని ప్రజలకు చేరవేయడం లేదు. గతంలో లాగా చెట్టుపేరు చెప్పి కాయలు అమ్ముకునే దుస్థితి రాకుండా చూసుకోవాలి. ఉచిత పథకాలు రాష్ట్రాల, దేశ ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేస్తున్నా.. అధికారంలో ఉన్నవారు పట్టించుకోక పోవడం వల్లనే రాష్ట్రాలు అప్పుల ఊబిలో కూరుకు పోయాయి. నెలనెలా వడ్డీలకే వేలకోట్లు తగలేయడం వల్ల ఒక్క అభివృద్ధి పని జరగడం లేదు. రాష్ట్రాలు ఆర్థికంగా దివాళా తీస్తున్నా, జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. తెలంగాణలో ఇప్పుడు జీతాలు కూడా అప్పులు చేసి ఇవ్వాల్సి వస్తోంది. విపక్షంలో ఉన్నవారు మరిన్ని ఉచిత పథకాల గురించి డిమాండ్ చేస్తున్నారు. ఈ పథకాలు కొంప ముంచుతున్నా ,రాష్ట్రాలను దివాళా తీయిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. అభివృద్ధిని పక్కనపెట్టి ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికే ఉచితాల మీద ఉచితాలు ప్రకటిస్తున్నారు. వీటివలన పేదలకు చెప్పుకోదగిన శాశ్వత ప్రయోజనం దక్కడం లేదు. ప్రభుత్వాలు ఆర్థికంగా దివాలా తీస్తున్నాయి. ఖర్చులు తగ్గించుకోవడం కోసం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలకు ముందు పెన్షన్లు రద్దు చేయాలి. రాజకీయ ప్రాపకం కోసం అందరికీ కేబినేట్ హోదాతో సలహాదారులను నియించుకోవడం పక్కన పెట్టాలి. అలాగే వీరి జీతభత్యాలను కూడా కనీసానికి తగ్గించాలి. లక్షల కోట్లు అప్పులు తెచ్చి, వడ్డీలు కట్టలేక, ఉద్యోగుల జీతాలు కూడా భారమై ప్రభుత్వాలు నవ్వుల పాలవుతున్న వేళ, సలహాదారులకు లక్షల్లో జీతాలు తగలేయడం సరికాదు. ఇందుకోసం ఉన్న భూములను తెగనమ్మడం, లిక్కర్ ధరలు పెంచడం, భూముల రిజస్ట్రేషన్ ధరలు పెంచడం, పరోక్షంగా పన్నులు బాదడం వంటి చర్యలకు ఒడిగడుతున్నారు. ఉచిత రేషన్, ఉచిత గ్యాస్, ఉచిత ఇల్లు, ఉచిత బియ్యం, ఉచితంగా పెన్షన్ వంటివన్నీ ఖజానాను దివాళా తీయిస్తున్నాయి. ఇందులో అసలు లబ్దిదారుల కన్నా అనర్హులే ఎక్కువ మంది ఉన్నారు. సంక్షేమం అవసరమే కానీ మోతాదు మించకుండా చూసుకోవడం కూడా ముఖ్యమే. తాజాగా తెలంగాణలో మరో ఇద్దరు సలహాదారులను నియమించారు. ఇప్పటికే ఉన్నవారికి తోడు మరో ఇద్దరికి పునరావసం కల్పించాల్సిన అసవరం ఏమొచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేండ్లలో 14మంది సలహాదారులుగా నియమితులయ్యారంటే..వారు ఏంచేస్తారని జనం ప్రశ్నించాలి. వీరంతా క్యాబినెట్ హోదా ఉన్నవారే కావడంతో జీతాలు, భత్యాలు సరేసరి. ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రుల సంఖ్యకు దాదాపు సమానంగా సలహాదారులు ఉన్నారు. వీరంతా లక్షలకు లక్షల జీతాలు, భత్యాలూ అందుకుంటున్నారు. సలహాదారులు రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగిస్తున్నారని ఎన్నికల ముందు చెప్పిన రేవంత్.. ఇప్పుడు మళ్లీ పలువురిని సలహాదారులుగా నియమించారు. అప్పులు తెచ్చి మరీ సలహాదారులకు జీతభత్యాలు ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలు ఇంతమంది సలహా దారులను ఎందుకు నియమిస్తున్నారు. వారు ఏం చేస్తున్నారనేది ఎవరికీ అంతుచిక్కడం లేదు. ఉద్యోగ విరమణ పొందిన అధికారులకు పోస్టులు సృష్టించిమరీ ఎందుకు నియమిస్తున్నారన్నది అర్థం కాదు. కెసిఆర్ చేసిన పనినే రేవంత్ కూడా చేస్తున్నారు. సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను ఆగమేఘాల పై ఢిల్లీ నుంచి తీసుకొచ్చి బాధ్యతలు అప్పజెప్పారు. తాజాగా విహెచ్‌ను, రిటైర్డ్ డిజిపి శివప్రసాద్ రెడ్డిని సలహాదారులుగా నియమించారు. సలహాదారుల పోస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ పునరావాసం కోసం వాడుకొంటు న్నది. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత మూడు రోజులకే ఏడుగురు సలహాదారు లను తొలగించారు. 'రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థికనష్టం కలిగించడంలో సలహాదారుల పాత్ర ఉన్నదని ఆనాడు చెప్పారు. జనవరి 20న అంటే అధికారంలోకి వచ్చిన నెలన్నరకు సీఎం తనకు నమ్మకస్తుడైన వేం నరేందర్‌రెడ్డిని ప్రధాన సలహాదారుగా నియమించారు. క్యాబినెట్ హోదా కల్పించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ష బ్బీర్ అలీకి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఓబీసీ శాఖల ప్రధాన సలహాదారుగా, మరో సీనియర్ నేత హర్కర వేణుగోపాల్‌ను ప్రొటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారుగా నియమించి క్యాబినెట్ హోదా ఇచ్చారు. పార్లమెంటు ఎన్నికల ముందు బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఏపీ జితేందర్‌రెడ్డిని ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా, బీఆర్ఎస్ నుంచి వచ్చిన పోచారం శ్రీనివాసరెడ్డిని వ్యవసాయ శాఖ సలహాదారుగా, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన కేశవరావును పబ్లిక్ ఎఫైర్స్ సలహాదారుగా నియమించారు. మరో మాజీమంత్రి సుదర్శన్ రెడ్డిని కూడా సలహాదారుగా నియమించారు. వీరంతా ఏం సలహాలు ఇస్తారు. తెలంగాణ గట్టెక్కడానికి ఏం చేస్తారన్నది ప్రశ్న. ఖజానాకు గండిపడుతుంటే కొత్తగా ఖర్చులు చేయడం వల్ల ప్రజలపై భారం పడుతుంది. దీనిని లోచించాలి. ఇలాంటి వారిని ప్రజల నెత్తిన రుద్దడం సరికాదు. ఖర్చులు తగ్గించడానికి అవసరమైతే ఓ కన్సల్టెన్సీని నియమించడం మంచిదేమో.

# ఒపెక్‌కు 'యుఎఇ' గుడ్‌బై మేలేనా!




ముడిచమురు ఉత్పత్తి చేసే 12 దేశాల కూటమి (ఒపెక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ది పెట్రోలియం ఎక్స్‌పోర్టింగ్ కంట్రీస్)లో సభ్యదేశంగా ఉత్పత్తి, సరఫరా తదితర వాణిజ్య కార్యకలాపాల్లో పాలుపంచుకుంటున్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ) ఆ కూటమినుంచి బయటపడడానికి నిర్ణయించుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం మే 1 నుంచి అమలులోకి వస్తుంది. దీనివల్ల ముడిచమురు ధరలు ప్రపంచ మార్కెట్‌లో తగ్గే అవకాశం ఉంది. అయితే దీని ప్రభావం వెంటనే కనిపించకపోవచ్చు. 1960లో ఇరాన్, ఇరాక్, కువైట్, సౌదీ అరేబియా ఈ 'ఒపెక్'ను నెలకొల్పాయి. అల్జీరియా, కాంగో, ఈక్వెటోరియల్ గినియా, గాబన్, ఇరాన్, ఇరాక్, కువైట్, లిబియా, నైజీరియా, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, వెనిజులా తదితర దేశాలు ఇందులో సభ్యత్వం కలిగి ఉన్నాయి. ఈ దేశాలతోపాటు రష్యా వంటి ఇతర చమురు ఉత్పత్తి దేశాలు కలిస్తే దానిని 'ఒపెక్ ం' అని పిలుస్తారు. ప్రపంచ మార్కెట్‌లో చమురు వాణిజ్యం 50 శాతం ఈ ఒపెక్ నియంత్రణలోనే ఉంటోంది. చమురు మార్కెట్‌లో ధరల స్థిరీకరణను కాపాడడం, సభ్యదేశాలకు స్థిరమైన ఆదాయం అందించడం ఈ ఒపెక్ లక్ష్యం. ఒపెక్ కూటమిలో ఉంటున్నందున యుఎఇ చమురు ఉత్పత్తిపైన, సరఫరాపైన పరిమితులు భరించవలసి వస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధ బీభత్సం, ఇరాన్ దాడులతో తీవ్ర కష్టనష్టాలను ఎదుర్కోవలసి రావడం, యుఎఇని అల్లకల్లోలం చేస్తోంది. అందుకని ఒపెక్ కూటమి ఉక్కు పంజరంనుంచి బయటపడితేనే కానీ తమకు మేలు జరగదని వైదొలగడానికే నిర్ణయం తీసుకుంది. ఇప్పుడు బయటకు రావడంవల్ల స్వేచ్ఛగా తమకు నచ్చినంత ఎక్కువగా చమురును ఉత్పత్తి చేసి సరఫరా చేసే అవకాశం కలుగుతుంది. రోజుకు ఐదు మిలియన్ బ్యారెళ్ల చమురును ఉత్పత్తి చేసే సామర్థ్యం యుఎఇకి ఉన్నప్పటికీ ప్రస్తుతం 3.4 మిలియన్ బ్యారెళ్ల కన్నా ఎక్కువ ఉత్పత్తి చేయడానికి ఒపెక్ అవకాశం ఇవ్వడం లేదు. ఇది న్యాయం కాదని యుఎఇ ఆందోళనతో ఉంటోంది. ఇక రాజకీయంగా చూస్తే ఇరాన్ తన పొరుగు దేశాలను ముఖ్యంగా యుఎఇ చమురు మౌలిక వనరులే లక్ష్యంగా తరచుగా దాడులు సాగిస్తున్నా సభ్యదేశాలు కానీ, జిసిసి దేశాలు కానీ ప్రతిఘటించకపోవడం యుఎఇలో అసంతృప్తి కలిగిస్తోంది. ఇరాన్‌కు చెందిన ఆర్థిక సంస్థలపై ఆంక్షలు విధిస్తూ, ఇరాన్ అనుబంధ సంస్థల ఖాతాలను యుఎఇ స్తంభింప చేస్తోంది. ఈ పరిస్థితులవల్ల గల్ఫ్‌దేశాల మధ్య చీలిక తలెత్తింది. ఒకవైపు ఇరాన్‌తో సౌదీ అరేబియా ఖతార్ సయోధ్యగా ఉంటుండగా, ఇరాన్‌ను వ్యూహాత్మక ముప్పుగా యుఎఇ భావిస్తూ అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో చేతులు కలుపుతోంది. తరచుగా ఇరాన్ దాడులవల్ల గత రెండు నెలల్లో యుఎఇ విపరీతంగా నష్టపోయింది. ఈ నష్టాలను పూడ్చుకోవడానికి భారీ స్థాయిలో చమురును ఉత్పత్తి, సరఫరా చేయడమే తరుణోపాయంగా యుఎఇ భావిస్తోంది. ఒపెక్సం లో సభ్యదేశాల తీరు కూడా అస్తవ్యస్తంగా ఉంటోంది. సభ్యదేశాల తరపున సౌదీ అరేబియా భారీగా ఉత్పత్తి కోతలను భరిస్తున్నప్పటికీ, మిగిలిన దేశాలు 'ఫ్రీ రైడింగ్' (అధిక ఆదాయం కోసం నిబంధనలు పాటించకపోవడం) చేస్తుండడంతో ఒపెక్సం కూటమిలో చీలికలు వస్తున్నాయి. ఒపెక్స్ సభ్యదేశాలు తమ ఉత్పత్తి కోటాలను పాటించకపోవడం వల్ల చమురు ధరలను నియంత్రించే సామర్థ్యం ఈ మధ్యకాలంలో తగ్గుతోంది. 2024 25 మధ్యకాలంలో ఈ పరిస్థితి మరింత తీవ్రంగా కనిపించింది. అలాగే ఒపెక్సం కూటమిలోని సభ్యదేశాలైన అమెరికా, బ్రెజిల్, గయానా వంటి దేశాల్లో చమురు ఉత్పత్తిని పెంచడంతో ప్రపంచ మార్కెట్‌లో సరఫరా పెరిగి, డిమాండ్ కన్నా ఎక్కువగా నిల్వలు పేరుకుపోతున్నాయి. ఈ పరిస్థితులన్నిటినీ అధ్యయనం చేసి యుఎఇ ఒపెక్‌నుంచి బయటపడితేనే తమ మనుగడ బాగుంటుందన్న నిర్ణయం తీసుకుంది. ఒపెక్‌లో సభ్యులుగా ఉన్న దేశాల్లో మరికొన్ని యుఎఇ విధంగానే బయటపడాలని యోచిస్తున్నాయి. ఇవన్నీ జరిగితే చమురు ఉత్పత్తి బాగా పెరిగి, ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు డిమాండ్ బాగా తగ్గి ధరలు బ్యారెల్‌కు 50 డాలర్ల నుంచి 60 డాలర్ల వరకు తగ్గుతాయని అంచనా. ముడి చమురు వినియోగంలో 85 శాతం దిగుమతులపై ఆధారపడుతున్న భారత్‌కు యుఎఇ వల్ల ప్రయోజనం కలుగుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది. భారత్‌కు ముడి చమురు ప్రధాన సరఫరాదారుల్లో యుఎఇ ఒకటి. చమురు అధికశాతం సాధించుకోవడానికి యుఎఇ తో భారత్ సుదీర్ఘకాల ఒప్పందం చేసుకునే అవకాశం కనిపిస్తోంది. యుఎఇ కూడా హర్మూజ్ జలసంధి అవసరం లేకుండా తన పైపులైన్ ద్వారానే ముడి చమురును సరఫరా చేయాలనే ఆలోచనలో ఉంది. అయితే ప్రస్తుతం హర్మూజ్ జలసంధి దిగ్బంధనం తొలగితేనే కానీ సరైన మార్గం లభించదు. అమెరికా ఇరాన్ దేశాల మధ్య శాంతి ఒప్పందం కుదిరి పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం తొలగిపోతేకానీ చమురు ఉత్పత్తి, విక్రయాలు సరిగ్గా సాగవు. ఒప్పందం కుదిరిన తరువాత ఇరాన్ చమురును స్వేచ్ఛగా అమ్ముకోనిస్తే దిగుమతిదారులకు ఊరట లభిస్తుంది. చమురు ధరలు తగ్గుతాయి. ఇరాన్ ప్రతిపాదనలను అమెరికా అంగీకరించడం లేదు. ఇరాన్‌పై సైనిక చర్యకు మళ్లీ పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు రష్యా హెచ్చరించింది. రెండు దేశాలు వెనక్కు తగ్గితేనే హర్మూజ్ జలసంధి రవాణా యథా ప్రకారం సాగుతుంది. అంతవరకు యుఎఇ ఒపెక్ నుంచి బయటకు వచ్చినా ఫలితం, ప్రయోజనాలు ఎవరికీ అందవు.

## పవన్ ఖేరాకు సుప్రీంలో ఊరట

### షరతులతో కూడిన బియెల్ మంజూరు

న్యూఢిల్లీ,మే1 : కాంగ్రెస్ నాయకుడు పవన్ ఖేరాకు భారీ ఊరట లభించింది. అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ భార్యపై వ్యాఖ్యల కేసులో సుప్రీంకోర్టు ఆయనకు ముందస్తు బెయిల్ జారీ చేసింది. ఈ క్రమంలో ఖేరాకు న్యాయస్థానం కొన్ని షరతులు విధించింది. అస్సాం సీఎం సతీమణి రిణికి భూయాన్ శర్మకు పలు పాస్‌పోర్టులు, విదేశాల్లో ఆస్తులు ఉన్నాయంటూ ఖేరా చేసిన ఆరోపణలపై ఆమె ఫిర్యాదు మేరకు గువాహటిలో ఆయనపై కేసు నమోదైంది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం పవన్ ఖేరా చేసిన అభ్యర్థనను గువాహటి హైకోర్టు తిరస్కరించడంతో ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ జేకే మహేశ్వరి నేతృత్వంలోని ధర్మాసనం గురువారం విచారణ జరిపి తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరుచేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా విచారణకు సహకరించాలని, పిలిచినప్పుడు పోలీసుల ముందు హాజరుకావాలని పవన్‌ఖేరాను న్యాయస్థానం ఆదేశించింది. సాక్ష్యాలు తారుమారు చేయడం వంటి చర్యలకు పాల్పడకూడదని పేర్కొంది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లకూడదని కూడా స్పష్టం చేసింది. ఇక, విచారణ సమయంలో అవసరమని భావిస్తే.. అదనపు షరతులు విధించే స్వేచ్ఛ ట్రయల్ కోర్టుకు ఉందని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది.

## పైలట్లకు విశ్రాంతిపై నిబంధనలు బేఖాతరు

### ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆందోళన

న్యూఢిల్లీ,మే1 : పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించేందుకు రూపొందించిన ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలు అమల్లోకి రాకపోవడంపై ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆందోళన వ్యక్తంచేసింది. విమాన ప్రయాణంలో పైలట్లు అనారోగ్యానికి గురవడం, మరణించడం వంటి విషయాలపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కు లేఖ రాసింది. ఇటీవల విధుల్లో ఉండగానే పలువురు పైలట్లు ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో విమాన భద్రత, నియంత్రణ, విమాన సిబ్బంది శ్రేయస్సు వంటి విషయాల్లో ఆందోళన వ్యక్తంచేసింది. గతంలో పలు విజ్ఞప్తులు చేసినప్పటికీ.. పైలట్లకు తప్పనిసరిగా విశ్రాంతి కల్పించే నిబంధనలను నిరంతరం వాయిదా వేయడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయని పైలట్స్ అసోసియేషన్ పేర్కొంది. విమానయాన సంస్థలకు నిరంతరం మినహాయింపు లను మంజూరుచేస్తుండడం ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను నీరుగార్చిందని తెలిపింది. తాత్కాలిక చర్యలుగా ప్రవేశపెట్టిన ఈ సడలింపుల వల్ల పైలట్లకు విశ్రాంతి ఉండట్లేదని పేర్కొంది. దీనివల్ల వారు మానసికంగా, శారీరకంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వెల్లడించింది. ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను వెంటనే అమలుచేయడానికి మార్గదర్శకాలు రూపొందించాలని డీజీసీఏను కోరింది.

## ఉపాధి కూలీలతో కలసి పనిచేసిన సీతక్క


ములుగు,మే1 : మేడే సందర్భంగా కార్మిక సోదరులందరికీ మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశవపూర్‌లో ఉపాధి హామీ పనుల్లో పలుగు పట్టి కార్మికులతో కలిసి మంత్రి సీతక్క పనులు చేశారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని ఉదయం 10 గంటల వరకు పనులు ముగించుకొని ఇళ్లకు తిరిగి వెళ్లాలని కూలీలకు మంత్రి సీతక్క సూచించారు.

## బెంగాల్, పుదుచ్చరిల్లో అత్యధికంగా ఓట్లు వేసిన ట్రాన్స్‌జెండర్లు

న్యూఢిల్లీ: తాజాగా ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో ట్రాన్స్‌జెండర్లు(ఒష్ట్రఅతీస +వఅఎవతీ) భారీ సంఖ్యలో ఓట్లు వేశారు. ఎన్నికల సంఘం ఇవాళ ఆ నివేదికను విడుదల చేసింది. పశ్చిమ బెంగాల్‌లో ట్రాన్స్‌జెండర్లు అధిక సంఖ్యలో ఓటు వేశారు. బెంగాల్‌లో సుమారు 91.28 శాతం ట్రాన్స్‌జెండర్లు ఓట్లు వేసినట్లు ఈసీ చెప్పింది. ఆ రాష్ట్రంలో రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో 1257 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటేశారు. తొలి దశలో 464, రెండో దశలో 792 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటేశారు. తొలి దశలో ఓటింగ్ 56.79 శాతం, రెండో దశలో 91.28 శాతం మంది ట్రాన్స్‌జెండర్లు ఓటేశారు. అయితే పుదుచ్చరిలో అత్యధిక సంఖ్యలో ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పుదుచ్చరిలో 91.81 శాతం మంది ట్రాన్స్‌జెండర్లు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కు వాడుకున్నారు. పుదుచ్చరిలో మొత్తం 139 మంది ఉండగా, దాంట్లో 91.81 శాతం మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు వేశారు. తమిళనాడులో 7728 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. దాంట్లో ఏప్రిల్ 23వ తేదిన జరిగిన ఎన్నికల్లో 60.49 శాతం మంది ఓటేశారు. ఇక అస్సాంలో 343 మంది ఓటర్లు ఉండగా, దాంట్లో 36.84 శాతం మంది ఓటేశారు. కేరళలో 277 మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా, 57.04 మంది ఓటేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో థార్డ్ జెండర్ కేటగిరీలో నమోదు చేసిన వారిలో సుమారు 27 శాతం మంది ఓటేశారు. ఆ ఎన్నికల కోసం 48,194 మంది ఆ కేటగిరీలో ఓటు నమోదు చేసుకున్నారు. 2019లో ఆ సంఖ్య 39,075గా ఉంది.

## కష్టే ఫలి అన్నదే ఆదర్శ సూత్రం !

తిరుమల : సోమరితనం మనిషిని మరింత నాశనం చేస్తుంది.ఎదుటి వారిని చూసి ఏడవడం కాదు. ఆ విధంగా పైకి ఎదగడానికి కష్టపడి పని చేయాలి. అటువంటి ఆలోచన మనసులో బలంగా ఉండాలి..మంచి ప్రణాళిక సిద్ధం చేసుకోవాలి. అంతే తప్ప కష్టపడడానికి సిగ్గు పడితేజీవితం నాశనం అవుతుంది. సోమరితనం మనిషిని మరింత చెడ్డ వ్యక్తిగా మారుస్తుంది... జీవితంలో గొప్ప వ్యక్తి గా ఎదగడానికి కృషి చేయాలి. అలాగే సంతోషంగా ఉండేవాడిలో కక్షలు, కార్పణ్యాలు కనిపించవు. ఇతర ఏ పట్టింపులూ ఉండవు. డబ్బుతో అధికారంతో ప్రమేయం ఉండదు. నిజానికి వారికి శత్రువులే ఉండరు. కొందరు ఎన్ని కష్టాలనైనా అవలీలగా భరిస్తారు. అనారోగ్యం సంసార బాధ్యతలు ఒంటరితనం లాంటి ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూనే ఉల్లాసంగా కనిపిస్తారు. మంచి అలవాట్లు జీవనశైలి సైతం సంతోషాన్నిస్తాయి. భూటాన్ రాజ్యం ధనిక దేశం కాదు. కానీ, అక్కడి ప్రజలు ఎప్పుడూ ఆనందంగా ఉంటారట. చాలావరకు వారంతా వజ్రయాన బౌద్ధులు. తొలి శతాబ్దంలో భారతదేశం నుంచి భూటాన్ వెళ్ళిన బౌద్ధ సన్యాసి పద్మసంభవుడు వారికి గురువు. ఆనందంగా జీవించడంలో దైవత్వం ఇమిడి ఉందని ఆయన చెప్పిన సూత్రాన్ని అక్కడి ప్రజలు ఇప్పటికీ నమ్ముతారు. అలాంటి జీవన విధానాలనే పాటిస్తారు. ఆనంద స్థితిని అందుకోవడం కష్టతరం కాదని బుద్ధుడి తొలి శిష్యుల్లో ఒకడైన ఆనందుడు రాసిన దమ్మమార్గం చెబుతోంది. ఆనందం అంతరాంతరాళాల్లోంచి ఉబికి వచ్చేది. అనుభవానికి మరే ఇతర లౌకిక ఊరటకు సంబంధం లేదు.



ఆధ్యాత్మికం

# ఘనంగా 140వ మే డే కార్మిక దినోత్సవ వేడుకలు

# ప్రపంచ కార్మికులారా ఏకంకండి

● కేంద్ర కార్మిక వ్యతిరేక కోడ్ లను రద్దు చేయాలి ● హమాలీ కార్మిక సంక్షేమ బోర్డు వెంటనే ఏర్పాటు చేయాలి ●తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అన్నేడి వెంకట్ రెడ్డి, కార్మిక నాయకులు (ఏ జి పి) ఉప్పు రాజన్న



**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ కార్మికులారా ఏకంకండి.... పోరాడితే పోయేదేమీ లేదు బానిసత్వం తప్ప, కార్మికుల హక్కుల కోసం సంఘటితమై మేడే స్ఫూర్తితో ఐక్యంగా పోరాడాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో 140వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ - ప్రైవేటు గోదాములు, ఏఎంసి మార్కెట్ యార్డులు, రైస్ మిల్లులు, రైల్వే గుడ్ షెడ్, బజార్ , వివిధ సంస్థలు స్థలాలలో కార్మిక సోదరులు ఎర్ర జెండాలను ఎగరవేసి అమరవీరులను స్మరిస్తూ ఎంతో ఉత్సాహంగా మేడే ఉత్సవాలను జరుపుకున్నారు. పెద్దపల్లి రైల్వే స్టేషన్ ఆవరణలో రైల్వే హమాలీ కోపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో సంఘ బాధ్యులు జంగ సంపత్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించిన మేడే ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అన్నేడి వెంకటరెడ్డి కార్మిక నాయకులు ఏ జి పి ఉప్పు రాజన్న, గన్ శ్యామ్ షారడా ముఖ్య అతిథులుగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మే డే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) ఆవిర్భావం కార్మికుల హక్కుల కోసం జరిగిన గొప్ప పోరాటాల ఫలితమన్నారు. 19వ శతాబ్దంలో అమెరికాలో కార్మికులు రోజుకు 12--16 గంటలు పని చేయాల్సి వచ్చేదని దీనికి వ్యతిరేకంగా 8 గంటల పని విధానం కోసం భారీ ఉద్యమాలు ప్రారంభమయ్యాయని, 1886 మే 1న, అమెరికాలోని చికాగో నగరంలో వేలాది కార్మికులు సమ్మెకు దిగారు. ఈ ఉద్యమం సమయంలో జరిగిన హేమార్కెట్ ఘటన లో పోలీసులు కాల్పులు జరపడంతో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ప్రపంచ కార్మిక ఉద్యమానికి చారిత్రక మలుపు ఇచ్చిందన్నారు . ఆ తర్వాత 1889లో అంతర్జాతీయ కార్మిక సంఘాల సమావేశంలో, మే 1ను ప్రతి సంవత్సరం అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారన్నారు. మే డే అనేది కార్మిక వర్గం సాధించిన హక్కుల, త్యాగాల, పోరాటాల చరిత్రను గుర్తుచేసే రోజు అని అన్నారు. 8 గంటల పని విధానం, కనీస వేతనం, కార్మిక హక్కులు ఇవన్నీ కార్మికుల దీర్ఘకాల పోరాటాల ఫలితాలన్నారు. మే డే స్ఫూర్తిగా కార్మికులంతా ఐక్యంగా తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. హమాలీ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ఏర్పాటు చేసినటువంటి తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ ఎల్లవేళలా హమాలీల హక్కులు భద్రత కోసం ఎప్పుడూ ముందుంటుందని సంక్షేమ బోర్డు



సాధన ధ్యేయంగా వరంగల్ జిల్లాలో జరిగిన మొన్నటి రాష్ట్ర మహాసభలలో సంక్షేమ బోర్డు ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని మంత్రి సీతక్క సీఎం దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. బరువులు బస్తాలు మోస్తూ దుర్భర జీవితాలు గడుపుతున్న హమాలీ కార్మికులకు భద్రతా భరోసా పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించే విధంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా హమాలీ కార్మిక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా బాధ్యులు జంగా సంపత్ యాదవ్, నాయకులు కామ భూమన్న, రైల్వే కోపరేటివ్ సొసైటీ డైరెక్టర్లు, పెద్దమనుషులు, ఎఫ్సీఐ కార్మిక నాయకులు, ఆటో కార్మిక సంక్షేమ సంఘం నాయకులు, అధిక సంఖ్యలో హమాలి కార్మికులు పాల్గొన్నారు.

## మేడే స్ఫూర్తితో లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాటం చేయాలి: సీపీఎం

**నల్గొండ జిల్లా ప్రతినిధి, మే01 (ది క్రైమ్ న్యూస్):** ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా మేడే స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక, ప్రజావ్యతిరేక చట్టాలకు, నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మికులంతా పెద్ద ఎత్తున పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, సిఐటియు మండల కన్వీనర్ కోమండ్ల గురువయ్య మాట్లాడుతూ, నిడమనూరు మండల కేంద్రంలో వివిధ రంగాల సంఘటిత కార్మికులతో కలిసి సిఐటియు, సీపీఎం జెండాలను ఎగరవేశారు. వారు మాట్లాడుతూ 1886లో ఎనిమిది గంటల పని విధానం కోసం ప్రపంచవ్యాప్తంగా కార్మికులు చేసిన పోరాటాల్లో అనేకమంది ప్రాణాలు అర్పించారని గుర్తుచేశారు. ఆ పోరాటాల ఫలితంగా ప్రపంచంలోని అనేక దేశాల్లో కార్మిక హక్కులు చట్టబద్ధమయ్యాయని, ప్రస్తుతం కార్మిక సంఘాలు ఆ హక్కులను అనుభవిస్తున్నాయని తెలిపారు. ఇంకా మరిన్ని హక్కుల సాధన కోసం కార్మికులు ఐక్యంగా పోరాటాలు కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ, ఇప్పటికే ఉన్న హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. ఈ కోడ్‌ల ద్వారా కార్మిక హక్కులు దెబ్బతింటున్నాయని, కనీస వేతనం, సమ్మె హక్కులను బలహీనపరుస్తున్నాయని ఆరోపించారు. మళ్లీ 12 గంటల పని విధానాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనికి వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. మేడే ఎర్రజెండా సొత్తు అని, గ్రామ గ్రామాన మేడే వారోత్సవాలు నిర్వహించాలని కోరారు.



అనంతరం సీపీఎం మహానాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కత్తి లింగారెడ్డి, ఆకారపు నరేష్, కుంచెం శేఖర్, వింజమూర్ శివ, మలికంటి చంద్రశేఖర్, ముత్యాల కేశవులు, నల్లబోతు సోమయ్య, బొడ్డు లింగయ్య, కోదండ చరణ్ రాజు, గుత్త శ్రీనివాస్ రెడ్డి, యాదయ్య, మణెమ్మ, అంజమ్మ, వెంకటమ్మ, ధనమ్మ, మౌనిక, ఆది మల్ల క్రాంతి, కోటేష్, విష్ణు, వింజమూరు పుల్లయ్య, వింజమూరి రామచంద్రు, మైసయ్య, సాంబయ్య, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ వన్ డిపోలో ఆర్టీసీ జెండా ఆవిష్కరణ

● కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్ పొన్నం పిలుపుతో కరీంనగర్ బస్టాండ్‌లో మే డే సంబురాలు కార్మికులకు మిఠాయిలు పంపిణీ

**కరీంనగర్ టౌన్, మే1(ది క్రైమ్ న్యూస్)** మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే రోజును పురస్కరించుకొని అన్ని ఆర్టీసీ డిపోలు, బస్టాండ్లలో కార్మికులతో కలిసి సంబరాలు నిర్వహించాలని రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇచ్చిన పిలుపు మేరకు కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్ బస్టాండ్ లోని వన్ డిపో వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్పొరేటర్ వైద్యుల అంజన కుమార్ హాజరై ఆర్.టి.ఎ మెంబర్ పడాల రాహుల్, కార్మిక సంఘం నేత జక్కుల మల్లేశం, టి.ఆర్.రెడ్డి తో పాటు పలువురు మేతలతో కలిసి ఆర్టీసీ కేంద్రంలో మేడే జెండాను ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి వైద్యుల అంజన్ కుమార్ మాట్లాడుతూ నేడు మే 1 అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా యావత్తు కార్మిక లోకానికి కాంగ్రెస్ పార్టీ పక్షాన శుభాకాంక్షలు.. ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న ఆర్టీసీ కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారంలో భాగంగా రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రివర్గం 15 గంటలు చర్చించి చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం, 11శాతం ఫిట్‌మెంట్ తో జీతాల పెంపు, కార్మిక సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్, పెండింగ్ పీఎఫ్, గ్రాట్యుటీ సమస్యల పరిష్కారం, 55 ఏళ్ల రిటైర్మెంట్ నిర్ణయం రద్దు, 30 మంది బదిలీలు రద్దు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, 11శాతం పిఆర్సి పెంపు, కార్మిక సంఘాల ఎన్నికలకు అనుమతి ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నేడు మే డే ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఆర్టీసీ 2 డిపో వద్ద ఆర్టీసీ కార్మిక సోదరులతో కలిసి మే డే సంబరాలను జరుపుకోవడం జరిగింది, ఈ సందర్భంగా బాణాసంచా కాల్చి ఆర్టీసీ కార్మికులకు మిఠాయిలు పంచి శు భాకాంక్షలు తెలియజేయడం జరిగింది. యావత్ కార్మిక లోకానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది అనడానికి ఇంతకంటే పెద్ద నిదర్శనం మరొకటి లేదు 50 రోజుల సమ్మె చేసినా నాటి ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ సమ్మె ప్రారంభించిన కేవలం రెండు రోజుల్లో నేటి ప్రజా పాలన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికుల సాధక బాదకాలను అర్థం చేసుకొని వారి డిమాండ్లను పరిష్కరిస్తూ నిర్ణయం తీసుకోవడం పట్ల ఆర్టీసీ కార్మికుల, కర్షకుల పక్షాన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ నాయకులు జక్కుల మల్లేశం టి ఆర్ రెడ్డి ఎస్ ఎస్ శ్రీధర్ ఎం కె ఫ్రమ్ సంపత్ రాజేశం అనేక మంది ఆర్టీసీ డ్రైవర్లు కండక్టర్లు డిపోలోని కార్మికులు పాల్గొన్నారు. కాంగ్రెస్



నాయకులు యం.డి.ఇమ్రాన్, పొన్నం శ్రీనివాస్, పెంట శేఖర్, యం.డి.వసీం, ఆసీఫ్, సుంకరి గణపతి, యం.డి.లయీక్, అరుణ్, ఇమ్రాన్ ఘని, గడప శ్రీను, సిరిపురం మనోజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని వాహనదారులపై కఠిన చర్యలు

- ఎస్.ఐ. సాయి ప్రశాంత్



**నల్గొండ జిల్లా ప్రతినిధి, మే 01 (ది క్రైమ్ న్యూస్):** నల్గొండ జిల్లా హాలియా మున్సిపాలిటీలోని హాలియా పోలీస్ స్టేషన్ పరిధిలో నంబర్ ప్లేట్ లేకుండా సంచరిస్తున్న వాహనాలపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ నంబర్ ప్లేట్ లేకుండా తిరుగుతున్న వాహనాలను గుర్తించి, మొత్తం 12 బైకులను స్వాధీనం చేసుకొని సంబంధిత కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా హాలియా ఎస్.ఐ. బి. సాయి ప్రశాంత్ మాట్లాడుతూ, ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. వాహనాలకు తప్పనిసరిగా నంబర్ ప్లేట్లు అమర్చుకొని మాత్రమే రోడ్లపై సంచరించాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## ప్రకృతి స్నేహంగా వివాహ వేడుక హాలియాలో వినూత్న నిర్వహణ



**నల్గొండ జిల్లా ప్రతినిధి, మే01 (ది క్రైమ్ న్యూస్):** నల్లగొండ జిల్లా హాలియా మున్సిపాలిటీలోని హాలియాలో ప్రకృతి స్నేహంగా నిర్వహించిన ఒక వివాహ వేడుక అందరినీ ఆకట్టుకుంది. ధమ్మ యోగ కేంద్రం ఆధ్వర్యంలో రేపాల వెంకన్న దంపతుల వివాహ వేడుకను సాదాసీదాగా, పర్యావరణానికి అనుకూలంగా నిర్వహించారు. ఈ వేడుకలో కేక్‌కు బదులుగా పుచ్చకాయను కేక్ ఆకారంలో తయారు చేసి కట్ చేశారు. ప్లాస్టిక్ వస్తువులు, రసాయన పదార్థాలు ఉపయోగించకుండా పండ్లు, పూలతోనే కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ కార్యక్రమంలో భాగంగా ఉదయం 7:30 గంటలకే వేడుకను పూర్తిచేశారు. ఈ సందర్భంగా దంపతులను ధమ్మ యోగ కేంద్రం వ్యవస్థాపకులు ఆచార్య ఆర్య మైత్రేయ గారు పూలదండ, శాలువాతో సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ఇలాంటి వేడుకలను నిర్వహించాలని సూచించారు. శబ్ద కాలుష్యం, చెత్త లేకుండా సాదాసీదాగా జరిగిన ఈ వేడుక స్థానికంగా ఆదర్శంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో యోగ కేంద్ర సభ్యులు, శిక్షణార్థులు పాల్గొని దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

## అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న

### మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ



**సుల్తానాబాద్, మే 02 (ది క్రైమ్ న్యూస్):** "లోకంలో ఎన్ని దానాలు ఉన్నా, ఆకలి తీర్చే అన్నదానం అన్నిటికంటే గొప్పది" అని సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు అన్నారు. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖులు కందుకూరి పద్మ-ప్రకాశ్ రావు (పెద్దన్న) దంపతుల చిన్న కుమారుడు కందుకూరి సాయి అఖిల్ పుట్టినరోజును పురస్కరించుకొని శుక్రవారం స్థానిక మానసిక వికలాంగుల కేంద్రంలో వికలాంగులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారికి పండ్లు, స్వీట్లు , టవల్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన చైర్మన్ బిరుదు రాధాకృష్ణ మరియు మినుపాల ప్రకాష్ రావు మాట్లాడుతూ.. పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాల వంటి సందర్భాల్లో అనవసర హంగులు, ఆర్భాటాలకు పోకుండా పేదలకు, వికలాంగులకు అన్నదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ఇతరులకు స్ఫూర్తిదాయకమని, ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని వారు కోరారు. ఈ సేవా కార్యక్రమంలో కందుకూరి ప్రకాష్ రావు (పెద్దన్న), కౌన్సిలర్లు గాజుల రాజమల్లు, ఊట్ల వరప్రదీప్, మాజీ మార్కెట్ చైర్మన్ సాయిరి మహేందర్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షులు ముస్త్యాల రవీందర్, ప్రముఖులు సామల హరికృష్ణ, కొమురవెల్లి భాస్కర్, యేల్లె రాజు, యువ సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు తుమ్మ రాజ్ కుమార్, రమేష్ , కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## హాలియా మున్సిపాలిటీలో కొత్త కమిషనర్‌కు ఘన స్వాగతం



**నల్గొండ జిల్లా ప్రతినిధి, మే01 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీకి నూతన కమిషనర్‌గా బదిలీపై విచ్చేసిన కే. రవీందర్ రెడ్డికి ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ చింతల చంద్రారెడ్డి, వైస్ చైర్పర్సన్ గౌని రాజా రమేష్ యాదవ్, మున్సిపల్ సిబ్బంది కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కమిషనర్‌కు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానని కే. రవీందర్ రెడ్డి గారు తెలిపారు. ఇక ముందు కమిషనర్‌గా పనిచేసిన ఆళ్ల శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లా ఎదులాపురం మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లినట్లు తెలిపారు.

# మే డే స్ఫూర్తితో కార్మిక హక్కులకే పోరాడుదాం

## • సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి అశోక్




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో సిపిఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కల్లెపల్లి అశోక్ మే డే జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ అనేకమంది కార్మికుల పోరాట ఫలితంగా వచ్చినటువంటి 8గంటల పని విధానాన్ని కొంతమంది కార్పొరేట్ శక్తులకు ఆదాని అంబానీల కోసం కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మికులకు అనుకూలంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దుచేసి బడా కార్పొరేట్ శక్తులకు కార్మికులను కట్టుబానిసలుగా మార్చేసి ,12 గంటల పనివిధానాన్ని అమలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చిందన్నారు. కేంద్ర బిజెపి ప్రభుత్వానికి కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఈ నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం 26,000 చెల్లించాలని ప్రతి కార్మికునికి ఉద్యోగ భద్రత ప్రమాద బీమా కల్పించలి, కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా కార్మిక రైతు వ్యతిరేక విధానాలు మానుకోవాలి,అట్లాగే పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువుల ధరలను తగ్గించి నియంత్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇక్కడ బిజెపిని వ్యతిరేకిస్తూనే కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోర్లను తెలంగాణలో కూడా అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం జీవో నెంబర్ 282 ని తీసుకొచ్చి కార్మికులతో 10:00 వరకు పని విధానాన్ని అమలు చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం ద్వంద్వవైఖరి విడనాడి కార్మిక హక్కుల చట్టలకై కేంద్ర బిజెపి ప్రభుత్వంపై పోరాడాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అట్లాగే అన్ని రంగాల్లో పనిచేస్తున్న కార్మిక లోకం అందరు కార్మికుల బలిదానాలు మరియు మే డే స్ఫూర్తితో కార్మిక హక్కులకై నాలుగు లేబర్ కోడ్ల రద్దుకై అందరు కూడా పోరాడాలి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు మరియు ఇల్లు లేని కార్మికులందరికీ ఇల్లు నిర్మించే ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు జిల్లాల ప్రశాంత్ మోదంపల్లి శ్రావణ్, కుమ్మరి నవీన్, స్వర్ణ ప్రకాష్, ఈర్ల శంకర్, నరేష్ ఎండి కాజా, వెంకట స్వామి, కిరణ్ ,ముస్తఫా, తిరుపతి, అభి తదితరులు పాల్గొన్నారు.

# కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలి

## • సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం




**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని, రద్దు చేసే వరకు దేశంలోని కార్మికులంతా ఏకమై పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం పిలుపునిచ్చారు. శుక్రవారం బస్టాండ్ సమీప అంబేద్కర్ కూడలి వద్ద మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మే డే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) ఆవిర్భావం కార్మికుల హక్కుల కోసం జరిగిన గొప్ప పోరాటాల ఫలితమన్నారు. 19వ శతాబ్దంలో అమెరికాలో కార్మికులు రోజుకు 12--16 గంటలు పని చేయాల్సి వచ్చేదని . దీనికి వ్యతిరేకంగా 8 గంటల పని విధానం కోసం భారీ ఉద్యమాలు ప్రారంభమయ్యాయని, 1886 మే 1న, అమెరికాలోని చికాగో నగరంలో వేలాది కార్మికులు సమ్మెకు దిగారు. ఈ ఉద్యమం సమయంలో జరిగిన హేమార్కెట్ ఘటన లో పోలీసులు కాల్పులు జరపడంతో పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సంఘటన ప్రపంచ కార్మిక ఉద్యమానికి చారిత్రక మలుపు ఇచ్చిందన్నారు . ఆ తర్వాత 1889లో అంతర్జాతీయ కార్మిక సంఘాల సమావేశంలో, మే 1ను ప్రతి సంవత్సరం అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా పాటించాలని నిర్ణయించారన్నారు. మే డే అనేది కార్మిక వర్గం సాధించిన హక్కుల, త్యాగాల, పోరాటాల చరిత్రను గుర్తుచేసే రోజు అని అన్నారు . 8 గంటల పని విధానం, కనీస వేతనం, కార్మిక హక్కులు ఇవన్నీ కార్మికుల దీర్ఘకాల పోరాటాల ఫలితాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి సునీల్, పట్టణ కార్యదర్శి కల్లేపల్లి నవీన్ మండల సహాయ కార్యదర్శి ఆరెపల్లి మానస్ కుమార్ ప్లంబింగ్ యూనియన్ ప్రెసిడెంట్ చంద్రగిరి ఉదయ్ ప్రజాఫ్రంట్ జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య తో పాటు కార్మికులు పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన పెరగాలి

## • శ్రామిక హక్కులు పోరాటాల ఫలితం • కనీస వేతనాల చట్టం అమలు • కార్మికులకు అన్యాయం జరగకుండా చర్యలు • సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన మే డే వేడుకల్లో పాల్గొన్న అదనపు కలెక్టర్ డి. వేణు





**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కార్మిక సంక్షేమ పథకాలపై అవగాహన పెరగాలని అదనపు కలెక్టర్ డి. వేణు అన్నారు. శు క్రవారం పెద్దపల్లి సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ డి. వేణు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ డి. వేణు మాట్లాడుతూ మే డే సందర్భంగా అన్ని ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి శాఖలో పనిచేసే ఉద్యోగులందరూ శ్రామికులేనని, మనందరం శ్రమజీవులమేనని పేర్కొన్నారు. శ్రామిక హక్కులు, ప్రయోజనాలు పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని తెలిపారు. 1886లో చికాగోలో జరిగిన ఉద్యమాల అనంతరం అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ఏర్పడిందని చెప్పారు. భారతదేశంలో 1923 నుండి మే డే వేడుకలు నిర్వహిస్తున్నామని వివరించారు. జిల్లాలోని శ్రామిక సంఘాలకు కార్మిక శాఖ అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై మరింత అవగాహన కల్పించాలని కోరారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కార్మికులకు కూడా ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా చూడాలని సూచించారు. కనీస వేతనాల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని, జిల్లాలోని సింగరేణి, ఆర్ఎఫ్‌సీఎల్, ఎన్‌టీపీసీ, కేశోరం వంటి పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమం అనంతరం మే డే పురస్కారాలను కార్మికులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ వెంకటరమణ, జిల్లా సహాయ కార్మిక అధికారి మొహమ్మద్ రఫీ, జిల్లా ఉపాధి అధికారి ఎం. రాజశేఖర్, జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రంగారెడ్డి,సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# 4చట్టాల రద్దుకై ఉద్యమాలకు సిద్ధం కావాలి: బోయిని తిరుపతి



**తిమ్మాపూర్,మే1(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని పలు గ్రామాల్లో శు క్రవారం మేడే దినోత్సవాన్ని సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పోలంపల్లిలో జెండా ఎగురవేసిన అనంతరం సిపిఐ మండల కార్యదర్శి బోయిని తిరుపతి మాట్లాడుతూ.... చికాగోలో కార్మికుల పోరాట ఫలితంగా ఏర్పడిన 8గంటల పనిదినాలను నేటి మోడీ ప్రభుత్వం12 గంటలుగా మార్చి 44 చట్టాలను 4 చట్టాలుగా కుదించి కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని, 4చట్టాల రద్దుకై పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులు కేదారి, తిరుపతిరెడ్డి, మల్లేశం, తిరుపతి, రాజయ్య, భద్రయ్య, కొమురయ్య, రాజేశ్వర్ రావు, శ్రీనివాస్, శంకర్, కనకయ్య, ఎల్లస్వామి, శ్రీశైలం,ఐలయ్య, సారయ్య,రాజు తదితరులు మేడే వేడుకలో పాల్గొన్నారు.

# బౌరంపేట్ స్నేక్ పార్క్ ప్రాంతాన్ని పరిశీలించిన జిల్లా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుమాధవ రావు







**కుత్బుల్లాపూర్ (ది క్రైమ్ న్యూస్) మే 01:** దుండిగల్ సర్కిల్ బౌరంపేట్ లోని స్నేక్ పార్క్ స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వేణుమాధవ రావు . ఇటీవల బౌరంపేట్ బీఆర్ఎస్ నాయకులు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ని మర్యాదపూర్వకంగా కలిసి వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కోరుతున్న సిఫారసు చేసిన లేఖను వారికి అందించారు, అదేవిధంగా ఎమ్మెల్సీ ఫోన్లో ఫారెస్ట్ అధికారితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా ఈరోజు సాయంత్రం ప్రాంతాన్ని పరిశీలించి త్వరలోనే చర్యలు తీసుకొని వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.వి సురేందర్ రెడ్డి, ధర్మారెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, ఫారెస్ట్ రేంజ్ అధికారులు లక్ష్మణ్ మరియు తదితరులు పాల్గొన్నారు....

# కరీంనగర్ వన్ డిపోలో ఘనంగా మేడే వేడుకలు



**కరీంనగర్ టౌన్, మే1(ది క్రైమ్ న్యూస్):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా కరీంనగర్ వన్ డిపో ముందర కార్మికులు ఎర్రజెండాను ఎగురవేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జోనల్ కార్యదర్శి పి. మల్లయ్య కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో జరిగిన ఆర్టీసీ సమ్మె కార్మికులందరి ఐక్యతకు నిదర్శనమని, అది అందరి విజయమని పేర్కొన్నారు. అనంతరం ఆయన పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు. ప్రభుత్వమే సొంతంగా ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేసి ఆర్టీసీకి అప్పగించాలి. కార్మిక వ్యతిరేకమైన 4 లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి. ప్రభుత్వ బడ్జెట్‌లో ఆర్టీసీకి కనీసం 3 శాతం నిధులను కేటాయించి సంస్థను ఆదుకోవాలి. ఈ కార్యక్రమంలో కరీంనగర్ వన్ డిపో కార్యదర్శి ఎం.నాగరాజుతో పాటు నాయకులు రాజయ్య, శివన్న, సతీష్, రాజిరెడ్డి, సంపత్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని మేడే ఉత్సవాలను విజయవంతం చేశారు.

# వడదెబ్బకు ఓ వ్యక్తి మృతి..



**జమ్మికుంట మే 1 (ది క్రైమ్ న్యూస్):** వడదెబ్బతో వ్యక్తి మృతి చెందిన సంఘటన జమ్మికుంట పట్టణంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం పట్టణం లోని ఆబాది జమ్మికుంట కు చెందిన బొగ్గుల సమ్మయ్య(60) అనే వ్యక్తి వ్యవసాయ పనుల నిమిత్తం శుక్రవారం పొలం లో ఎండలో తిరుగి ఇంటికి చేరుకున్నాడనీ అప్పటికే అస్వస్థతకు గురయ్యిన సమ్మయ్యా కిందపడిపోగా గమనించిన స్థానికులు వెంటనే హాస్పిటల్ కి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడనీ చెందిన సమ్మయ్య భార్య మూడు సంవత్సరాల క్రితం చనిపోయిందని సమ్మయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# నేత్రదానం మహాదానం

## - పూదరి ఈశ్వరమ్మ చూపు సజీవం - నేత్రదానంతో ఇద్దరి అందులకు చూపు... - అభినందించిన సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు...





**జమ్మికుంట మే 1 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట మండలం ఆభాది జమ్మికుంట శివాలయం వీధి నివాసి అయిన పూదరి ఈశ్వరమ్మ వృద్ధాప్యంతో మృతి చెందడంజరిగింది. మద్దెర్ల సారంగపాణి సమాచారము మేరకు సదాశయ ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి, డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు నేత్రదానంపై అవగాహన కల్పించగా , కుటుంబ సభ్యులు ఒప్పుకోవడంతో సదాశయ ఫౌండేషన్ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు నరహరి ఆధ్వర్యంలో, కరీంనగర్ వాసన్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ చందు సహకారంతో నేత్రలను సేకరణ చేసి హైదరాబాద్ వాసన్ ఐ బ్యాంక్ పంపడం జరిగింది. కీర్తిశేషులు పూదరి ఈశ్వరమ్మనేత్ర దానంతో ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన కుమారులు- కోడళ్ళు రాజు-లక్ష్మి, సంపత్ -రజిత. కూతురు అల్లుడు తోడేటి హేమలత-శ్యాంసుందర్, సహకరించిన డీలర్ గర్రెపల్లి వెంకటేశ్వర్లు, చిటి కేసి శివానందయ్య , ముత్యాల జగదీశ్వర్ , చిదురాల శ్రీనివాస్, మద్దర్లల సారంగపాణి లకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి జాతీయ కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మచ్చగిరి నరహరి,ముఖ్య సలహాదారులు నూక రమేష్, గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, ప్రచార కార్యదర్శి వాసు, లగిశెట్టి చంద్రమౌళి, బంధు మిత్రులు అభినందనలు తెలిపారు.

# ఘనంగా మేడే ఉత్సవాలు..





**జమ్మికుంట మే 1 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంటలో హమాలీ, దాడ్వాయి, అర్థిదారుల సంఘం అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, మున్సిపల్ చైర్మన్ మొలుగూరి ప్రశాంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మార్కెట్ ఆవరణలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హమాలి సంఘం కార్యాలయం ముందు ఎర్రబెల్లి రాజేశ్వరరావు జెండా ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కందాల తిరుపతి, దేవస్థానం డైరెక్టర్ మారుతి రామ్ రెడ్డి, ఎగిత అశోక్, మైస రవి కొడాలి రవి మహిళా కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కార్మికుల దినోత్సవ వేడుకలు..

## ● కార్మికుల హక్కుల కోసం గొంతెత్తిన చైర్మన్ స్వప్న సదానందం

**జమ్మికుంట మే 1 (ది క్రైమ్ న్యూస్):** జమ్మికుంట పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరు స్వప్న సదానంద ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవం (మే డే) సందర్భంగా జమ్మికుంటలో నిర్వహించిన ర్యాలీ కార్మిక హక్కులపై గట్టిగా స్వరం వినిపించింది. వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె కార్మిక చట్టాల అమలుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ "దేశంలో కార్మికుల కోసం ఎన్నో చట్టాలు ఉన్నా, అవి పుస్తకాలకే పరిమితమవుతున్నాయి. కనీస వేతనాలు, పని గంటలు, భద్రతా ప్రమాణాలు అన్నీ కేవలం కాగితాలపైనే ఉంటున్నాయి. కార్మికులు ఇప్పటికీ అన్యాయానికి గురవుతున్నారు. ఎనిమిది గంటల పనిదినం అనే హక్కు కోసం పూర్వం కార్మికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి పోరాడారు. కానీ నేటికీ అనేక చోట్ల 10 నుండి 12 గంటలు పని చేయిస్తున్నారు. ఇది పూర్తిగా చట్ట విరుద్ధం" అని ఘాటుగా విమర్శించారు. పెత్తందారుల దౌర్జన్యాలను అరికట్టడానికి కఠినమైన చర్యలు తీసుకోవాలని, కార్మిక చట్టాలను కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల హక్కులను కాపాడటంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం లో జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ హుజురాబాద్ ఇన్చార్జి ప్రణవ్ బాబు ఆధ్వర్యంలో కార్మికుల కోసం ఎనలేని కృషి చేస్తుందని గత ప్రభుత్వాలలో కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్మికుల కోసం సరైన వేతనం, సామాజిక భద్రత, ఆరోగ్య సదుపాయాలు కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరిస్తుందని ఆమె స్పష్టం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులు, అన్ ఆర్గనైజ్డ్ రంగంలో పనిచేసే కార్మికుల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, వారికోసం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. జమ్మికుంట పాత మార్కెట్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ గాంధీ చౌరస్తా మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు కొనసాగింది. మార్కెట్‌కు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని నినాదాలు చేస్తూ కార్మిక హక్కుల కోసం తమ ఐక్యతను చాటారు. మే డే స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ ఈ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమం లో మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం మున్సిపల్ చైర్మన్ ములుగు ప్రశాంత్ కుమార్ మార్కెట్ వైస్ చైర్మన్ ఎర్రం సతీష్ రెడ్డి ఆర్థి దారుల సంఘం అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వరరావు. హమాలీ సంఘం అధ్యక్షులు సంబమూర్తి మున్సిపల్ కౌన్సిలర్లు మార్కెట్ డైరెక్టర్లు మార్కెట్ సిబ్బంది మున్సిపల్ సిబ్బంది దాడువాయిలు మహిళా కార్మికులు తదితర కార్మికులు పాల్గొన్నారు.





# బహుజన రాజ్యమే లక్ష్యం: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విబ్రాం శేఖర్

**పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచినా, పాలకులు మారినా అణగారిన వర్గాల తలరాతలు మారలేదని బహుజన సమాజ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు విబ్రాం శేఖర్ విమర్శించారు. పార్లమెంట్ ఇంచార్జి వరికిల్ల మల్లేష్ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఇరికిల్ల రాజనర్సయ్య అధ్యక్షతన జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు విబ్రాం శేఖర్, వరంగల్ జోన్ -2 ఛీఫ్ జోనల్ ఇంచార్జ్ దాగిళ్ళ దయానంద రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు విబ్రాం శేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, టీడీపీ పాలించినా, ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నా దళితులు, బహుజనుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగినట్లుగానే నేటికీ దళితులపై దాడులు, అత్యాచారాలు కొనసాగుతున్నాయని, దీనికి బహుజనులు పాలితులుగా ఉండటమే కారణమని పేర్కొన్నారు. బహుజనుల కష్టాలు తీరాలంటే రాజ్యాధికారం సాధించడం తప్ప మరో మార్గం లేదని, ఆ దిశగా కార్యకర్తలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఉత్తరప్రదేశ్‌లో కాన్షీరామ్ అంబేద్కర్ ఆశయాలతో పేద ప్రజలకు ఓటు హక్కు విలువను ఎలాగైతే చాటిచెప్పారో, తెలంగాణలోనూ అదే ఒరవడిని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో అగ్రవర్ణాల ధనబలాన్ని ఎదుర్కోవడానికి బహుజనుల వద్ద బలమైన సిద్ధాంతం, ఓటు బలం ఉన్నాయని గుర్తు చేస్తూ, తెలంగాణ ఉద్యమంలో ఎలాగైతే ధనం కంటే ప్రజల ఆకాంక్ష గెలిచిందో, రాబోయే రోజుల్లో బహుజన ఉద్యమం కూడా అలాగే విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వచ్చే 2028 ఎన్నికల నాటికి తెలంగాణ రాష్ట్రంలో బీఎస్పీ జెండా ఎగురవేసి, బహుజన రాజ్యాన్ని స్థాపించడమే తమ లక్ష్యమని విబ్రాం శేఖర్ ప్రకటించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు నర్ల గోపాల్ యాదవ్. కార్యదర్శి నక్క తిరుపతి కోశాధికారి పులిపాక బొంద్యాలు మహిళా కన్వీనర్ అనిత, పెద్దపల్లి నియోజకవర్గం ఇంచార్జి సిపెల్లి కొమురయ్య, అధ్యక్షులు బొంకురి దుర్గయ్య, ఉపాధ్యక్షులు భూమయ్య, కోశాధికారి మల్లారపు రవి. పట్టణ అధ్యక్షురాలు రామిళ్ల శారద, నియోజకవర్గ స్థాయి బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బొల్లారం డివిజన్‌లో ఘనంగా మే డే వేడుకలు

**- 1000 మంది కార్మికులకు రూ.5 లక్షల భీమా కార్డుల పంపిణీ ప్రారంభం - కార్మికుల హక్కుల కోసం పోరాటాల ఫలితమే మేడే: కాట శ్రీనివాస్ గౌడ్**





**పటాన్చెరు, మే 01(ది క్రైమ్ న్యూస్ ):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా బొల్లారం డివిజన్‌లో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా ఆటో యూనియన్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన ఆయన, అనంతరం కార్మిక నాయకుడు వరప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ చేశారు. తరువాత జరిగిన సభలో పాల్గొని సుమారు 1000 మంది కార్మికులకు రూ.5 లక్షల విలువైన ఇన్సూరెన్స్ భీమా కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాట శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం ఎన్నో పోరాటాల ఫలితంగానే మే డే ఏర్పడిందని తెలిపారు. ప్రతి నిరుపేద కుటుంబానికి రెండు పడక గదుల ఇళ్లు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఐడిఏ బొల్లారం ప్రాంతంలో కార్మిక సంక్షేమానికి సంబంధించి పలు అంశాలను ప్రస్తావించారు. ఈఎస్ఐ డిస్పెన్సరీ ప్రస్తుతం బాచుపల్లిలో నడుస్తుండగా, దాన్ని బొల్లారానికి తరలించేలా కృషి చేస్తామని తెలిపారు. అగ్నిమాపక శాఖకు కేటాయించిన భూములపై జరిగిన ఆక్రమణలను తొలగించి, శాఖకు తిరిగి అప్పగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాలుష్య ప్రభావిత గ్రామాల్లో ఉచిత తాగునీరు అందించేందుకు హరిత ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు జలమండలి అధికారులకు వినతిపత్రం అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వరప్రసాద్ రెడ్డి, చంద్ర రెడ్డి, స్థానిక నాయకులు, ఆటో యూనియన్ సభ్యులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాత్ర కీలకం: జగదీశ్వర్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** కాంగ్రెస్ పాత్ర కీలకమని జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం చందానగర్ డివిజన్‌లో అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా గాంధీ విగ్రహం వద్ద డివిజన్ నాయకుడు కట్ల శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా మే డే వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ భారతదేశంలో కార్మికుల గౌరవానికి పునాది వేసింది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమర కాలం నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కార్మికుల పక్షాన నిలిచి, వారి హక్కుల కోసం చట్టాల రూపకల్పనలో కీలక పాత్ర పోషించిందని తెలిపారు. మే డే అనేది ప్రపంచవ్యాప్తంగా కార్మికుల శ్రమ, అంకితభావం, త్యాగాలకు గౌరవ సూచకమైన రోజు అని పేర్కొన్న ఆయన, ప్రతి దేశ అభివృద్ధికి కార్మికులే వెన్నెముకవంటివారని అన్నారు. రైతుల నుంచి నిర్మాణ కార్మికులు, కర్మాగార కార్మికులు, రోజువారీ కూలీల వరకు ప్రతి వర్గం శ్రమ సమాజ అభివృద్ధికి ప్రధాన శక్తిగా నిలుస్తుందని, వారి కృషి లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కోర్డినేటర్ రఘునందన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, నాయకులు రవీందర్ రెడ్డి, శేఖర్ ముదిరాజ్, ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ తహేర్ హుస్సేన్, అయాజ్ ఖాన్, నర్సింహ, ఇస్మాయిల్, నర్సింగ్ రావు, హరి కిషన్, సౌందర్య రాజన్, శ్రీహరి, చంద్రమౌళి, మధు, ఖాజా, భారత్ తదితరులు పాల్గొన్నారు.

# త్రివేణి విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే అరికపూడి గాంధీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మదీనాగూడ త్రివేణి విద్యాసంస్థలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శాసనసభ్యులు అరెకపూడి గాంధీ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ ఏడాది ఫలితాల్లో మనస్విని, హర్షిత ఇద్దరూ 585 మార్కులు సాధించగా, పూజిత 584, ఆదిత్య సాయి 583 మార్కులతో ప్రతిభ కనబరిచారు. అదేవిధంగా 17మంది విద్యార్థులు 550కు పైగా మార్కులు సాధించి సంస్థకు మంచి పేరు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. త్రివేణి విద్యాసంస్థ యాజమాన్యం డాక్టర్ వీరేంద్ర చౌదరి విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారని, ఈఫలితాలువారి కృషికి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్ఓ సాయి నరసింహారావు, ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, హాస్టల్ ప్రిన్సిపల్ జగదీశ్వర్ రావు, ఏసిఆర్ఓ నరేష్, నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# బాధితురాలికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**శంకరపట్నం,మే1(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ఎరడపల్లి మాజీ ఎంపిటిసి జంగిలి సంపత్ సతీమణి ఇటివల అనారోగ్యంతో చికిత్స పొంది ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటుండగా మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం బాధితురాలిని పరామర్శించారు. మాజీ జెడ్పిటిసి లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి,బిఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంట మహిపాల్, నాయకులు శేఖర్ యాదవ్, మోర శ్రీనివాస్, రంజిత్ రావు, రాజశేఖర్ తదితరులు పరామర్శలో రసమయి వెంట ఉన్నారు.

# విలేకరి మృతిపై ఎమ్మెల్యే దిగ్భ్రాంతి......

**తిమ్మాపూర్,మే1(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్లకు చెందిన ఈనాడు విలేఖరి బొజ్జ రాజకుమార్ (32) మృతిపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. చాలాకాలంపాటు విలేకరిగా ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల మన్ననలు పొందుతూ, వృత్తిపరంగా ఎంతో రాణించాల్సిన రాజ్ కుమార్ ఆత్మాహత్యతో అర్ధంతరంగ తనువు చాలించడం విషాదకరమంటూ రాజ్ కుమార్ మృతిపై సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యేతన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# జనాగ్రహ సభకు భారీగా తరలిరండి... బీజేపీ నేతల పిలుపు




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** ఈ నెల 10వ తేదీన పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న జనాగ్రహ సభను విజయవంతం చేయాలని బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. ఈ సభకు భారత ప్రధాని నరేంద్ర మోడీ హాజరుకానున్న నేపథ్యంలో శుక్రవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. మసీద్ బండలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి అధ్యక్షత వహించగా, జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాసరావు, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నియోజకవర్గ ఇంచార్జ్ అలె భాస్కర్, రాష్ట్ర అధికార ప్రతినిధి మారబోయిన రవికుమార్ యాదవ్ సమక్షంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మహిళా బిల్లులు, నియోజకవర్గ పునర్విభజనకు సంబంధించిన అంశాల్లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించిందని ఆరోపించారు. మహిళల హక్కులకు విరుద్ధంగా వ్యవహరించి చరిత్రలో మహిళ ద్రోహిగా నిలిచిందని విమర్శించారు. అలాగే ఎస్సీ, ఎస్టీలకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించే అవకాశాలను కూడా కాంగ్రెస్ అడ్డుకుందని పేర్కొన్నారు. రాబోయే జనాగ్రహ సభకు శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి వేలాదిగా ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొనే ఈ సభను ఘనంగా నిర్వహించేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అశోక్ కురుమ, బుచ్చిరెడ్డి, వసంత్ యాదవ్, అనిల్ గౌడ్, రాధాకృష్ణ యాదవ్, దుర్గాప్రసాద్ కృష్ణంరాజు, పద్మ, సింధు, రెడ్డి ప్రభ, వంశీ రెడ్డి, జితేందర్, లక్ష్మణ్, శ్రీనివాసరెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బుద్ధ జయంతి సందర్భంగా చందానగర్‌లో ఘన నివాళులు..





**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** చందానగర్ డివిజన్‌లో బుద్ధ జయంతి సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్ కమాన్ వద్ద ఉన్న బుద్ధ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మానవాళికి శాంతి, సత్యం, కరుణ మార్గాన్ని చూపించిన మహానుభావుడు గౌతమ బుద్ధుడని అన్నారు. శాంతి మనలో నుంచే వస్తుంది, దానిని బయట వెతకకండి అనే బుద్ధుడి సందేశం ఈ రోజుల్లో ఎంతో ప్రాముఖ్యత కలిగినదని తెలిపారు. బుద్ధుడు బోధించిన అహింస, కరుణ, సమానత్వం వంటి విలువలు సమాజ నిర్మాణానికి బలమైన పునాది అని పేర్కొన్నారు. మనిషి జీవితంలో కోపం, ద్వేషం, లోభం వంటి భావాలు బాధలకు మూలమని, వాటిని జయించేందుకు స్వీయ నియంత్రణ, సత్సంకల్పం అవసరమని ఆయన చెప్పారు. బుద్ధుడి జీవితం ప్రతి ఒక్కరికీ ప్రేరణగా నిలుస్తుందని, రాజకుమారుడిగా జన్మించిన ఆయన మానవాళి శ్రేయస్సు కోసం సత్యాన్వేషణ మార్గాన్ని ఎంచుకున్నారని వివరించారు. బోధి వృక్షం కింద జ్ఞానం పొందిన తర్వాత ఆయన "బుద్ధుడు"గా అవతరించి ప్రపంచానికి జ్ఞానోదయ మార్గాన్ని చూపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ కోర్డినేటర్ రఘునందన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, నాయకులు రవీందర్ రెడ్డి, శేఖర్ ముదిరాజ్, ప్రభాకర్ రెడ్డి, సయ్యద్ తహేర్ హుస్సేన్, అయాజ్ ఖాన్, నర్సింహ, ఇస్మాయిల్, నర్సింగ్ రావు, హరి కిషన్, సౌందర్య రాజన్, శ్రీహరి, చంద్రమౌళి, మధు, ఖాజా, భారత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీన్ టీ కాదు.. గ్రీన్ కాఫీని ఎప్పుడైనా రుచి చూశారా?



## ఇది తాగితే శరీరంలో జరిగే మార్పులివే..



బరువు తగ్గడానికి చాలా మంది గ్రీన్ టీని ఎంచుకుంటారు. అయితే మీకు తెలుసా.. గ్రీన్ టీ మాత్రమే కాదు. గ్రీన్ కాఫీ కూడా ఉంది. ఇది కూడా త్వరగా బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. వినడానికి మీకు ఆశ్చర్యకరంగా ఉన్నా.. గ్రీన్ కాఫీ పేరు చాలా మందికి తెలియదు. గ్రీన్ కాఫీ ఎక్కడ దొరుకుతుంది? తాగితే ఏమౌతుంది? వంటి ఎన్నో విషయాలు మీ కోసం. గ్రీన్ టీ లాగా, గ్రీన్ కాఫీ కూడా ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన పానీయం. గ్రీన్ కాఫీని ఆహారంలో చేర్చుకోగలిగితే బరువు తగ్గడమే కాకుండా అనేక రకాల వ్యాధుల నుంచి బయటపడతారు. గ్రీన్ కాఫీ బీన్స్ నుంచి గ్రీన్ కాఫీ తయారు చేస్తారు. గ్రీన్ కాఫీ సహజ రుచిని తీసుకురావడానికి దీనిని వేయించరు. గ్రీన్ కాఫీలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయనే భయంతో మధుమేహ వ్యాధిగ్రస్తులు టీ, కాఫీలు తాగకూడదని అనుకుంటారు. అయితే గ్రీన్ కాఫీతో ఆ భయం లేదు. రోజువారీ జాబితాలో గ్రీన్ కాఫీని చేర్చుకోవచ్చు. గ్రీన్ కాఫీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. ఇందులో చక్కెరను కలుపుకోకూడదు. చక్కెర కలిపిదే ప్రయోజనానికి బదులుగా హాని జరుగుతుంది. గ్రీన్ కాఫీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఔషధంలా పనిచేస్తుంది. గ్రీన్ కాఫీ తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి. గ్రీన్ కాఫీ శరీరాన్ని డిటాక్స్‌పై చేయడానికి పనిచేస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది చర్మం, జుట్టు సంరక్షణకు ఉపయోగపడుతుంది.

# వీధి వ్యాపారులకు అవగాహన సదస్సు పరిశుభ్రత, ట్రాఫిక్ నియమాలపై దృష్టి





**నల్గొండ జిల్లా ప్రతినిధి: మే 01 (ది క్రైమ్ న్యూస్):** హాలియా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వీధి వ్యాపారులు, తోపుడుబండ్ల యజమానులకు అవగాహన సదస్సు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి మున్సిపాలిటీ చైర్మన్ చింతల చంద్ర రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, దుకాణాల నుండి ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేసి మున్సిపాలిటీ వాహనాలకు అందించాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఉందని తెలిపారు. హాలియా సబ్ ఇన్స్పెక్టర్ సాయి ప్రశాంత్ మాట్లాడుతూ, సాగర్ రోడ్డు మరియు మిర్యాలగూడ రోడ్డు జంక్షన్ల వద్ద తోపుడుబండ్లను రోడ్లపైనే ఉంచి వ్యాపారం చేయడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, ప్రమాదాలకు దారి తీస్తోందని పేర్కొన్నారు. కాబట్టి వ్యాపారులు జంక్షన్లకు కొంత దూరంగా, పాదాచారులకు ఇబ్బంది కలగకుండా తమ వ్యాపారాన్ని నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ గారు, 5వ వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్ 6వ వార్డు కౌన్సిలర్ బొంగరాల ఏసు రాజు , 8వ వార్డు కౌన్సిలర్ సలహాదారు మజహర్ మొహినుద్దీన్ , 11వ వార్డు కౌన్సిలర్ దేపావత్ ప్రసాద్ నాయక్, 12వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్ , ఐఎన్టీయూసీ అధ్యక్షుడు అన్వర్ ఉద్దీన్, పట్టణ ప్రముఖులు, వ్యాపారులు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రోజూ ఈ మొక్క ఆకులు నాలుగైదు నోట్లో వేసుకుంటే ఏ రోగం దరిచేరదు..



తులసి దాదాపు ప్రతి ఇంట్లో కనిపించే మొక్క. చాలా సులభంగా పెరుగుతుంది. ఈ చిన్న మొక్క శరీరం నుంచి ఎన్నో వ్యాధులను దూరం చేస్తుంది. ఇంట్లో తులసి చెట్టు తప్పకుండా పెంచుకోవాలని మన పూర్వీకుల కాలం నుంచి పెద్దలు చెబుతుంటారు. ఈ మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు నిండి ఉంటాయి. ఆయుర్వేదంలో కూడా దీనికి అధిక ప్రాముఖ్యత ఉంది. తులసి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది యాంటీఆక్సిడెంట్‌గా ఉండటమే కాకుండా, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఈ అంశాలన్నీ అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. తులసి ఆకులు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడతాయి. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఆకు వల్ల కలిగే లాభాలు అన్నీఇన్నీకావు. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇది జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. తులసి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. తులసి రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి తులసి ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇది జ్వరం, చర్మం, జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రోజూ నాలుగైదు తులసి ఆకులను తింటే ఎన్నో రోగాల నుంచి విముక్తి లభిస్తుంది. అయితే సరైన పద్ధతిలో తింటేనే ఈ ప్రయోజనాలన్నీ పొందవచ్చు. తులసితో టీ కూడా తాగవచ్చు. దీని ఆకులను ఎండబెట్టి, నీటిలో మరిగించి అయినా తాగొచ్చు

# తిమ్మాపూర్ కలం కార్మికుడి బలవన్మరణం.....!



**తిమ్మాపూర్, మే1(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పొరండ్లకు చెందిన ఈనాడు విలేకరి బొజ్జ రాజ్ కుమార్(35) శుక్రవారం బలవన్మరణానికి పాల్పడ్డాడు.గత కొంతకాలంగా జరుగుతున్న కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురైన రాజ్ కుమార్ శుక్రవారం మధ్యాహ్నం ఎల్ఎండి మానేరు జలాశయం సమీపంలోని ఓ బావిలోకి దూకి మృతి చెందాడు.విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.కాగా అతిచిన్న వయసులోనే విలేకరిగా మండల వ్యాప్తంగా తనదైన ముద్ర వేసుకున్న రాజ్ కుమార్ ఇలా ఆత్మహత్యతో తనువు చాలించడంపట్ల తోటి పాత్రికేయులు, మీడియా జర్నలిస్టులు, పలువురు రాజకీయ నాయకులు, ప్రముఖులు, సన్నిహితులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనై మృతి పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

# కొండపల్కలలో ఘనంగా మేడే ఉత్సవాలు....



**మానకొండూర్,మే1(ది క్రైం న్యూస్):** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం కొండపలకలలో సిపిఐ ఆధ్వర్యంలో మేడే ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథులు సర్పంచ్ మాడ లక్ష్మిరెడ్డి, నాయకుడు మాడి తిరుపతి రెడ్డి, రంగు సంపత్ గౌడ్, కడారి ప్రభాకర్, నల్లగొండ కొమురెల్లి, కొత్త రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గట్టు శ్రీధర్, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఏరబోయిన సదయ్య, హమాలీ సంఘం మండల కార్యదర్శి శాతరాజు సంపత్,గ్రామ కార్యదర్శి గట్టు తిరుపతి, సహాయ కార్యదర్శి శాతరాజు, పోషాలు గ్రామస్తులు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

# మేడే సందర్భంగా పారిశుధ్య కార్మికులకు చీరల పంపిణీ



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా చందానగర్ డివిజన్ పరిధిలో మిరియాల రాఘవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పారిశుధ్య సిబ్బందికి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ, తాజా మాజీ కార్పొరేటర్ జగదీశ్వర్ గౌడ్ పాల్గొని చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, "శ్రమను గౌరవిద్దాం.. శ్రమను గుర్తిద్దాం.. శ్రమ చేద్దాం" అని పిలుపునిస్తూ, కార్మికులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పని దినం కోసం ప్రారంభమైన కార్మికుల పోరాటం నేడు ప్రపంచవ్యాప్తంగా మేడే ఉత్సవంగా మారిందని తెలిపారు. శ్రామికుల భాగస్వామ్యం లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని, వారి కష్టాన్ని గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కార్మికులు తమ హక్కుల కోసం చేసిన త్యాగాలను గుర్తుచేసుకుంటూ, కార్మిక, కర్షక, సంఘటిత, అసంఘటిత రంగాల సోదర సోదరీమణులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. పారిశుధ్య కార్మికుల సేవలను ప్రత్యేకంగా కొనియాడుతూ, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో వారు సమాజాన్ని రక్షించడంలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. వారి ఆరోగ్యం, భద్రతను కాపాడటం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రవీందర్ రావు, మిరియాల రాఘవ రావు, రఘునందన్ రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మిరియాల ప్రీతం, రాజన్, శ్రీహరి, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.ది

# నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్):** శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని మియాపూర్, మాదాపూర్ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు నేడు శంకుస్థాపన జరగనుంది. పిఎసి చైర్మన్ అరెకపూడి గాంధీ సిఎంసి అధికారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. మొత్తం రూ.4 కోట్ల 70 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న ఈ పనుల్లో మయూరి నగర్, మాతృశ్రీ నగర్, గోకుల్ ప్లాట్స్, సుభాష్ చంద్రబోస్ కాలనీ, ఇజ్జత్ నగర్, జూబ్లీ గార్డెన్, అయ్యప్ప సొసైటీ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, వరద నీటి కాల్వలు, ఓపెన్ జిమ్ వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు, కాలనీ అసోసియేషన్ సభ్యులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు.

# దత్తతపై అవగాహన మిషన్ వాత్సల్య పథకంపై ప్రచారం



**నల్గొండ జిల్లా ప్రతినిధి: మే 01 (ది క్రైమ్ న్యూస్):** ప్రజా పాలన ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 27 నుండి మే 2 వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా అనుముల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని హాలియా ఆర్టీసీ బస్టాండ్ వద్ద దత్తత సహాయ కేంద్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు లేని దంపతులు మిషన్ వాత్సల్య పథకం క్రింద దత్తత స్వీకరణకు ముందుకు రావాలని అధికారాలు సూచించారు. దత్తత ప్రక్రియపై వివరాలు తెలియజేస్తూ, ఆసక్తి గల వారు ఐసీడీఎస్ సీడీపీఓ లేదా జిల్లా బాలల పరిరక్షణ యూనిట్ (ఐజూఖ) అధికారులను సంప్రదించాలని, అలాగే చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి చైర్మన్ చింత కృష్ణ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి కె. గణేష్, ఆర్టీసీ కంట్రోలర్, ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్ట్ సీడీపీఓ విజయలక్ష్మి, ఏసీడీపీఓ సువర్ణ, సూపర్వైజర్ రమాదేవి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ప్రతినిధి మహేష్ పాల్గొన్నారు. అలాగే అంగన్వాడీ టీచర్లు, కిశోర బాలికలు, తల్లిదండ్రులు, స్థానికులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# న్యాక్ సెంటర్‌లో మెగా జాబ్ మేళా

## 124 కంపెనీలు, వేలాది ఉద్యోగాలు

**నల్గొండ జిల్లా ప్రతినిధి: మే 01 (ది క్రైమ్ న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నల్గొండ జిల్లా కేంద్రంలోని న్యాక్ సెంటర్‌లో శనివారం (మే 02) మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. ఈ జాబ్ మేళాను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సుమారు 124 కంపెనీలు ఈ మేళాలో పాల్గొని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముందుకు వచ్చినట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలోని నల్గొండ, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలకు చెందిన నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇంటర్ నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన వారికి ఈ జాబ్ మేళా ద్వారా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని, సుమారు 5000 మంది వరకు ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. మ్యానుఫ్యాక్చరింగ్, బ్యాంకింగ్, డిజిటల్ మీడియా, ఫైనాన్స్, హెల్త్ కేర్, ఐటీ, బిజినెస్ సర్వీసులు, కస్టమర్ సపోర్ట్, లాజిస్టిక్స్, హాస్పిటల్ రంగాల్లో ఉద్యోగాలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంపై ఇప్పటికే విస్తృత ప్రచారం నిర్వహించామని, అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామపంచాయతీ స్థాయి వరకు సమాచారం చేరవేసి ఎక్కువ మంది యువత పాల్గొనేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు.

# స్పోర్ట్స్

# భువనేశ్వర్‌ను టీమ్ఇండియాలోకి తీసుకోవాలి

## భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్



రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు?? స్టార్ పేసర్? భువనేశ్వర్? కుమార్? ఈ ఐపీఎల్? సీజన్?లో అద్భుతంగా రాణిస్తున్నాడు. అత్యుత్తమ ఫామ్?తో ఆడుతూ ప్రతి మ్యాచ్?లో కనీసం ఒకట్రెండు వికెట్లు పడగొడుతున్నాడు. కీలక సమయాల్లో పరుగులు కట్టడి చేస్తూ మళ్లీ పాత భువీని గుర్తుచేస్తున్నాడు. అలా ప్రస్తుత సీజన్?లో అతడు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ క్రమంలో అతడిపై ప్రశంసలు కురుస్తున్నాయి. తాజాగా భువీ ఫామ్?పై భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. భువీ పేరును టీ20 జట్టుకు పరిశీలించాలని అన్నాడు. ఈ మ్యాచ్ తర్వాత క్రిక్‌బజ్ చర్చలో పాల్గొన్న సెహ్వాగ్ భువనేశ్వర్? కమ్?బ్యాక్ గురించి సెలక్టర్లు ఆలోచించాలని సూచించాడు. "భువనేశ్వర్ ఈ సీజన్?లో? అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. అతని బౌలింగ్ చూడటం నిజంగా ఆనందాన్నిచ్చింది. మళ్లీ మనకు పాత భువనేశ్వర్? కనిపిస్తున్నాడు. అతని బౌలింగ్‌లో పదును ఉంది. ప్రతి మ్యాచ్‌లోనూ 2 నుంచి 3 వికెట్లు తీస్తున్నాడు. తాజా మ్యాచ్?లో కూడా 3 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్?లో ఆర్సీబీకి విజయావకాశాలు దగ్గర చేశాడు. అందుకే అతడికి 35ఏళ్లా, 36 ఏళ్లా అనేది చూడవద్దు' 'ఇంత బాగా బౌలింగ్ చేస్తుంటే టీ20లో కమ్‌బ్యాక్ ఇవ్వాల్సిందే. సెలెక్టర్లు దీని గురించి ఆలోచించాలి. భువీ ఒకట్రెండు కాదు దాదాపు అన్ని జట్లపై రాణిస్తున్నాడు. టాప్ క్వాలిటీ బ్యాటర్లపై అతను పైచేయి సాధిస్తున్నాడు. అందుకే అతడి బౌలింగ్ చూస్తే ముచ్చటేస్తుంది. అతడు బుమ్రాతో కలిస్తే టీమ్ఇండియా చాలా బలంగా మారుతుంది" అని వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కాగా, ఈ? ఐపీఎల్?లో 9 మ్యాచ్‌లు ఆడిన భువనేశ్వర్ 17 వికెట్లు తీసి పర్పుల్ క్యాప్ రేసులో అగ్రస్థానంలో ఉన్నాడు. ఎకానమీ రేట్ 7.54గా ఉంది. ఇక ఇదే చర్చలో పాల్గొన్న మాజీ స్పిన్నర్ మురళీ కార్తిక్ కూడా భువీని ప్రశంసలతో ముంచెత్తాడు."భువనేశ్వర్ అత్యుత్తమ బౌలర్?. అతనికి లెన్ అండ్ లెంగ్త్? మార్చడంలో నైపుణ్యం ఉంది. అయితే ఎక్కువగా టెస్ట్? మ్యాచ్?లు ఆడటం వల్లే అతడికి ఈ నైపుణ్యం వచ్చింది. యార్కర్, లెంగ్త్ బాల్,? షార్ట్ బాల్ ఇలా ఏ విధంగా అయినా బౌలింగ్ చేయగల కెపాసిటీ భువీకి ఉంది. టీ20లో ఇదే అత్యంత ముఖ్యం కూడా. ఓసారి భువీ కెరీర్?ను గమనిస్తే, 2011 నుంచి ఇప్పటిదాకా అతడు 215 వికెట్లు పడగొట్టాడు. ఎకానమీ రేట్ 7.7 కంటే తక్కువగానే ఉంది. మ్యాచ్?లో ఏ దశలోనైనా సరే, క్రీజులో ఎంతటి స్టార్ బ్యాటర్ ఉన్నా సరే భువీ బౌలింగ్ చేస్తూనే ఉంటాడు. అయితే ఎప్పుడు కూడా భువీ కలత చెందినట్లు మీరు చూసి ఉండరు. ఇక పరుగులు అంటారా, ప్రతీ బౌలర్ రన్స్ ఇస్తాడు. అది సహజమే. కానీ సుమారు 199 మ్యాచ్‌లలో బౌలింగ్? చేసిన భువనేశ్వర్ కేవలం ఎనిమిదిసార్లు 50ం పరుగులు ఇచ్చాడు" అని కార్తిక్ అన్నాడు. కాగా, భువనేశ్వర్ చివరిసారిగా 2022లో భారత్?కు ప్రాతినిధ్యం వహించాడు. ఆ ఏడాది నవంబర్?లో న్యూజిలాండ్?తో జరిగిన టీ20 మ్యాచ్?లో ఆడాడు. ఈ మ్యాచ్?లో నాలుగు ఓవర్ల కోటాలో వికెట్ లేకుండా 35 పరుగులు ఇచ్చాడు. ఇక ఆ తర్వాత భువీ భారత జట్టులో చోటు కోల్పోయాడు. ఇప్పటిదాకా అతడు అంతర్జాతీయ మ్యాచ్?లు ఆడలేదు. ఇక ప్రస్తుతం భువీ వయసు 36ఏళ్లు. మరి టీ20 అంటే పోటీ తీవ్రంగా ఉండే ఈ ఫార్మాట్?లోకి అతడిని సెలక్టర్లు ఎంపిక చేస్తారా? అనేది ఆసక్తికరం!

# సన్‌రైజర్స్ లోకి అంబరీష్ ఎంట్రీ

ఈ ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తడాఖా చూపుతోంది. భారీ విజయాలతో దూసుకెళ్తోంది. వరుసగా అయిదు విజయాలను తన ఖాతలో వేసుకుంది. మొన్నటికి మొన్న ముంబై ఇండియన్స్ ను వాళ్ల సొంత గడ్డ వాంఖెడే స్టేడియంలో చితగ్గొట్టడం అదరహో అనిపించుకుంది. ఈ మ్యాచ్ లో ఓడిన దెబ్బకు ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరింది. ప్లేఆఫ్స్ పై దాదాపుగా ఆశలు వదులుకున్నట్టయింది. ఇప్పటివరకు తొమ్మిది మ్యాచ్ లు ఆడిన సన్ రైజర్స్ ఆరింట్లో నెగ్గింది. మూడింట పరాజయాన్ని చవి చూసింది. మొత్తం 12 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇంకా అయిదు మ్యాచ్ లు ఆడాల్సి ఉందీ జట్టుకు ఇందులో ఇంకో మూడు గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్ రేసులో ఉంటుంది పాట్ కమ్మిన్స్ సేన. ఈ పరిస్థితుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. గాయపడ్డ శివం మావి స్థానంలో 18 ఏళ్ల సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబరీష్ ఎంట్రీ అయ్యాడు. అతనితో కాంట్రాక్ట్ ను కుదుర్చుకుంది జట్టు మేనేజ్మెంట్. గత ఏడాది జరిగిన ఐపీఎల్ లో వేలంలో 75 లక్షల రూపాయల ధరకు శివం మావిని జట్టులోకి తీసుకుంది సన్ రైజర్స్. గజ్జల్లో గాయం కారణంగా టోర్నమెంట్ మొత్తానికీ దూరం అయ్యాడు. దీంతో ఆర్ఎస్ అంబరీష్ తో అతని స్థానాన్ని భర్తీ చేసింది. కుడిచేతి మీడియం పేసర్, ఎడమచేతి బ్యాటర్ అయిన అంబరీష్ 2026 అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడు. ఆ టోర్నమెంట్‌లో 11 వికెట్లతో అతను టీమిండియా తరఫున అత్యధిక వికెట్లు తీసుకున్నాడు. జాయింట్ హయ్యెస్ట్ వికెట్ టేకర్ గా నిలిచాడీ తమిళనాడు క్రికెటర్. యంగ్ పేసర్లతో తొణికిసలాడుతోంది సన్ రైజర్స్ బౌలింగ్ డిపార్ట్మెంట్. ఇప్పటికే ఈ సీజన్‌లో అద్భుతంగా రాణిస్తోన్నారు ప్రఫుల్ హింగ్, సాకిబ్ హుస్సేన్. ఇప్పుడు వారితో డ్రెస్సింగ్ రూమ్ పంచుకోనున్నాడు అంబరీష్. ఈ జట్టు ఈ ఆదివారం హైదరాబాద్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తదుపరి మ్యాచ్ ఆడనుంది.



# థర్డ్ అంపైర్ నిర్ణయం సరైనదే

గుజరాత్ టైటాన్స్‌తో మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు కెప్టెన్ రజత్ పాటీదార్ క్యాచౌట్ ప్రస్తుతం క్రీడావర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పాటీదార్ ఇచ్చిన క్యాచ్‌ను అందుకునే ప్రయత్నంలో గుజరాత్ ఫీల్డర్ జేసన్ హోల్డర్ కింద పడ్డాడు. ఆ సమయంలో బంతి నేలను తాకినట్లు వీడియోలో కనిపించింది. అయితే థర్డ్ అంపైర్ దీనిని ఔట్‌గా ప్రకటించడంతో వివాదం చెలరేగింది. దీనిపై ఒక్కొక్కరు ఒక్కోలా స్పందిస్తున్నారు. తాజాగా మాజీ క్రికెటర్ రవిచంద్రన్ అశ్విన్ కూడా దీనిపై మాట్లాడాడు. అశ్విన్ యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడుతూ, థర్డ్ అంపైర్ నిర్ణయంపై తన అభిప్రాయం షేర్ చేసుకున్నాడు. అంపైర్ నిర్ణయం సరైందేననిఅన్నాడు. అయితే ఆర్సీబీ తరఫున చూస్తే పాటీదార్? దురదృష్టవశాత్తు ఔటయ్యాడని అనిపిస్తుందని, అదే గుజరాత్ టైటాన్స్ తరఫున చూస్తే అది క్లియర్ ఔట్?గా కనిపిస్తుందని అన్నాడు. అయితే తటస్థ ప్రేక్షకుడిగా చూస్తే మాత్రం అది కచ్చితంగా ఫెయిర్ క్యాచ్ అని అభిప్రాయం వ్యక్తం చేశాడు. అంతేకాదు లైవ్?లో బంతిని తన చేతిలో చూపిస్తూ నిబంధనలతో సహా ఓ ఉదాహరణ చెప్పాడు. 'ఇది క్రికెట్ మ్యాచ్?లో ఉపయోగించే కూకబూర (బంతి కంపెనీ) బాల్. ఈ బంతిని పట్టుకుంటే దాదాపు అది నా చేతిలో కవర్ అయిపోతుంది. అదే హోల్డర్ చెయ్యి నా కంటే ఇంకా పెద్దదిగా ఉంటుంది. అతడు బంతిని చేతిలో పట్టుకుంటే మొత్తం కవర్ అయిపోతుంది. అసలు చేతిలో బంతి ఉన్నట్లు కనిపించదు. అతడు కిందపడే సమయానికి తన వేళ్లతో బంతి కింద తాకకుండా కవర్ చేశాడు. నాకు తెలిసి బహుశా బంతి నేలను తాకి ఉండదు. ఇక ఆటలోని నిబంధనలు తెలుసుకోవడం ఇక్కడ మరో విషయం' 'ఫీల్డ్ అంపైర్లు గానీ, థర్డ్ అంపైర్ గానీ చాలా అనుభజ్ఞులు ఉంటారు. రిప్లైలో అంపైర్లు ఏ యాంగిల్?లో బంతిని గమనిస్తారనేదే నిబంధనల సారాంశం. అక్కడ హోల్డర్ క్యాచ్ అందుకున్న వెంటనే, తన వేళ్లతో బంతిని పూర్తిగా కవర్ చేస్తూ, దానిని నేలను తాకకుండా చూసుకున్నాడు. అందుకే ఇది ఆర్సీబీ తరఫున చూస్తే ఇది దురదృష్టం అనిపించవచ్చు. కానీ గుజరాత్ పాయింట్ ఆఫ్ ది వ్యూ లో చూసుకుంటే అది క్లీన్ క్యాచ్?లాగా అనిపిస్తుంది. అదే తటస్థ? ప్రేక్షకుడి కోణంలో చూసుకుంటే అది రూల్ ప్రకారం సరైన నిర్ణయమే' అని అశ్విన్ చెప్పుకొచ్చాడు. ఈ క్యాచ్ వివాదంపై ఆర్సీబీ స్టార్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ స్పందించాడు. 'ఆ క్యాచ్? పట్టిన సమయంలో అక్కడ నేను లేను. అయితే ఆ తర్వాత క్యాచ్ వీడియో చూశాను. కానీ, నాకు మాత్రమ బంతి నేలను తాకినట్లే అని అనిపించింది. మరి అప్పుడు అంపైర్ ఏం చెప్పారో నాకైతే తెలీదు. ఆట నిబంధనలకు లోబడి ఉందా లేదా అనేని నేను చెప్పలేను. దీనిపై పెద్దగా అవగాహన కూడా లేదు. కానీ ఈ క్యాచ్?ను ఇంకొంచెం నిశితంగా పరిశీలించి ఉండి ఉంటే బాగుండేదనని అనిపించింది' అని భువనేశ్వర్ అన్నాడు. ఇక స్వయంగా ఈ క్యాచ్ పట్టిన హోల్డర్ మ్యాచ్ అనంతరం దీనిపై మాట్లాడాడు. తాను అందుకున్న క్యాచ్ సరైందే అని అన్నాడు. క్యాచ్ పట్టే సమయంలో రబాడ తనను ఢీ కొట్టేలాగా కనిపించినప్పటికీ బంతి అందుకోవాలని అనుకున్నట్లు చెప్పాడు. ఇక అదిరే ఫీల్డింగ్?తోపాటు బౌలింగ్?లో రెండు వికెట్లు పడగొట్టి రాణించిన హోల్డర్?కే ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.



# వైభవ్ విధ్వంసం చూసి జడుసుకున్న కేఎల్ రాహుల్

ఐపీఎల్ 2026 సీజన్ అనేక సంచలనాలకు వేదికవుతోంది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ తరఫున ఆడుతున్న 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈ బుడతడి ఆటతీరు చూసి టీమిండియా స్టార్ క్రికెటర్, ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్ సైతం షాక్ అయ్యారు. తాను కలలో కూడా ఊహించని అద్భుతమిది అంటూ సూర్యవంశీ టాలెంట్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగబోయే 43వ మ్యాచ్‌కు ముందు కేఎల్ రాహుల్ స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "వైభవ్ సూర్యవంశీ ప్రపంచ క్రికెట్‌లో విధ్వంసం సృష్టిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లో రెండు సెంచరీలు బాదడం అనేది అసాధారణం. నేను ఆ వయసులో ఉన్నప్పుడు కనీసం ఇలాంటి వాటి గురించి కలలో కూడా ఊహించలేదు" అని రాహుల్ కొనియాడారు. వైభవ్ ఇప్పటివరకు ఈ సీజన్‌లో 400 పరుగులు చేయడమే కాకుండా, అత్యధికంగా 37 సిక్సర్లు బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. భారతదేశంలో పుట్టుకొస్తున్న యంగ్ టాలెంట్ గురించి రాహుల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో మన దగ్గర సిక్సర్లు కొట్టే ప్లేయర్లు లేరని ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ బ్యాటింగ్ చూసి భయపడేవాళ్లమని, కానీ ఇప్పుడు ఐపీఎల్ వల్ల ఆ పరిస్థితి మారిపోయిందని ఆయన అన్నారు. వైభవ్ సూర్యవంశీతో పాటు చెన్నై సూపర్ కింగ్స్ తరఫున ఆడుతున్న ఆయుష్ మ్హాత్రే కూడా అద్భుతంగా రాణిస్తున్నాడని రాహుల్ పేర్కొన్నారు. ఈ కుర్రాళ్ళు భయం లేకుండా ఆడుతూ టీ20 క్రికెట్ ఆడే తీరునే మార్చేస్తున్నారని అభినందించారు. తన వ్యక్తిగత లక్ష్యాల గురించి స్పందిస్తూ రాహుల్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. తనకు వ్యక్తిగత రికార్డుల కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పారు. "నాకు పర్సనల్ మైల్‌స్టోన్స్ కంటే ఎంఎస్ ధోనీ గెలిచిన ఐదు ఐపీఎల్ ట్రోఫీల రికార్డును సమం చేయాలని ఉంది. క్రికెట్ అనేది ఒక టీమ్ గేమ్. సక్సెస్‌ఫుల్ టీమ్‌లో భాగం కావడమే నా లక్ష్యం" అని రాహుల్ స్పష్టం చేశారు. కేవలం రన్ మిషన్ లాగా మారడం కాకుండా, ఒక లీడర్‌గా తన జట్టుకు టైటిల్ అందించడమే తన డ్రీమ్ అని ఆయన చెప్పుకొచ్చారు. ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు టాప్ ఫామ్‌లో ఉండటానికి వైభవ్ సూర్యవంశీ వంటి యంగ్ ప్లేయర్ల దూకుడే కారణం. జైపూర్‌లోని తమ హోమ్ గ్రౌండ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న రాజస్థాన్, ఈ మ్యాచ్‌లోనూ వైభవ్ మెరుపులపై ఆశలు పెట్టుకుంది. మరోవైపు ఢిల్లీ జట్టు రాహుల్ కెప్టెన్సీలో రాజస్థాన్ దూకుడుకు అడ్డుకట్ట వేయాలని చూస్తోంది. ఒకవైపు అనుభవం ఉన్న రాహుల్, మరోవైపు ఫ్యూచర్ స్టార్ వైభవ్.. వీరిద్దరి మధ్య జరగబోయే పోరు కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# టెస్ట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఆస్ట్రేలియా జట్టు

ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ తాజా ర్యాంకింగ్స్ విడుదల చేసింది. వార్షిక టెస్ట్ ర్యాంకింగ్స్ ఇవి. అలాగే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ టోర్నమెంట్ కు సంబంధించిన పాయింట్ల పట్టిక కూడా విడుదల అయింది. ఏడాది కాలంలో ఆయా జట్లు ఆడిన టెస్ట్ మ్యాచ్ లు, వాటిల్లో సాధించిన విజయాల ఆధారంగా తాజా ర్యాంకింగ్స్ ను రూపొందించింది ఐసీసీ. ఈ టెస్ట్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా జట్టు అగ్రస్థానంలో నిలిచింది. వార్షిక ర్యాంకింగ్‌ల ప్రకారం.. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా 87.50 శాతంతో అగ్రగామిగా ఉంది. న్యూజిలాండ్ 77.78 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. భారత జట్టు మూడో స్థానాన్ని దక్కించుకుంది. టెస్ట్ ఫార్మట్ ఆస్ట్రేలియా తన నంబర్ వన్ స్థానాన్ని నిలబెట్టుకుంటూ వస్తోంది.. ఏడాది కాలంగా. ఇందులో తన పాయింట్లను మరింత మెరుగుపర్చుకుంది. ఏకంగా మూడు అదనపు పాయింట్లను సాధించింది. దీంతో ఆ జట్టు ఖాతాలో ఉన్న పాయింట్ల సంఖ్య 131కి చేరుకుంది. టెస్ట్ ర్యాంకింగ్స్‌లోని మొదటి రెండు స్థానాలపై ఎటువంటి ప్రభావం చూపలేదు. ఆస్ట్రేలియాతో పాటు దక్షిణాఫ్రికా కూడా ఈ ఫార్మట్ లో తన అధిపత్యాన్ని కొనసాగిస్తూ వస్తోంది. ఆస్ట్రేలియా 131 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, 119 పాయింట్లతో దక్షిణాఫ్రికా రెండో స్థానంలో ఉంది. 104 పాయింట్లతో భారత్ మూడో స్థానాన్ని దక్కించుకుంది. ఇంగ్లాండ్-102, న్యూజిలాండ్- 101 పాయింట్లతో నాలుగు, అయిదు స్థానాల్లో నిలిచాయి.

# కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిందించడం సరికాదు

## వెస్టిండీస్ దిగ్గజం ఇయాన్ బిషప్



ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఆడిన ఎనిమిది మ్యాచుల్లో ఆరు ఓటములతో ప్లేఆఫ్ ఆశలు గల్లంతయ్యే స్థితిలో ఉన్న ఈ టీమ్ ప్రదర్శనపై ఇప్పుడు తీవ్రంగా చర్చ కొనసాగుతోంది. అయితే జట్టు వైఫల్యానికి కేవలం కెప్టెన్ హార్దిక్ పాండ్యాని మాత్రమే బాధ్యుడిని చేయడం సరికాదని వెస్టిండీస్ దిగ్గజం ఇయాన్ బిషప్ అభిప్రాయపడ్డారు. సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లు కూడా బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ముంబై ఇండియన్స్ ఎదుర్కొంటున్న వరుస ఓటములపై హార్దిక్ పాండ్యా స్పందిస్తూ.. తన వ్యక్తిగత ఫామ్ మెరుగుపడాల్సిన అవసరం ఉందని నిజాయితీగా అంగీకరించాడు. అయితే ఇయాన్ బిషప్ మాట్లాడుతూ.. "జట్టు ఫెయిల్యూర్ లో ఒక్క వ్యక్తిని బాధ్యుడిని చేయడం తప్పు. కెప్టెన్ దగ్గర ఎన్ని ప్లాన్స్ ఉన్నా, ప్లేయర్లు మైదానంలో రాణించకపోతే ఫలితం ఉండదు. హార్దిక్ వ్యూహాలు మార్చుకోవచ్చు, కానీ అతనికి స్టార్ ప్లేయర్ల సపోర్ట్ చాలా అవసరం" అని అన్నారు. సన్ రైజర్స్ తో జరిగిన గత మ్యాచ్ లో 243 పరుగులు చేసి కూడా కాపాడుకోలేకపోవడం ముంబై బౌలింగ్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ముంబై టీమ్ లో ప్రధాన బలమైన సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా ఈ సీజన్ లో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. సూర్యకుమార్ 8 మ్యాచుల్లో కేవలం 162 పరుగులు మాత్రమే చేశాడు, అతని సగటు 20కి పడిపోయింది. ఇక బుమ్రా పరిస్థితి మరీ ఘోరం. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అతనికి అత్యంత కష్టతరమైన సీజన్ అని చెప్పొచ్చు. ఆడిన 8 మ్యాచుల్లో అతను కేవలం రెండు వికెట్లు మాత్రమే తీయగలిగాడు. ప్రపంచ స్థాయి బౌలర్ ఇలాంటి ప్రదర్శన ఇస్తాడని ఎవరూ ఊహించలేదు. టీ20 ప్రపంచకప్ 2026 గెలిచిన తర్వాత బుమ్రా, సూర్య వంటి కీలక ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి దొరకలేదని బిషప్ విశ్లేషించారు. "వరల్డ్ కప్ గెలవడానికి వారు ఎంతో శ్రమించి ఉంటారు. మానసికంగా, శారీరకంగా వారు అలసిపోయి ఉండొచ్చు. నిజానికి బుమ్రా వంటి బౌలర్ కు ఐపీఎల్ కు ముందు తగినంత బ్రేక్ ఇచ్చి ఉంటే బాగుండేది. అప్పుడు అతను కొత్త ఉత్సాహంతో, తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుని బరిలోకి దిగేవాడు" అని బిషప్ అభిప్రాయపడ్డారు. ముంబై ఇండియన్స్ ఇప్పుడు అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉంది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన ఆరు మ్యాచుల్లోనూ కచ్చితంగా గెలవాల్సిందే. ఒక్క మ్యాచ్ ఓడినా ఇంటికి వెళ్లడం ఖాయం. ఈ పరిస్థితిలో కేవలం హార్దిక్ పాండ్యా వైపు చూడకుండా, జట్టులోని ప్రతి ఆటగాడు బాధ్యత తీసుకుని రాణించాల్సిన సమయం ఆసన్నమైంది. పోలార్డ్, జయవర్ధనే వంటి దిగ్గజాలు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు.

# విశ్వేజి



## సమ్మర్‌లో ఈ అట్లే తినాలి.. శరీరానికి చలువతో పాటు ఆరోగ్యం కూడా,ఎలా చేయాలంటే..

మజ్జిగ చుక్క అట్లు దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా ఏపీ, తెలంగాణ రాష్ట్రాలలో చాలా ప్రసిద్ధి చెందిన ఒక సాంప్రదాయ అల్పాహారం. పుల్లటి మజ్జిగను ఉపయోగించడం వల్ల ఈ అట్లు ప్రత్యేకమైన రుచిని కలిగి ఉంటాయి. ఇవి తేలికగా జీర్ణమవుతాయి, వేసవి కాలంలో శరీరాన్ని చల్లగా ఉంచడానికి సహాయపడతాయి. మజ్జిగ చుక్క అట్లు ఇంట్లో ఎలా తయారుచేసుకోవాలి, దీని తయారీకి కావలసిన పదార్థాలు ఏంటో ఇక్కడ చూడండి. మజ్జిగ చుక్క అట్లు తయారీకి కావలసిన పదార్థాలు -బియ్యం పిండి – 1 కప్పు -పుల్లటి మజ్జిగ – 1 1/2 కప్పులు -ఉల్లిపాయ – 1 చిన్నది -పచ్చిమిర్చి – 2-3 -అల్లం – 1/2 అంగుళం ముక్క -కొత్తిమీర – 2 టేబుల్ స్పూన్లు -జీలకర్ర – 1/2 టీస్పూన్ -ఉప్పు – రుచికి సరిపడా -నూనె లేదా నెయ్యి – అట్లు వేయించడానికి తగినంత %ూఎజవతీఅంవఎవత్% మజ్జిగ చుక్క అట్లు తయారీ విధానం -ఒక పెద్ద గిన్నెలో బియ్యం పిండి వేయాలి. అందులో పుల్లటి మజ్జిగను కొద్ది కొద్దిగా వేస్తూ ఉండలు లేకుండా బాగా కలపాలి. పిండి మజ్జిగలో పూర్తిగా కలిసిపోయి దోస పిండి కంటే కొంచెం పలుచగా ఉండేలా చూసుకోవాలి. -ఇప్పుడు సన్నగా తరిగిన ఉల్లిపాయ, పచ్చిమిర్చి, తురిమిన అల్లం, తరిగిన కొత్తిమీర, జీలకర్ర వేసి బాగా కలపాలి. -రుచికి సరిపడా ఉప్పు వేసి మరొకసారి బాగా కలపాలి. పిండిని కనీసం 15-20 నిమిషాల పాటు నాననివ్వాలి. ఇలా నానబెట్టడం వల్ల అట్లు మరింత మెత్తగా వస్తాయి. -స్టవ్ మీద ఒక నాన్-స్టిక్ పెనం లేదా సాధారణ పెనం ఉంచి వేడి చేయాలి. పెనం వేడెక్కిన తర్వాత కొద్దిగా నూనె లేదా నెయ్యి వేసి పెనం అంతా స్ప్రెడ్ చేయాలి. -ఒక గరిటెడు పిండిని తీసుకొని వేడెక్కిన పెనం మీద గుండ్రంగా పలుచగా పోయాలి. -అట్టు అంచులు కొంచెం ఎండినట్లుగా కనిపించినప్పుడు దానిపై కొద్దిగా నూనె లేదా నెయ్యి వేయాలి. -అట్టు ఒకవైపు బంగారు రంగులోకి వచ్చాక దానిని జాగ్రత్తగా తిప్పి రెండోవైపు కూడా కాల్చాలి. రెండు వైపులా బాగా కాలి బంగారు రంగులోకి వచ్చాక పెనం నుండి తీసి ప్లేట్‌లో పెట్టుకోవాలి. -ఇలాగే మిగిలిన పిండితో కూడా అట్లను వేసుకొని వేడి వేడిగా చట్నీ లేదా సాంబార్‌తో సర్వ్ చేయాలి. కొబ్బరి చట్నీ, టమాటో చట్నీ లేదా అల్లం చట్నీతో ఈ అట్లు చాలా రుచిగా ఉంటాయి. పొద్దున్నే ఈ పూరీ తింటే రోగాలన్నీ పరార్..షుగర్ పేషెంట్లు కూడా హాయిగా తినొచ్చు..ఎలా చేయాలంటే మజ్జిగ చుక్క అట్లు ప్రయోజనాలు మజ్జిగ చుక్క అట్లు కేవలం రుచికరమైనవే కాకుండా ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలను కలిగి ఉంటాయి. వాటిలోని ముఖ్యమైన ప్రయోజనాలు ఏంటో చూడండి. తక్కువ కేలరీలు ఇతర అల్పాహారాలతో పోలిస్తే మజ్జిగ చుక్క అట్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. కాబట్టి బరువు తగ్గాలనుకునే వారికి లేదా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలనుకునే వారికి ఇది మంచి ఆప్షన్. నూనెను తక్కువగా ఉపయోగిస్తే కేలరీల మొత్తాన్ని మరింత తగ్గించవచ్చు. తేలికగా జీర్ణమవుతాయి మజ్జిగ, బియ్యం పిండి తేలికగా జీర్ణమయ్యే పదార్థాలు. కాబట్టి ఈ అట్లు కడుపుకు తేలికగా ఉంటాయి,

### మండే ఎండల్లో కూడా ఫ్రెష్ లుక్..
## ఇలా చేస్తే మీ చర్మం మెరిసిపోవాల్సిందే



మిగతా సీజన్ లతో పోల్చితే ఎండాకాలంలో చర్మం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం చాలా చాలా ముఖ్యం. సమ్మర్ లో ఉండే బలమైన సూర్యకాంతి మరియు వేడి గాలుల కారణంగా, చర్మం పొడిగా మారుతుంది,చర్మం నల్లగా మారడం పెరుగుతుంది. కొన్నిసార్లు మండుతున్న అనుభూతి కూడా కలుగుతుంది. ఈ సమయంలో చాలామంది దానిని నివారించడానికి అనేక ప్రొడక్ట్ లను వాడుతుంటారు. అయితే రసాయన ఉత్పత్తులకు బదులుగా సహజ వస్తువులను ఉపయోగించడం ప్రయోజనకరం. దోసకాయతో తయారు చేసిన టోనర్ సమ్మర్ లో చర్మానికి మేలు చేస్తుంది. వేసవిలో కూడా మీ చర్మం తాజాగా, మెరుస్తూ ఉండాలని మీరు కోరుకుంటే మీ చర్మ సంరక్షణ దినచర్యలో దోసకాయ టోనర్ ను చేర్చుకోవచ్చు. దోసకాయతో తయారు చేసిన టోనర్.. చర్మాన్ని చల్లబరచడమే కాకుండా హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. దోసకాయ టోనర్ ఎలా తయారు చేయాలి ఒక ఫ్రెష్ కీర దోసకాయని శుభ్రంగా కడిగి చిన్న ముక్కలుగా కట్ చేసుకోండి. ఇప్పుడు ఈ ముక్కలను మిక్సీలో వేసి కొంచెం నీరు పోసి గ్రైండ్ చేయాలి. తర్వాత ఈ మిశ్రమాన్ని జల్లెడ ద్వారా వడకట్టి దానికి ఒక చెంచా రోజ్ వాటర్, ఒక చెంచా అలోవెరా జెల్ జోడించండి. మీకు కావాలంటే మీరు కొన్ని చుక్కల నిమ్మరసం కూడా జోడించవచ్చు. ఇప్పుడు ఈ టోనర్ ను స్ప్రే బాటిల్‌లో నింపి ఫ్రిజ్‌లో ఉంచండి. వేసవి కాలంలో కోల్డ్ టోనర్ చర్మానికి మరింత ఉపశమనం ఇస్తుంది. దోసకాయ టోనర్ ఎలా అప్లై చేయాలి? దీన్ని ఉపయోగించే ముందు మీ ముఖాన్ని బాగా కడగాలి. తర్వాత దాన్ని నేరుగా ముఖంపై స్ప్రే చేయండి లేదా కాటన్ ప్యాడ్ సహాయంతో తేలికగా అప్లై చేయండి. చర్మం తేమగా, తాజాగా ఉండటానికి ఉదయం, రాత్రి రెండు సమయాల్లోనూ దీన్ని అప్లై చేయడం మంచిది. మేకప్ వేసుకునే ముందు కూడా మీరు దీన్ని అప్లై చేసుకోవచ్చు. ఇది మేకప్‌ను బాగా సెట్ చేస్తుంది, చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. ఎండలోంచి బయటకు వచ్చిన తర్వాత దీన్ని అప్లై చేయడం వల్ల చర్మం చల్లబడి చికాకు తగ్గుతుంది. చర్మానికి దోసకాయ టోనర్ వల్ల కలిగే కొన్ని ముఖ్య ప్రయోజనాలు చర్మాన్ని చల్లబరుస్తుంది వేసవిలో తీవ్రమైన సూర్యకాంతి, వేడి గాలుల కారణంగా చర్మం పొడిగా, నీరసంగా మారుతుంది. ఈ సమయంలో దోసకాయ టోనర్ చర్మాన్ని చల్లబర్చి ఉపశమనం ఇస్తుంది. దీనివల్ల ముఖం ఫ్రెష్ గా, రిలాక్స్‌గా ఉంటుంది. తేమను నిలుపుకుంటుంది దోసకాయలో పుష్కలంగా నీరు ఉంటుంది. ఇది చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. ఇది చర్మం పొడిబారడాన్ని తొలగించి, తేమను నిలుపుకుని చర్మాన్ని మృదువుగా ఉంచుతుంది. టానింగ్ తగ్గిస్తుంది వేసవిలో సూర్యకాంతి కారణంగా టానింగ్ సమస్య సర్వసాధారణం అవుతుంది. దోసకాయ టోనర్ చర్మంపై ఉన్న టానింగ్ ను తేలికపరచడంలో సహాయపడుతుంది. చర్మానికి మునుపటిలా సహజమైన టోన్‌ను ఇస్తుంది. చెమటతో బాగా ఇబ్బందిపడుతున్నారా?..జస్ట్ ఇలా చేస్తే చెమట,దుర్వాసన ఉండవ్! చర్మాన్ని మెరిసేలా చేస్తుంది మీ ముఖం నీరసంగా కనిపిస్తే దోసకాయ టోనర్‌ను ఉపయోగించవచ్చు. ఇది చర్మాన్ని రిఫ్రెష్ చేసి సహజమైన మెరుపును ఇస్తుంది. దీనివల్ల ముఖం మెరుస్తూ, ఆరోగ్యంగా కనిపిస్తుంది.

## వంకాయ, పాలు కలిపి తీసుకుంటున్నారా? అయితే ఇవి తెలుసుకోండి.. లేకపోతే మీకే డేంజర్.!

మన భారతీయ వంటకాల్లో వంకాయది ప్రత్యేక స్థానం. గుత్తి వంకాయ కూర నుండి వంకాయ బజ్జీల వరకు ఎన్నో రకాల రుచికరమైన వంటకాలను దీనితో తయారు చేసుకుంటాం. అలాగే, పాలు సంపూర్ణ ఆహారంగా పరిగణింపబడతాయి, కాల్షియం , ఇతర పోషకాలకు మంచి మూలం. ఈ రెండూ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవే అయినా, కొన్ని ఆహార పదార్థాలను కలిపి తీసుకోకూడదని ఆయుర్వేదం చెబుతోంది. అలాంటి వాటిలో వంకాయ, పాలు కలయిక ఒకటి. వంకాయ, పాలను కలిపి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి హానికరం కావచ్చని, కొన్ని రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయుర్వేద నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనినే ఆయుర్వేద పరిభాషలో 'విరుద్ధాహారం' అంటారు. అంటే, ఒకటికొకటి సరిపడని ఆహార పదార్థాల కలయిక అన్నమాట. మరి వంకాయ, పాలు కలిపి తీసుకుంటే ఎలాంటి సమస్యలు రావచ్చు? వివరంగా తెలుసుకుందాం. ఆయుర్వేద దృక్కోణం : ఆయుర్వేదం ప్రకారం, ప్రతి ఆహార పదార్థానికి దాని స్వంత గుణం (వేడి లేదా చల్లదనం), రుచి (తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు), జీర్ణమయ్యే విధానం ఉంటాయి. వంకాయ వేడి చేసే గుణాన్ని (ఉష్ణ వీర్యం) కలిగి ఉంటుంది. పాలు సహజంగా చల్లని గుణాన్ని (శీతల వీర్యం) కలిగి ఉంటాయి, కానీ జీర్ణమైన తర్వాత వాటి ప్రభావం (విపాకం) కొందరిలో వేడిని పెంచవచ్చు లేదా జీర్ణక్రియపై భిన్నమైన ప్రభావాన్ని చూపవచ్చు. ఇలా భిన్నమైన గుణాలు, జీర్ణక్రియ ప్రక్రియలు కలిగిన ఆహారాలను కలిపి తీసుకున్నప్పుడు, అది మన జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని మోపుతుంది. జీర్ణక్రియ సరిగా జరగక 'ఆమం' (జీర్ణం కాని ఆహార వ్యర్థాలు, టాక్సిన్స్) ఏర్పడే అవకాశం పెరుగుతుంది. ఈ ఆమం శరీరంలో అనేక సమస్యలకు మూలకారణం అవుతుందని ఆయుర్వేదం వివరిస్తుంది. వంకాయ, పాలు కలయిక వల్ల వచ్చే సంభావ్య ఆరోగ్య సమస్యలు: అజీర్తి సమస్యలు: ఇది అత్యంత సాధారణంగా కనిపించే సమస్య. కడుపు ఉబ్బరం, గ్యాస్, తేన్పులు, కడుపులో అసౌకర్యం, కొన్నిసార్లు కడుపు నొప్పి వంటివి రావచ్చు. భిన్నమైన జీర్ణక్రియ ప్రక్రియల వల్ల ఆహారం సరిగా





జీర్ణం కాకపోవడమే దీనికి కారణం. చర్మ సమస్యలు: విరుద్ధాహారం వల్ల ఏర్పడిన ఆమం (టాక్సిన్స్) రక్తంలో కలిసి చర్మానికి చేరినప్పుడు దురద, దద్దుర్లు, ఎగ్జిమా (తామర), మొటిమలు వంటి చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నమ్ముతారు. వంకాయ, పాల కలయిక కొందరిలో ఇలాంటి చర్మ ప్రతిచర్యలను ప్రేరేపించవచ్చు. అలెర్జీలు: కొందరికి వంకాయ పడకపోవచ్చు (నైట్ షేడ్ వెజిటబుల్స్ పడని వారు ఉంటారు), మరికొందరికి పాలు (లాక్టోస్ ఇంటాలరెన్స్ లేదా మిల్క్ ప్రోటీన్ అలెర్జీ) పడకపోవచ్చు. ఈ రెండింటినీ కలిపి తీసుకున్నప్పుడు, అలెర్జీ ప్రతిచర్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయా? ఇంకెన్ని సమస్యలు వస్తాయో తెలుసా? ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయా? ఇంకెన్ని సమస్యలు వస్తాయో తెలుసా? జీర్ణశక్తి మందగించడం: తరచుగా ఇలాంటి విరుద్ధ ఆహారాలను తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో జీర్ణవ్యవస్థ బలహీనపడి, జీర్ణశక్తి మందగించే అవకాశం ఉంటుంది. ఇది పోషకాల శోషణను కూడా ప్రభావితం చేయవచ్చు. కొందరిలో జలుబు, దగ్గు వంటి శ్వాసకోశ సమస్యలు కూడా ప్రేరేపితం కావచ్చని కొన్ని సంప్రదాయ వాదనలున్నాయి. అయితే ఈ సమస్యలు అందరిలోనూ రావాలని లేదు. ఇది వ్యక్తి యొక్క శరీర తత్వం, జీర్ణశక్తి, ఎంత పరిమాణంలో తీసుకున్నారు, ఎంత తరచుగా తీసుకుంటున్నారు అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. కొన్ని వంటకాల్లో వంకాయతో పాటు పెరుగు లేదా మజ్జిగ వంటివి వాడతారు. పాలతో పోలిస్తే, పులియబెట్టిన పాల ఉత్పత్తులు (పెరుగు వంటివి) జీర్ణక్రియకు కొంచెం సులువుగా ఉండవచ్చు, కానీ వీటి విషయంలో కూడా మితంగా ఉండటం, మీ శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం ముఖ్యం. వంకాయ కూర తిన్న వెంటనే పాలు తాగడం లేదా పాలతో చేసిన స్వీట్లు తినడం వంటివి చేయకపోవడం మంచిది.మధ్య కనీసం కొంత సమయం వ్యవధి ఉండేలా చూసుకోవాలి. వంకాయ, పాలు రెండూ పోషక విలువలు కలిగిన ఆహారాలే అయినప్పటికీ, ఆయుర్వేద సూత్రాల ప్రకారం వాటిని కలిపి తీసుకోకపోవడమే శ్రేయస్కరం. ముఖ్యంగా జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలు, అలెర్జీలు ఉన్నవారు ఈ కలయికకు దూరంగా ఉండటం ఉత్తమం.

# మార్కెట్

## కుప్పకూలిన సెన్సెక్స్, నిఫ్టీ.. రూ.11 లక్షల కోట్ల సంపద ఆవిరి

ప్రపంచ మార్కెట్లను ట్రేడ్ వార్ భయాలు ముంచెత్తడంతో, భారతీయ స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను చవిచూశాయి.



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పరస్పర సుంకాల భయాల నేపథ్యంలో రిస్క్-ఆఫ్ సెంటిమెంట్ నెలకొనడంతో, సెన్సెక్స్ , నిఫ్టీ 50 సూచికలు నష్టాలను మిగిల్చాయి.. సెన్సెక్స్ 930.67 పాయింట్లు ( 1.22 శాతం ) పతనమై 75,364.69 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 345.65 పాయింట్లు ( 1.49 శాతం ) నష్టపోయి 22,904.45 వద్ద స్థిరపడింది. మార్కెట్లో కేవలం 1081 షేర్లు మాత్రమే లాభపడగా, ఏకంగా 2721 షేర్లు నష్టాల బాట పట్టాయి. 131 షేర్లలో మాత్రం ఎటువంటి మార్పు లేదు. ఈ రాశులకు అఖండ సంపదను ప్రసాదిస్తున్న సూర్య భగనువాడు మదుపర్లు తమ ఈక్విటీ హోల్డింగ్‌లను విక్రయించడంతో, ఒక్కసారిగా 11 లక్షల కోట్ల రూపాయల సంపద ఆవిరైపోయింది. నిఫ్టీ 50 సూచికలో, %ాచీ+జ%, హిందాల్కో, సిప్లా వంటి దిగ్గజ కంపెనీలు వరుసగా ఆరు శాతానికి పైగా కుప్పకూలాయి. సుంకాల భయాలతో అమ్మకాలు ఊపందుకోవడంతో మార్కెట్ మరింత క్షీణించింది. 5 ఆటో, ఫార్మా, ఐటీ, మెటల్ రంగాల సూచీలు భారీగా పడిపోవడంతో, అన్ని రంగాల సూచీలు నష్టాలను చవిచూశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 , నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 మధ్యాహ్నం సెషన్‌లో మూడు శాతం వరకు పడిపోవడంతో చిన్న , మధ్య తరహా మార్కెట్లు కూడా తీవ్రంగా నష్టపోయాయి.23,300 మార్క్ దాటి నిఫ్టీ.. ఐటీ, బ్యాంకింగ్ షేర్లకు భారీ మద్దతు" "అంచనాలకు మించిన పరస్పర సుంకాలు, ప్రపంచ వృద్ధి, ద్రవ్యోల్బణం, కంపెనీల ఆదాయాలపై పెరిగిన అనిశ్చితి కారణంగా పెట్టుబడిదారులు మరింత జాగ్రత్తగా వ్యవహరించే అవకాశం ఉంది," అని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. "భారతీయ మార్కెట్, చాలా రంగాల, స్టాక్‌ల అధిక వాల్యుయేషన్లు సంభావ్య నష్టాలను పెద్దగా పట్టించుకోలేదని సూచిస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు.

### ట్రంప్ టారిఫ్‌ల ఎఫెక్ట్..
## మరింత పెరగనున్న ఐఫోన్ ధరలు..?





రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరతీసిన విషయం తెలిసిందే. మిత్రులు, శత్రువులు అనే తేడా లేకుండా భారత్ సహ ప్రపంచ దేశాలపై ప్రతీకార సుంకాలతో (%ఖతీఱటటం%) దాడికి దిగారు. అమెరికాకు దిగుమతయ్యే అన్ని దేశాల ఉత్పత్తులపై కనీసం 10 శాతం టారిఫ్‌లు విధించిన అధ్యక్షుడు ట్రంప్.. గరిష్ఠంగా 49 (అత్యధికంగా కంబోడియా) శాతం వరకు పన్నులు విధించారు. భారత్‌పై 26 శాతం, చైనాపై 34 శాతం, ఐరోపా దేశాలపై 20 శాతం వరకు సుంకాలు విధించారు. ట్రంప్ టారిఫ్‌ల దెబ్బకు ఐఫోన్‌లు మరింత ప్రియం కానున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ అయిన యాపిల్ ఐఫోన్ ధరలు భారీగా పెరగనున్నట్లు మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఐఫోన్‌ల ప్రొడక్షన్ ప్రధానంగా చైనా కేంద్రంగా జరుగుతోన్న విషయం తెలిసిందే. ఆ దేశ ఉత్పత్తులపై ట్రంప్ భారీగా సుంకాలు విధించారు. ఆ ప్రభావం ఐఫోన్ ధరలపై పడనుంది. ఐఫోన్ మోడల్‌ను బట్టి 30 నుంచి 40 శాతం వరకూ పెరగనున్నట్లు సమాచారం. అయితే, ధరల పెరుగుదల యాపిల్ సంస్థపై ఆధారపడి ఉంటుంది. టారిఫ్ భారాన్ని సంస్థే భరించడమా..? లేక వినియోగదారులపై మోపడమా అనేది యాపిల్ నిర్ణయించాల్సి ఉంది. ప్రస్తుతం అందరికీ సులభంగా అందుబాటులో ఉండే ఐఫోన్ 16 మోడల్ ధర 799 అమెరికన్ డాలర్లుగా ఉంది. అంటే భారత కరెన్సీలో సుమారు రూ.68,000 అన్నమాట. అయితే, పన్నుల భారాన్ని సంస్థ వినియోగదారులపై మోపితే ఇదే మోడల్ ధర 1,142 డాలర్లకు చేరే అవకాశం ఉంది. అంటే ఇండియన్ కరెన్సీలో సుమారు రూ.97 వేలకుపైమాటే. ఇక ప్రీమియం మోడల్ ఐఫోన్ 16 ప్రోమ్యాక్స్ (1టెరాబైట్ మోడల్) 2,300 డాలర్లకు.. అంటే రూ.2 లక్షలకు చేరుకునే అవకాశం ఉంది. గతంలో యాపిల్ సంస్థకు కొన్ని ప్రత్యేక మినహాయింపులు లభించి పన్నుల భారాన్ని తగ్గించుకోగలిగింది. కానీ ఈసారి అటువంటి రాయితీలు లభించకపోవచ్చని సమాచారం. ఇప్పటికే ప్రధాన మార్కెట్లలో ఐఫోన్ విక్రయాలు ఆశించిన స్థాయిలో లేవు. తాజా పరిస్థితుల్లో ధరలు మరింతగా పెరిగితే అమ్మకాలు మరింత పతనం కానున్నాయని మార్కెట్ వర్గాల అంచనా. ఫలితంగా చైనా వెలుపల తయారయ్యే యాపిల్ ప్రధాన పోటీదారు అయిన శామ్‌సంగ్ లబ్ధిపొందే అవకాశం ఉంది.

## మార్కెట్లకు ట్రంప్ సెగ

ముంబై : దేశీయ ఈక్విటీ మార్కెట్లకు ట్రంప్ టారిఫ్‌ల సెగ గట్టిగానే తాకింది. దేశీయ దిగుమతులపై 27 శాతం అదనపు సుంకాలు విధించనున్నట్లు ప్రకటించడంతో మదుపరులు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యారు. దీంతో నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. ఇంట్రాడేలో 800 పాయింట్లకు పైగా నష్టపోయిన సెన్సెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి 322.08 పాయింట్లు పడిపోయి 76,295.36 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 82.25 పాయింట్లు కోల్పోయి 23,250.10 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 186 పాయింట్లు కోల్పోయింది. అయితే సూచీలు భారీగా నష్టపోయినప్పటికీ మదుపరుల సంపద పెరగడం విశేషం. బీఎస్‌ఈ నమోదిత సంస్థల విలువ రూ.35,170.32 కోట్లు పెరిగి రూ.4,13,33.265.92 కోట్లకు చేరుకున్నది. అమ్మకాల్లో ఐటీ షేర్లు ఐటీ కంపెనీల షేర్లు కుప్పకూలాయి. ట్రంప్ ప్రతీకార సుంకాలను విధించడంతో ఈ రంగానికి చెందిన సూచీలు 10 శాతం వరకు నష్టపోయాయి. పెర్సిస్టెంట్ సిస్టమ్స్ అత్యధికంగా 9.92 శాతం నష్టపోగా, కాఫోర్జ్ 7.77 శాతం, కేపీఐటీ టెక్నాలజీ 7.66 శాతం, టీసీఎస్ 3.98 శాతం, టెక్ మహీం ద్రా 3.79 శాతం, హెచ్‌సీఎల్ టెక్నాలజీ షేరు 3.71 శాతం, ఇన్ఫోసిస్ 3.41 శాతం, విప్రో 2.75 శాతం చొప్పున నష్టపోయాయి. బీఎస్‌ఈ ఐటీ ఇండెక్స్ 1,348.57 పాయింట్లు లేదా 3.78 శాతం నష్టపోయి 34,293.59కి జారుకున్నది.

# ఆంధ్రప్రదేశ్

## ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట

### ఉద్యోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు

### ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం

అమరావతి,మే1 : ఏపీఎస్ఆర్టీసీలో అన్ని విభాగాల్లోని ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ సంస్థలోని ఉద్యోగులకు వైద్య పరీక్షలు తప్పనిసరి చేసింది. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని జారీ చేసిన ఆ ఆదేశాల్లో ఎండీ స్పష్టం చేశారు. డ్రైవర్లు, కండక్టర్లకు ప్రతి ఆరు నెలకు.. ఇతర ఉద్యోగులకు ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సంస్థలో ప్రివెంటివ్ హెల్త్ కేర్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అందుకోసం అన్ని జిల్లాల్లో ఈ పరీక్షలు ప్రారంభించారు. ఏపీఎస్ఆర్టీసీలో ప్రతి ఏడాది సుమారు 300 మంది ఉద్యోగులు మరణిస్తున్నారు. ఆర్టీసీ ఆసుపత్రులు, డిస్పెన్సరీలలో డ్రైవర్లలో గుండె సంబంధిత వ్యాధి లక్షణాలు పెరుగుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సంస్థలోని ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఏపీఎస్ఆర్టీసీలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ హెల్త్/లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. పిరియాడికల్ చెకప్‌లో రక్త పరీక్షలు చేర్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. ముందస్తు పరీక్షలతో ప్రాణ రక్షణ సాధ్యమని అధికారులు భావిస్తున్నారు.

## పదిరోజుల్లో శంర విలాస్ బ్రిడ్జి నిర్మాణం పనులు

### మే నెల చివరి నాటికి డ్రైన్ల నిర్మాణం పూర్తి

### కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడి

గుంటూరు,మే1 : గుంటూరు నగరంలోని శంకర్ విలాస్ సమీపంలో నిర్మిస్తున్న బ్రిడ్జి కోసం చేపట్టిన భూ సేకరణ జులై నాటికి పూర్తవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. మరో పదిరోజుల్లో ఈ బ్రిడ్జి నిర్మాణం పనులు వేగవంతం అవుతాయని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేజ్ -3 పనులు వేగవంతం చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించామన్నారు. శుక్రవారం గుంటూరులో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులతో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సమీక్ష నిర్వహించారు. నార్ల వెంకటేశ్వర రావు ఆడిటోరియం అభివృద్ధికి బిడ్డింగ్ పూర్తయిందన్నారు. వేసవిలో ప్రజల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.కొత్తగా 220 ఈ ఆటోలు గుంటూరు నగర పాలక సంస్థకి రానున్నాయని వివరించారు. దీని ద్వారా నగరంలో చెత్త సేకరణ మరింత సులువు అవుతుందని తెలిపారు. మే నెల చివరి నాటికి నగరంలో డ్రైన్ల నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. గరంలో 22 పార్కుల అభివృద్ధికి రూ.7.2 కోట్లు కేటాయించినట్లు కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు. పార్కుల్లో పిల్లలకు ఆట వస్తువులతోపాటు జిమ్ పరికరాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. నగరంలో వీధి కుక్కల సమస్య అధికంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు 125 వీధి కుక్కలకు ఆపరేషన్ చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి తెలిపారు.

## నలుగురు ఫుడ్ సేఫ్టీ ఉద్యోగుల సస్పెండ్

### విధుల్లో నిర్లక్ష్యంపై కమిషనర్ ఉత్తర్వులు

అమరావతి,మే1 : రాజధాని అమరావతిలోని ఫుడ్ సేఫ్టీ ప్రధాన కార్యాలయంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురు ఉద్యోగస్థులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ సస్పెండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండ్యన్ ఆదేశాలు జారీ చేశారు. మంగళగిరిలోని ఆహార భద్రత శాఖ (ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్రివెంటివ్ మెడిసిన్) ప్రధాన కార్యాలయంలో సూపరింటెండెంట్ డి. శిరీష, సీనియర్ అసిస్టెంట్స్ జి. అఖిల్, సంగీత రావు, జె. సుజాత విధులు నిర్వహిస్తున్నారు. అయితే అనధికారికంగా సెలవుపై వెళ్లడం, విశ్రాంత ఉద్యోగికి ఆర్థిక ప్రయోజనాల చెల్లింపుల విషయంలో స్పందించకపోవడం తదితర కారణాలతో సుజాతను సస్పెన్షన్ చేశారు. అలాగే విధి నిర్వహణలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించకపోవడంతోపాటు పలుమార్లు హెచ్చరించినప్పటికీ మార్పు కనిపించక పోవడంతో మిగిలిన వారిని సస్పెన్షన్ చేశారు. ఈ మేరకు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.నలుగురు ఉద్యోగస్థులపై గతంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్‌కు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీనిపై మంత్రి విచారణకు ఆదేశించారు. విచారణ నివేదిక ఆధారంగా ఈ నలుగురిపై చర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. విధి నిర్వహణలో అలక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఉద్యోగస్థులను కమిషనర్ వీర పాండ్యన్ హెచ్చరించారు.

## ఆత్మీయ పలకరింపుతో ఎన్టీఆర్ భరోసా

### పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ జి.లక్ష్మీశ

### 2,26,396 మందికి రూ. 98.52 కోట్ల పంపిణీ

విజయవాడ,మే1 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ విజయవాడ గ్రామీణ గొల్లపూడి, ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లిలో జరిగిన కార్యక్రమంలో స్వయంగా పాల్గొని లబ్దిదారులను ఆత్మీయంగా పలకరించి పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులు, దివ్యాంగులు ఇతర అర్హులైన వర్గాల సంక్షేమం కోసం పెద్దఎత్తున చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి నెలా సమయానికి పెన్షన్లు అందించడం ద్వారా వారి జీవనోపాధికి, సామాజిక భద్రతకు భరోసా కల్పించడం ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. జిల్లాలో మొత్తం 2,26,396 మంది లబ్దిదారులకు రూ. 98.52 కోట్లు పెన్షన్ల రూపంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు పరిధిలో ఇంటి వద్దకే పెన్షన్లు అందించడం వల్ల లబ్దిదారులు సౌకర్యంగా సేవలు పొందుతున్నారని పేర్కొన్నారు. అలాగే, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా, అవినీతి రహితంగా అమలు కావడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

# బెంగాల్లో రెండు నియోజకవర్గాల్లో రీ పోలింగ్

### మొత్తం 15 పోలింగ్ బూతుల్లో నేడు ఎన్నిక

### కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

### ఇవిఎంల ట్యాంపరింగ్ ఆరోపణలు తోచిపుచ్చిన ఇసి




న్యూఢిల్లీ,మే1 : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో కొన్నిచోట్ల అవకతవకలు జరిగినట్టు వచ్చిన ఫిర్యాదులపై భారత ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. రెండు నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని నిర్ణయించింది. మగ్రహత్ పశ్చిమ్ నియోజకవర్గంలోని 11, డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 పోలింగ్ బూత్‌లలో మే 2న శనివారం రీపోలింగ్ జరుపనున్నట్టు ప్రకటించింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈనెల 29న జరిగిన ఎన్నికలకు సంబంధించి 142-మగ్రహత్ పశ్చిమ్ ఏసీ, 143-డైమండ్ హార్బర్ ఏసీ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారుల నుంచి అందిన సమాచారం ప్రకారం ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 58లోని సబ్ సెక్షన్ (2)కింద 15 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్‌కు ఎన్నికల కమిషన్ నిర్ణయించినట్టు ఈసీ తెలిపింది. కాగా, రీపోలింగ్‌కు సంబంధించి పోలింగ్ ఏరియాల్లో విస్తృతమైన ప్రచారం జరపాలని, తాజా పోలింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని అభ్యర్థులకు లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సంబంధింత అధికారులను ఈసీ ఆదేశించింది. ఈనెల 29న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ తుది విడత పోలింగ్ ముగిసింది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. ఇదిలావుంటే భవానీపూర్‌లో పరిస్థితిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి మమతా బెనర్జీ సౌత్ కోల్‌కతాలోని స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లడం, బీజేపీ కార్యకర్తలు అడ్డుకోవడంతో తలెత్తిన హైడ్రామాపై ఎన్నికల కమిషన్ స్పందించింది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరిగిందంటూ తృణమూల్ కాంగ్రెస్ చేసిన ఆరోపణలను తోసిపుచ్చింది. మమతా బెనర్జీ పోటీచేసిన భవానీపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కౌంటింగ్ సెంటర్ సఖావత్ మెమోరియల్ స్కూల్‌లో ఉంది. అక్కడి ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసేందుకు బీజేపీ ప్రయత్నించినట్టు టీఎంసీ కార్యకర్తలు ఆరోపించారు. అయితే టీఎంసీ ఆరోపణను నార్త్ కోల్‌కతా జిల్లా ఎన్నికల అధికారి స్మితా పాండే తోసిపుచ్చారు. పోస్టల్ బ్యాలెట్లను సెగ్రిగేట్ చేయడానికి చట్టబద్ధమైన పక్రియ ఉంటుందన్నారు. ఎన్నికల విధుల్లో ఉంటే అధికారులు, సిబ్బంది నేరుగా ఓటు వేయలేరని, అందువల్ల ఫెసిలిటేషన్ సెంటర్‌లో వారు తమ ఓటు హక్కును వినియోగించుకుంటారని చెప్పారు. ఈ పక్రియ కూడా పూర్తి కట్టుదిట్టమైన, భద్రతా వాతావరణంలో జరుగుతుందన్నారు. 'మా వాళ్లు కారిడార్‌లో కూర్చుని ఉన్నారు. ఈవీఎం స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేసి ఉంది' అని చెప్పారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈవీఎంలు, పోస్టల్ బ్యాలెట్ల నిర్వహణ ఉంటుందని, ఈవీఎం రూమ్ సెపరేట్‌గా, పోస్టల్ బాలెట్ల రూమ్ సెపరేట్‌గా ఉంటాయని, తాము వాటిని తొలగించి సెగ్రిగేట్ చేస్తామని వివరించారు. ఈవీఎం ట్యాంపరింగ్ ఆరోపణల నేపథ్యంలో కౌంటింగ్ సెంటర్ వద్ద మమతాబెనర్జీ గురువారం రాత్రి సుమారు నాలుగు గంటలు ఉన్నారు. నిష్పాక్షిక ఎన్నికల పక్రియ నిర్వహణకు పారదర్శకత, సీసీటీవీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరని ఆమె ఉన్నారు. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ఎలాంటి చర్యలను సహించేది లేదని హెచ్చరించారు. ప్రజల ఓట్లను పరిక్షించాలని, తనకు పలు ఫిర్యాదులు రావడంతో ఇక్కడకు వచ్చానని, కేంద్ర బలగాలు తొలుత తనను లోపలకు రానీయలేదని చెప్పారు.

## పంజాబ్ అసెంబ్లీలో విశ్వాస తీర్మానం

### ఎంపిల జంప్‌తో ఆప్ బలంగా ఉందని చాటే యత్నం

చండీఘడ్,మే1 : పంజాబ్ అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం శుక్రవారంనాడు ప్రవేశపెట్టింది. అరవింద్ కేజ్రీవాల్ సారథ్యంలోని 'ఆప్' నుంచి ఏడుగురు రాజ్యసభ ఎంపీలు ఇటీవల బీజేపీలోకి ఫిరాయించడంతో ఆప్ ప్రభుత్వం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసింది. ప్రభుత్వంపై విశ్వాస తీర్మానాన్ని ముఖ్యమంత్రి భగవంత్ మాన్ సభలో ప్రవేశపెట్టారు. ఆప్ బలంగా ఉందని, పార్టీ మరింత విస్తరించనుందని తెలిపారు. జమ్మూకశ్మీర్ నుంచి గోవా వరకూ ఆప్ బలంగా ఉంది. జమ్మూకశ్మీర్‌లోని దోడాలో కూడా మాకు ఒక ఎమ్మెల్యే ఉన్నారు. పంజాబ్‌లో మా ప్రభుత్వ విజయవంతంగా నడుస్తోంది. ఢిల్లీలో మేము విపక్షంలో ఉన్నాం. గుజరాత్‌లో ఐదుగురు, గోవాలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాకు ఉన్నారు. వీటితో పాటు అనేక ప్రాంతాల్లో మేయర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు ఉన్నారు. మా పార్టీ జాతీయ పార్టీగా గుర్తింపు కలిగి ఉంది' అని భగవంత్ మాన్ ఈ సందర్భంలో సభకు వివరించారు. ఒకరోజు ప్రత్యేక సమావేశానికి ఎమ్మెల్యేలంతా హాజరుకావాలని ఇంతకుముందు ఒక విప్‌ను కూడా ఆప్ జారీ చేసింది. పంజాబ్ అసెంబ్లీలో 117 మంది సభ్యులుండగా, 94 మంది సభ్యులతో ఆప్ సంపూర్ణ మెజారిటీ కలిగి ఉంది. కాంగ్రెస్‌కు 16 మంది, బీఎస్‌పీకి ఒకరు, సాద్‌కు ముగ్గురు, బీజేపీకి ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఒక ఇండిపెంటెంట్ ఎమ్మెల్యే కూడా సభలో ఉన్నారు. కాగా, ఏప్రిల్ 24న ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి దెబ్బ తగిలింది. పార్టీకి చెందిన 10 మంది రాజ్యసభ సభ్యులలో రాఘవ్ చద్దా, అశోక్ మిట్టల్, సందీప్ పాఠక్, హర్భజన్ సింగ్, రాజేంద్ర గుప్తా, విక్రమ్‌జిత్ సాహ్నీ, స్వాతి మలివాల్ పార్టీని వీడి బీజేపీలో విలీనం అయ్యారు. ఈ ఏడుగురు ఎంపీల్లో ఆరుగురు పంజాబ్‌కు చెందిన వారే కావడం విశేషం. వచ్చే ఏడాది పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నాయి. ఈ క్రమంలో అసెంబ్లీలో తీర్మానం ద్వారా మరోమారు ఆప్ బలంగా ఉందని నిరూపించారు.

## ఇవిఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద అర్ధరాత్రి మమత

### మమత కదలికలపై నిఘా పెట్టామన్న సువేందు

కోల్‌కతా,మే1 : కోల్‌కతాలోని ఒక ఈవీఎం స్ట్రాంగ్ రూమ్ వద్ద ముఖ్యమంత్రి మమతా బెనర్జీ గురువారం రాత్రి నాలుగు గంటల సేపు ఉండటం, తెల్లవారుజామున 12.07 గంటలకు అక్కడి నుంచి వెళ్లిపోవడంపై బీజేపీ నేత సువేందు అధికారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ఫలితాలకు మందు ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆమె కదలికలపై తాము నిఘా ఉంచినట్టు చెప్పారు. అనుక్షణం ఆమె కదలికను తమ ఏజెంట్ గమినిస్తూ వచ్చినట్టు చెప్పారు. ఇందుకు సంబంధించి భవానీపూర్ స్ట్రాంగ్ రూమ్‌లో మమతా బెనర్జీ ఉన్న ఫోటోను సోషల్ మీడియాలో ఆయన శుక్రవారంనాడు షేర్ చేశారు.'ఔట్‌గోయింగ్ సీఎం ఎంత ప్రయత్నించినా నిబంధనలు ఉల్లంఘించకుండా మేము అడ్డుకున్నాం' అని సువేందు పేర్కొన్నారు. భవానీపూర్ నియోజక వర్గం నుంచి మమతాబెనర్జీపై బీజేపీ అభ్యర్థిగా సువేందు అధికారి పోటీ చేశారు. ఖావత్ మెమోరియల్ స్కూలులో ఉన్న స్టాం÷-రగ్ రూమ్‌ను మమతాబెనర్జీ గురువారం రాత్రి సందర్శించడంతో హైడ్రామా చోటుచేసుకుంది. ఈవీఎంల ట్యాంపరింగ్ జరుగుతున్నట్టు పలు ఫిర్యాదులు వచ్చినందునే తాను స్వయంగా వచ్చినట్టు మమత చెప్పారు. కేంద్ర బలగాలు తొలుత తనను రానీయలేదన్న ఆమె.. అక్కడే నాలుగు గంటల పాటు ఉన్నారు. అనంతరం స్టాం÷-రగ్ రూమ్ నుంచి బయటకు వస్తూ, ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసే ఎలాంటి చర్యలను సహించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈవీఎంలు దొంగిలించేందుకు, ఓట్ల లెక్కింపులో అవకతవకలు చేసేందుకు ఎవరు ప్రయత్నించినా జీవన్మరణ పోరాటం చేస్తామని అన్నారు. కాగా, ఉత్తర కోల్‌కతాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ఈవీఎంలను నేతాజీ ఇండోర్ స్టేడియంలో భద్రపరచగా, అక్కడ కూడా టీఎంసీ నేతలు ధర్నాకు దిగారు.

## టిడ్కో గృహాల పూర్తి పై ప్రత్యేక దృష్టి

### జూన్ నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయండి..

### జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.

విజయవాడ,మే1 : జిల్లాలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల పనులను వేగవంతం చేసి, జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేసి లబ్దిదారులకు గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ అధికారులకు ఆదేశించారు.శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో టిడ్కో గృహాల నిర్మాణ పురోగతిపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పేదలకు సొంతింటి కలను నెరవేర్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. జిల్లాలో టిడ్కో ఇళ్ల నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలన్నారు. లబ్దిదారులకు సౌకర్యవంతమైన నివాస వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. జిల్లాలో టిడ్కో గృహ నిర్మాణ ప్రాజెక్టుల పనుల పై దృష్టి పెట్టి నిర్మాణ పనులు ఎక్కడైనా నిలిచిపోయినట్లయితే వెంటనే సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 11,520 టిడ్కో గృహాలను త్వరలో పూర్తి చేయాలన్నారు. జక్కంపూడిలో 6576 గృహాలకు గాను 2,256 టిడ్కో ఇళ్లు అందించడం జరిగిందని మరో 4,320 ఇళ్లు లబ్దిదారులకు అందించాల్సిన ఉందన్నారు. ఇందులో జూన్ నాటికి కనీసం 3 వేల గృహాలు లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగ్గయపేటలో 2000 తిరువూరులో 672 గృహాలు జూన్ నాటికి అందించాల్సిన భాధ్యత సంబంధిత అధికారులపై ఉందన్నారు. గృహాల నిర్మాణ నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని, పనులు ప్రమాణాలకు అనుగుణంగా జరగాలని తెలిపారు. లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమగ్ర ప్రణాళికతో పనులు పూర్తి చేయాలని సూచించారు. జక్కంపూడి టిడ్కో గృహాల కోర్టు కేసులను వారం రోజులలో పూర్తి చేసి పనుల అనుమతి ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజయవాడ రూరల్ తహాశీల్ధార్‌ని ఆదేశించారు. జక్కంపూడి గృహ సముదాయానికి సంబంధించి లబ్దిదారులకు 100 కోట్లు, జగ్గయ్యపేట లబ్దిదారులకు 40 కోట్లు, తిరువూరు లబ్దిదారులకు సంబంధించి 90 కోట్లు, నందిగామ సంబంధించి 2 కోట్లు బ్యాంకుల నుండి ఋణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిస్ట్రిక్ లీడ్ బ్యాంకు (ఎల్‌డిఎం)ను ఆదేశించారు. ప్రతి మంగ, గురువారాలలో లబ్దిదారులతో సమావేశం నిర్వహించి రిజిస్టేషన్‌లలో ఎదురయ్యే సమస్యలపై పరిష్కరించి రిజిస్టేషన్ పక్రియ పూర్తి చేయాలని ఇందుకు ప్రత్యేకంగా సబ్ రిజిస్ట్రార్‌ని ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ జిల్లా రిజిస్ట్రార్‌ను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ హెచ్‌ఎం ధాన్యచంద్ర, టిడ్కో ప్రాజెక్టు డైరెక్టర్ బి.చిన్నోడు, ఎల్‌డిఎం ఎం. ప్రియాంక, విజయవాడ రూరల్ తహాశీల్థార్ బి. సుగుణ జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు మున్సిపల్ కమిషనర్లు ఇరిగేషన్ హౌసింగ్, రెవెన్యూ శాఖల అధికారులు, టిడ్కో గృహ నిర్మాణ ఏజెన్సీలైన ఎన్‌సిసి లిమిటెడ్, ఎల్‌అండ్‌టి లిమిటెడ్, వెల్‌కో ప్రాజెక్ట్స్ హరి ఇన్‌ఫ్రా రాఘరాం, ఎంఎస్ఆర్ ద్వారకా ప్రతినిధులు పాల్గొన్నారు.

## మెడికల్ సీట్ల పేరుతో నయా దందా

### పిల్లల తల్లిదండ్రులకు సిపి సజ్జన్నార్ హెచ్చరిక

హైదరాబాద్,మే1 : నీట్ యుజీ పరీక్ష నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనార్ కీలక సూచనలు చేశారు. వైద్య విద్యపై ఉన్న అపారమైన క్రేజ్‌ను పెట్టుబడిగా మార్చుకో వాలని కొందరు మోసగాళ్లు, దళారులు ప్రయత్నిస్తున్నారు. తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్త వహించాలని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీపీ విన్నవించారు. 'మీ పిల్లలను డాక్టర్లుగా చూడాలనే ఆశతో మోసగాళ్ల మాయమాటల ఉచ్చులో పడకండి' సీపీ సజ్జనార్ విన్నవించారు.'మీ పిల్లలు నీట్‌లో తక్కువ మార్కులు సాధించినా, మేనేజ్‌మెంట్ కోటాలో చాలా తక్కువ ధరకే ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని లేదా ఫిలిప్పీన్స్, కిర్గిజ్‌స్థాన్, కజకిస్థాన్, జార్జియా, చైనా, అర్మేనియా, కరేబియన్ దేశాల్లో అతి తక్కువ ఖర్చుతో వైద్య విద్య పూర్తి చేయవచ్చని ఆకర్షణీయంగా చెప్పి మోసం చేసే ఏజెంట్ల మాటలు నమ్మవద్దు' అని హెచ్చరించారు.గతంలో హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఇలాంటి ముఠాలు అనేక మంది తల్లిదండ్రులను మోసం చేశాయని సీపీ గుర్తుచేశారు.

## సమర్థవంతమైన ఉద్యోగి వి.వి. ప్రసాద్...

### మీడియా సమన్వయంలో తనదైన ముద్ర..

### ప్రసాద్ సేవలు మరి కొంత కాలం అవసరం..

### జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ.

విజయవాడ,మే1 : అత్యంత కీలకమైన సమాచార పౌర సంబంధాల శాఖలో వి.వి.ప్రసాద్ సమర్థవంతమైన సేవలతో వృత్తికి వన్నె తెచ్చారని ఆయన సేవలు మరికొంత కాలం అవసరమని జిల్లా కలెక్టర్ డా.జి. లక్ష్మీశ అన్నారు. సమాచార పౌరసంబధాల శాఖ జిల్లా పౌర సంబంధాల కార్యాలయంలో ఎ.వి.సూపర్ వైజర్ గా పనిచేసి పదవీ విరమణ చేసిన వి.వి. ప్రసాద్ మీడియా ప్రతినిధుల ఆత్మియ కలయిక కార్యక్రమం శుక్రవారం నగరంలోని హనుమాన్ పేట నందు గల ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మాట్లాడుతూ మీడియాను సమన్వయం చేయటం కీలకమైన అంశం అన్నారు. వి.వి. ప్రసాద్ ప్రభుత్వ కార్యక్రమాలలో ఎటువంటి సమస్యలు రాకుండా మీడియాను చాలా అద్భుతంగా సమన్వయం చేశారని అభినందించారు. తన 13 ఏళ్ల సర్వీసులో వి.వి.ప్రసాద్ వంటి ఉత్తమ కోఆర్డినేటర్‌ను ఎక్కడా చూడలేదని, తన టీం ఎన్‌టిఆర్‌లో ఒక ప్రధానమైన ఎసెట్ అని అన్నారు. సమర్థవంతమైన సేవలందిస్తున్న ప్రసాద్ పదవీ విరమణ పొందడం తనకు ఇష్టం లేదని, ఆయన సేవలు జిల్లాకు ఇంకా అవసరమన్నారు. అందుకే ఆయనను తిరిగి నియమించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వృత్తిపరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా వి.వి.ప్రసాద్ చాలా మంచి మనిషి అన్ని తనకు కుటుంబ సభ్యుడులాంటి వాడని అన్నారు. ఆయన తిరిగి పునర్:నియామకం జరిగేలా అవసరమైన చర్యలు సమాచార శాఖ అధికారులు తీసుకోవాలని కోరారు. ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని అనంతరం కుటుంబ సభ్యులతో అనందమైన జీవితం, ఆరోగ్యం సంతోషంగా ఉండాలని కలెక్టర్ డా.జి. లక్ష్మీశ ఆకాంక్షించారు. సమాచార శాఖ జాయింట్ డైరెక్టర్ పి. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ సమాచార శాఖలో సమర్థవంతమైన సేవలందిస్తున్న వారిలో వి.వి. ప్రసాద్ ఒకరని అన్నారు. ఉద్యోగ ప్రస్థానం సినీ అపరేటర్‌గా ప్రారంభమైనప్పటికి ఫోటోగ్రాఫర్‌గా పిఆర్‌వోగా మీడియా సమన్యకర్తగా అసమానమైన సేవలందించి మంచి గుర్తింపు పొందన్నారు. జాయింట్ డైరెక్టర్ ఐ. సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఉద్యోగ పరంగా సేవలందించడంతో పాటు ప్రతి ఒక్కరికి వ్యక్తిగతమైన సేవలు అందించడంతో వి.వి. ప్రసాద్ తనదైన ముద్ర వేసుకున్నారని ఆయనకు అప్పగించిన ఎటువంటి క్లిష్టతరమైన పనినైన అత్యంత చాకచక్యంతో సులువుగా పూర్తి చేసి అధికారులతో శభాష్ అనిపించుకునేవారు. జాయింట్ డైరెక్టర్ టి. కసూరి మాట్లాడుతూ సమాచార శాఖ ఉద్యోగులలో వి.వి. ప్రసాద్‌కు మంచి గుర్తింపు ఉందని ఆయనపనితీరు ఆదర్శవంతంగా తీసుకోవాలని ముఖ్యంగా మీడియా ప్రతినిధులతో ఉద్యోగిగా కాకుండా కుటుంబ సభ్యునివలే ఆదరాభిమానాలు పొందరన్నారు. పదవీ విరమణ పొందిన వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ 29 ఏళ్ళుగా విజయవాడలో సమాచార శాఖ ద్వారా మీడియా మిత్రులకు సేవలందించే భాగ్యం కల్పించినందుకు ఆయన భగవంతుడికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానన్నారు. 1997లో అప్పటి జిల్లా కలెక్టర్ శ్రీమతి చిత్ర రామచంద్రన్ కాలం నుండి ప్రస్తుత జిల్లా డా.జి. కలెక్టర్ లక్ష్మీశ వరకు అందరు కలెక్టర్ల వద్ద పని చేయడం తన అదృష్టమని పేర్కొన్నారు. ప్రస్తుత జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తన పనితీరును మెచ్చి, తనను తిరిగి నియామకం చేసేలా ప్రభుత్వానికి రాసిన సిఫార్సు లేఖను తన జీవితంలో అతిపెద్ద అవార్డుగా భావిస్తున్నానని ఆయన భావోద్వేగానికి లోనయ్యారు. తన పదవీ కాలంలో మీడియా మిత్రులు తనను ఒక కుటుంబ సభ్యునిలా, 'ప్రసాద్ అన్న' అని పిలుస్తూ ఆదరించారని తాను పదవిలో ఉన్నా లేకపోయినా, ప్రాణం ఉన్నంత వరకు సమాచార శాఖకు, మీడియా మిత్రులకు తన వంతు సేవలు అందిస్తూనే ఉంటానని వి. వి ప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సమాచార శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు ఎస్.వి. మోహనరావు, పి. రాజశేఖర్, కె. నారాయణరెడ్డి, ఎఎస్ వీరభద్రరావు, డిఐపిఆర్‌వో కె.వి. రమణరావు, పిఆర్‌వో జి. రాంబాబు, పింట్, ఎలక్ట్రానిక్ సోషల్ మీడియా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# ది ప్యారడైజ్ నుంచి మరో పాట విడుదలకు రెడీ

'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి బయటకొచ్చిన ఆయా షేర్. పాటకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మే రెండో వారంలో దీన్ని బయటకు వదలనున్నారని.. ఇదో ప్రేమ గీతంగా ఉండనుందని సమాచారం. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమాని ఆగస్టు 21న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తగ్గట్లుగానే మే చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో చిత్ర బృందం షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.




## ఓటిటిలోకీ ఎంట్రీ ఇచ్చిన రాకాస

యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో, నయన్ సారిక హీరోయిన్‌గా నటించిన హారర్ కామెడీ చిత్రం రాకాస ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. దర్శకురాలు మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రం థియేటర్లలో మంచి స్పందన అందుకున్న తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. చిన్న సినిమాగా వచ్చినప్పటికీ, మంచి నిర్మాణ విలువలు, వినోదాత్మక కథతో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'రాకాస' ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ వేదికగా నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన వారు ఇప్పుడు ఈ సినిమాను ఇంటి వద్దే ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు. ఈ సినిమా హారర్ ఎలిమెంట్స్‌తో పాటు కామెడీ మేళవింపుతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించబడింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలతో కలిసి చూసేందుకు సరదాగా ఉండే కంటెంట్‌గా ఇది నిలుస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. వీకెండ్ లేదా హాలిడే టైంలో ఫ్యామిలీతో కలిసి చూడడానికి ఇది మంచి ఆప్షన్‌గా చెప్పవచ్చు. ఈ చిత్రాన్ని నిహారిక కొణిదెల సమర్పించగా, జీ స్టూడియోస్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. టెక్నికల్‌గా కూడా సినిమా మంచి స్థాయిలో ఉండటం, వినోదాన్ని అందించే కథా రూపకల్పన ఉండటం ఈ చిత్రానికి ప్లస్‌గా మారాయి. మొత్తానికి థియేటర్లలో మంచి టాక్ తెచ్చుకున్న 'రాకాస' ఇప్పుడు ఓటీటీలో మరింత విస్తృతమైన ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైందని చెప్పాలి. హారర్ కామెడీ జానర్‌ను ఇష్టపడే వారికి ఈ సినిమా బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తోంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకున్నట్టు తెలుస్తుంది.




# మరోమారు సుకుమార్-రామ్‌చరణ్ కాంబో

### పెద్ది విడుదల తరవాత పట్టాలెక్కనున్న ప్రాజెక్ట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానతో కలిసి తన 16వ చిత్రం పెద్దిలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలు సొంతం చేసుకోగా, తదుపరి ప్రాజెక్ట్‌పై కూడా అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. చరణ్ కెరీర్‌లో 17వ సినిమాగా దర్శకుడు సుకుమార్‌తో ఓ భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ కాంబినేషన్ అనౌన్స్ అయినప్పటి నుంచే ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ అయింది. గతంలో సుకుమార్, చరణ్ కాంబినేషన్‌లో వచ్చిన 'రంగస్థలం' భారీ విజయాన్ని అందుకోవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా విడుదల తర్వాత రామ్ చరణ్ ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా వెంటనే తన 17వ సినిమాను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 'పెద్ది' జూన్‌లో విడుదల కానుండగా, అదే నెలలో సుకుమార్ ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభించే ఎ÷-లాన్‌లో ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్‌తో పాటు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నారు. భారీ బ్జడెట్‌తో, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను రూపొందించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. సుకుమార్ తన ప్రత్యేకమైన కథనం, డిఫరెంట్ టేకింగ్‌తో సినిమాలను తెరకెక్కించడంలో పాపులర్ కాగా, రామ్ చరణ్ కూడా తన నటనతో ప్రేక్షకులని మరింత అలరించే దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోయే ఈ సినిమా మరోసారి ఇండస్ట్రీలో కొత్త రికార్డులు సృష్టిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఏదిఏమైన 'పెద్ది' తర్వాత గ్యాప్ లేకుండా చరణ్ కొత్త సినిమా స్టార్ట్ చేయనున్నాడనే వార్త మెగా ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.



# బాలయ్యతో సినిమాకు శేఖర్ కమ్ముల యత్నం?

టాలీవుడ్‌లో కొన్ని కాంబినేషన్ల గురించి మొదట వినగానే ఆశ్చర్యంగా అనిపిస్తాయి. కానీ అవి నిజమైతే మాత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశం ఉంటుంది. ఇప్పుడు అలాంటి అరుదైన కాంబినేషన్ గురించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. క్లాస్ సినిమాల దర్శకుడిగా పేరొందిన శేఖర్ కమ్ముల, మాస్ హీరో నందమూరి బాలకృష్ణతో సినిమా చేయబోతున్నారనే వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. శేఖర్ కమ్ముల సినిమాలు అంటే సహజత్వం, భావోద్వేగాలు, సమాజానికి సంబంధించిన అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. 'ఆనంద్', 'గోదావరి', 'హ్యాపీ డేస్' వంటి చిత్రాలతో ఆయన క్లాస్ దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'లీడర్' సినిమా ద్వారా రాజకీయ నేపథ్యంతో కూడిన కథను కూడా బలంగా చూపించారు. మరోవైపు బాలకృష్ణ అంటే హై వోల్టేజ్ యాక్షన్, గంభీరమైన డైలాగ్స్, మాస్ ఎలిమెంట్స్ గుర్తుకొస్తాయి. ఈ ఇద్దరి స్టైల్ పూర్తిగా భిన్నమైనప్పటికీ, అదే ఈ కాంబినేషన్‌పై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల శేఖర్ కమ్ముల కథల ఎంపికలో కొత్త కోణాలను ప్రయత్నిస్తున్నారని టాక్. ఇక బాలయ్య కూడా వరుస విజయాలతో ఫామ్‌లో ఉండటంతో పాటు, కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా సమాజానికి సందేశం ఇచ్చే బలమైన కథలో నటించాలని ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో శేఖర్ కమ్ముల చెప్పిన ఒక పవర్‌ఫుల్ కథాంశం బాలయ్యను ఆకట్టుకుందని చెబుతున్నారు. ఈ సినిమా ఒక పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఇందులో బాలకృష్ణ ఒక వ్యవస్థను ప్రశ్నించే నాయకుడిగా లేదా సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగే పాత్రలో కనిపించవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. శేఖర్ కమ్ముల భావోద్వేగాల మేళవింపు, బాలయ్య శక్తివంతమైన తెరపైన ప్రెజెన్స్ కలిస్తే ప్రేక్షకులకు ఒక కొత్త అనుభవం లభించడం ఖాయం అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ అధికారికంగా ప్రకటిస్తే మాస్, క్లాస్ ప్రేక్షకులిద్దరినీ థియేటర్లకు రప్పించే శక్తి ఈ కాంబోకు ఉందని విశ్లేషకులు అంటున్నారు.




# గందరగోళంలో పడేసేలా..జెట్లీ మూవీ

మత్తు వదలరా' సిరీస్ చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు రితేశ్ రానా. ఇప్పుడు సత్యతో కలిసి ఆయన రూపొందించిన సినిమా 'జెట్లీ'. ప్రజాపతి (అజయ్) వ్యాపారవేత్త. రూ.15 వేల కోట్ల బ్యాంకింగ్ స్కామ్‌కు పాల్పడి.. దేశం వదిలి దుబాయ్ పారిపోతాడు. దీంతో కేంద్ర హోం మంత్రి మేల్కోటి (శ్రీనివాస్ వడ్లమాని) అతన్ని అరెస్ట్ చేసి తిరిగి దేశానికి రప్పించే బాధ్యతను భారత ఇంటెలిజెన్స్‌కి అప్పజెప్తాడు. అయితే, అప్పటికే జజీరా సిండికేట్‌తో పాటు ఇంకొంత మంది శత్రువుల నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలియడంతో.. ప్రజాపతి స్వయంగా లొంగిపోయినట్లు నటించి, ఆ తర్వాత తప్పించుకోవాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. అతన్ని దుబాయ్ నుంచి కొచ్చికి ప్రత్యేక విమానంలో తీసుకొస్తుండగా.. ఆ స్కామ్‌లో భాగమైన మిగతా వ్యక్తులు తనని చంపేందుకు ఓ ప్రణాళిక రచిస్తారు. ఇలా భారత ఏజెంట్స్ నుంచి తప్పించుకోవాలని ప్రజాపతి.. అతన్ని చంపాలని శత్రువులు ప్రయత్నిస్తున్న తరుణంలో ఆ విమానంలోకి గతం మర్చిపోయిన స్థితిలో డాక్టర్ వేదవ్యాస్ (సత్య) పాత్ర ఎంట్రీ ఇస్తుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అసలు వేదవ్యాస్ ఎవరు? తన వల్ల ప్రజాపతి ఎస్కేప్ ప్లాన్ ఎలా తలకిందులైంది? ప్రజాపతి శత్రువుల్ని అతనెందుకు అడ్డుకున్నాడు? ఆఖరికి ఆ విమానం సేఫ్‌గా కొచ్చిలో ల్యాండ్ అయిందా? లేదా? ఈ కథలో ఏజెంట్ శివానీ రాయ్ (రియా సింఘా), సినీ సుడోకు ఆడుకునే వెన్నెల కిశోర్ పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి. 'మత్తు వదలరా', 'హ్యాపీ బర్త్‌డే' సినిమాలు చూసిన వారికి రితేశ్ కామెడీ స్టైల్, తన చిత్రాల్లోని పాత్రలు ఎంత గమ్మత్తుగా ఉంటాయన్నది తెలిసే ఉంటుంది. ఈ 'జెట్లీ' కూడా పూర్తిగా అదే మీటర్‌లో సాగే టిపికల్ కామెడీ కథతో.. చిత్రమైన క్యారెక్టరైజేషన్లతో నిండి ఉంటుంది. ఈ కథంతా పూర్తిగా ఓ విమానంలోనే జరుగుతుంటుంది. బ్యాంకింగ్ స్కామ్‌కి పాల్పడిన ఓ బిజినెస్‌మ్యాన్‌ని ప్రాణాలతో చట్టం ముందు నిలబెట్టాలని రా ఏజెంట్స్.. అతన్ని దారిలోనే చంపేయాలని శత్రువులు.. వీళ్లందరి ప్రణాళికల్ని తారుమారు చేసే హీరో పాత్ర.. ఇలా లైన్‌గా చూసినప్పుడు కథంతా ఆసక్తిరేకెత్తించేలా అనిపిస్తుంది. కానీ, రితేశ్ దీన్ని తెరపై ఆవిష్కరించిన తీరే కాస్త గందరగోళంగా అనిపిస్తుంది. ప్రజాపతి పాత్రను.. అతడి బ్యాంకింగ్ స్కామ్‌ను టైటిల్ కార్డ్స్‌తోనే పరిచయం చేసిన దర్శకుడు.. ఆ వెంటనే కథను నేరుగా ఫ్లైట్ ఎక్కించేశాడు. ఇక ఆ విమాన ప్రయాణం మొదలైనప్పటి నుంచి ఈ సినిమాలోని ఒక్కో పాత్ర నెమ్మదిగా ప్రేక్షకులకు పరిచయమవుతుంటుంది. గతం మర్చిపోయిన స్థితిలో డాక్టర్ వేదవ్యాస్‌గా సత్య మేల్కొనడం.. తనెవరన్నది అర్థం కాక గందరగోళానికి గురవ్వడం.. ఈ క్రమంలో పండే కన్ఫ్యూజన్ కామెడీ ఆరంభంలో బాగానే అనిపించినా.. ఆ తర్వాత రొటీన్‌గా అనిపిస్తుంది. ఇంటర్వెల్ వరకు కథ అక్కడక్కడే తిరుగుతున్న అనుభూతి కలుగుతుంటుంది. ఈ మధ్యలో సినీ సుడోకు పేరుతో వెన్నెల కిశోర్ చేసే హంగామా.. గుండు సుదర్శన్ బాంబు పేరుతో చేసే హడావుడి.. అంతా బలవంతంగా ఇరికించిన కామెడీ ట్రాక్స్‌లాగే ఉంటాయి.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com